

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 152

సోమవారం 22-8-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



షటిల్ సమరం

నేటి నుంచి టోక్యోలో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ - 12లో



రాబడి కోసం కొత్త మార్గం!

ఇన్‌వాయిస్ పెట్టుబడులు.. ఓటీటీ ఆదాయంపైనా ఇన్వెస్ట్‌మెంట్ - 13లో



హిమాచల్ కాంగ్రెస్‌కు షాక్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ హిమాచల్ కాంగ్రెస్ నేత, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఆనంద్ శర్మ తన పదవి నుంచి వైదొలిగారు.

వివరాలు 6లో



చైనా లోన్ యాప్స్ గుట్టురట్టు

చైనా లోన్ యాప్స్ నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. రుణాలు చెల్లించాలంటూ జనాన్ని పీడిస్తున్న 22 మందిని అరెస్టు చేశారు.

వివరాలు 6లో



ఢిల్లీలో తికాయత్ నిర్బంధం

నిరుద్యోగంపై ఢిల్లీలో జరిగే నిరసనలో పాల్గొనేందుకు వెళ్తున్న రైతు నేత రాకేశ్ తికాయత్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 6లో



పుతిన్ సన్నిహితుడి కుమార్తె హత్య

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన అలగ్జాండర్ డుగిన్ కుమార్తె డారియా దారుణ హత్యకు గురయ్యారు.

వివరాలు 6లో

పెట్టుబడుల ప్రవాహం

2022 ప్రథమార్థంలో రూ.20,682 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి

2020 జనవరి నుంచి 2022 జూన్ వరకు రూ.40,872 కోట్ల పెట్టుబడులు సాకారం

- రెండున్నరేళ్లలో కొత్తగా 129 యూనిట్ల ద్వారా రూ.24,956 కోట్ల పెట్టుబడులు
- కేంద్ర డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి
- ఎంఎస్‌ఎంఈలతో కలిపి మూడేళ్లలో 28,343 యూనిట్లు ప్రారంభం
- 2.48 లక్షల మందికి ఉపాధి
- చర్చల దశలో మరో రూ.2.50 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు
- 'ఉదయం' పోర్టల్‌లో ఇప్పటికే 40,000 యూనిట్లు నమోదు



సాక్షి, అమరావతి: ప్రపంచాన్ని పట్టి పీడించిన కోవిడ్ సంక్షోభం తగ్గుముఖం పట్టడంతో పారిశ్రామికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తూనే ఇప్పటికే రాష్ట్రంలో పెట్టిన యూనిట్లను త్వరితగతిన పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. ప్రతి నెలా రాష్ట్రంలో పరిశ్రమల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేలా పరిశ్రమల శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది సత్ఫలితాలనిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు అంటే ఆర్నెల్ల వ్యవధిలో రాష్ట్రంలో 22 భారీ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించగా వీటి ద్వారా రూ.20,682 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు డీపీఐఐటీ తన తాజా నివేదికలో వెల్లడించింది. తొలి ఆరు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించిన ప్రధాన కంపెనీల్లో గ్రాసిం ఇండస్ట్రీస్, పానాసోనిక్ లైఫ్ సైన్స్‌సొల్యూషన్స్, కాప్రికాన్ డిస్టిలరీ, ఆంజనేయ ఫెర్రో అల్లాయిస్, నోవా ఎయిర్, తారక్ టెక్స్‌టైల్స్, టీహెచ్‌కే ఇండియా, కిసాన్ క్రాఫ్ట్, తారకేశ్వర స్పిన్నింగ్ మిల్ లాంటివి ఉన్నాయి. కోవిడ్ సంక్షోభం కుదిపివేసిన 2020, 2021తో పోలిస్తే ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో రెట్టింపు పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. 2019లో 42 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ.9,840 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రాగా 2021లో రూ.10,350 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గత రెండున్నరేళ్లలో మొత్తం 111 యూనిట్లు ఉత్పత్తిని

మిగతా 2వ పేజీలో ▶

నిండుకుండలా అనంతపురం జిల్లా శింగనమల చెరువు



ఈ ఏడాదీ లోటు లేదు

ఖరీఫ్‌లో కరువుదీరా వానలు.. 22 జిల్లాల్లో సాధారణ వర్షపాతం

సత్యసాయి, బాపట్ల, అనంతపురం, కాకినాడలో అధికం

వరసగా నాలుగో ఏడాదీ పంటలకు ఊరట

సాక్షి, విశాఖపట్నం: వర్షాల కోసం రైతన్నలు ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా వరుణుడి కరుణతో ఈ ఏడాదీ నైరుతి రుతుపవనాలు 'లోటు' లేకుండా మేలు చేస్తున్నాయి. జూన్ రెండో వారంలో రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఉపరితల ఆవర్తనాలు, ద్రోణి, అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడుతూ రుతుపవనాల్లో చురుకుదనాన్ని పెంచి వానలకు కారణమవుతున్నాయి. ఈ సీజన్‌లో బంగాళాఖాతంలో ఇప్పటివరకు

మిగతా 5వ పేజీలో ▶

గత ఏడాది కూడా..

గత ఏడాది కూడా నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఆశాజనకంగానే వర్షాలు కురిశాయి. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజనులో సాధారణ వర్షపాతం 514.4 మిల్లీమీటర్లు కాగా 613.3 మిల్లీమీటర్ల వర్షం (19 శాతం అధికం) కురిసింది. ధాన్యలక్ష్మితో రైతన్నల లోగిళ్లు కళకళలాడాయి.

న్యూస్‌రీల్

వైభవం.. వరసిద్ధుని మహాకుంభాభిషేకం



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని శిల్ప కళా సౌందర్యంతో పునర్నిర్మించగా.. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు.

వివరాలు 5లో ▸

టీచర్ల అటెండెన్స్ యాప్‌లో ఇబ్బందుల పరిష్కారం



ప్రభుత్వ టీచర్ల హాజరు నమోదుకు ఎదురవుతున్న ఇబ్బందులను విద్యా శాఖ పరిష్కరించింది. యాప్‌లో పలు మార్పులు చేసింది. 10 నిమిషాలు గ్రేస్ టైమ్ ఇచ్చింది. నెట్‌వర్క్ సమస్యల వల్ల హాజరును గుర్తించలేని టీచర్ల కోసం ఆఫ్‌లైన్‌లో హాజరును గుర్తించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

వివరాలు 2లో ▸

కరువుపై చైనా మేఘమథన అస్త్రం!



దక్షిణ చైనాలో కరువు ఉరుముతోంది. పంటలు ఎండిపోతున్నాయి. నదుల్లో నీరు లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో కరువును అధిగమించడానికి మేఘమథనంపై చైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

వివరాలు 6లో ▸

జనరల్ మెడిసిన్‌కు డిమాండ్!

రెండో ప్రాధాన్యంగా రేడియాలజీ, ఆర్థోపెడిక్స్

- ఇప్పటికే నీట్ పీజీ జాతీయ ర్యాంకుల విడుదల
- త్వరలో రాష్ట్ర ర్యాంకుల విడుదల
- రాష్ట్రంలో 2 వేలకు పైగా పీజీ వైద్య సీట్లు.. వచ్చే నెలలో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: పీజీ వైద్య విద్యలో ఈ ఏడాది జనరల్ మెడిసిన్ సీట్లకు ఎక్కువ డిమాండ్ ఉండే అవకాశం ఉంది. గత మూడు, నాలుగేళ్లుగా సీట్ల భర్తీ తీరును పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. జనరల్ మెడిసిన్ చేస్తే సూపర్ స్పెషాలిటీలో మంచి కోర్సులు చేసేందుకు అవకాశాలుంటాయి. జనరల్ మెడిసిన్(ఎండీ) పూర్తయ్యాక గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ, మెడికల్ అంకాలజీ, కార్డియాలజీ, వంటి సూపర్ స్పెషాలిటీ (డీఎం) కోర్సులు చేసేందుకు వీలుంటుంది. ఈ క్రమంలో తొలి కౌన్సెలింగ్‌లోనే జనరల్ మెడిసిన్ సీట్లు భర్తీ అవుతున్నాయి. వైద్య విద్యార్థుల రెండో ప్రాధాన్యంలో రేడియాలజీ, ఆర్థోపెడిక్స్, ప్రసూతి, గైనకాలజీ(ఓబీజీ), పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ కోర్సులుంటున్నాయి. దేశవ్యాప్తంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2022–23 విద్యా సంవత్సరానికి పీజీ వైద్య విద్య ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కానుంది. నెలాఖరులోగా ప్రవేశ ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మరో వైపు రాష్ట్ర కోటా సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఇప్పటికే ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రం నుంచి నీట్ పీజీ–2022లో 8,636 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 13 ప్రైవేట్, ఒక మైనారిటీ వైద్య కళాశాలలున్నాయి. వీటిలో 2,207 పీజీ ఎండీ/ఎంఎస్ సీట్లున్నాయి. వీటిలో ఆలిండియా కోటా కింద 475 సీట్లు భర్తీ అవుతాయి. మిగిలిన సీట్లలో 1,138 సీట్లు కన్వీనర్ కోటాలో, 594 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ, గుంటూరు వైద్య కళాశాల, కాకినాడలోని

మిగతా 2వ పేజీలో ▶

నేడు ప్రధానితో సీఎం వైఎస్ జగన్ భేటీ

- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర మంత్రులతోనూ సమావేశం
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ
- విభజన హామీల అమలు, నిధులు, బకాయిలు విడుదల చేయాలని కోరనున్న ముఖ్యమంత్రి జగన్


2లో



ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సర్కారు 'యంత్ర'తంత్రం

కూలీల కొరతకు చెక్



- అక్కరకొస్తున్న వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు
- అద్దె ప్రాతిపదికన సన్న, చిన్నకారు రైతులకు వివిధ రకాల పరికరాలు
- ఒక్కో రైతుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆదా

2లో



అక్రమ దందాలకు అడ్డుకట్ట

- సీసీటీఎన్‌ఎస్ పరిధిలోకి సెబ్
- నేరాలు, నేరస్తుల డేటా రికార్డు
- మరింత సమగ్రంగా కేసుల దర్యాప్తు

3లో



హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్

కేసీఆర్ సర్కారు పతనానికి నాంది

- 'మునుగోడు సమరభేరి'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానం

2లో

ఆర్‌ఆర్‌ఆర్‌లో నటన భేష్

జూనియర్ ఎన్టీఆర్‌ను అభినందించిన అమిత్‌షా.. ఆదివారం రాత్రి నోవాటెల్‌లో భేటీ.. కలిసి భోజనం

ఇదంజగత్



మీరేం చెప్పారో.. వాళ్లేం అర్థం చేసుకున్నారో తెలియడం లేదాసర్!

మద్యంపై మతిలేని ప్రచారం

- లిక్కర్ పర్చేజ్ కార్డులంటూ ఫేక్ వీడియోలతో టీడీపీ దుష్ప్రచారం
- ఆ ఉద్దేశమే లేదని స్పష్టం చేసిన బెవరేజస్ కార్పొరేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు విపక్ష టీడీపీ రోజుకో కొత్త కుట్రకు తెర తీస్తోంది. ఇటీవల మార్ఫింగ్ వీడియోలు బెడిసికొట్టగా.. ఈ దఫా రాష్ట్ర ప్రభుత్వం 'లిక్కర్ పర్చేజ్ ఐడీ కార్డులు' ప్రవేశపెడుతోందంటూ అసత్యాలతో కూడిన వీడియోను యూట్యూబ్‌లో విడుదల చేసింది. టీవీ వార్త మాదిరిగా భ్రమింపజేసేలా రూపొందించిన ఆ వీడియోను సోషల్ మీడియాలో ప్రచారంలోకి తెచ్చి తప్పుదోవ పట్టిస్తోంది. వీడియోలో ఉన్న కథనాన్ని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ఖండించింది. ప్రస్తుతం ఉన్న విధానమే కొనసాగుతుందని పేర్కొంది.

ఆదాయం కోసమంటూ బురద చల్లుడు..
రాష్ట్రంలో మద్యం కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా 'లిక్కర్ పర్చేజ్ ఐడీ కార్డులు' ఉండాలనే నిబంధనను ప్రభుత్వం తెస్తోందని యూట్యూబ్ వీడియోలో విపక్షం దుష్ప్రచారం చేస్తోంది. ఏడాది కాలపరిమితితో రూ.5 వేల చొప్పున ఒక్కో కార్డు విక్రయిస్తారని, అది చూపిస్తేనే మద్యం విక్రయిస్తారని, ఆదాయం కోసం ప్రభుత్వం ఈ నిబంధన తెచ్చిందని బురద చల్లుతోంది.

అది పూర్తిగా అవాస్తవం
'లిక్కర్ పర్చేజ్ కార్డులు' జారీ చేయనున్నట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవ రెడ్డి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వీడియో దురుద్దేశంతో కూడుకున్నదని చెప్పారు. దశలవారీగా మద్యం నియంత్రణ విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అక్రమాలు, సిండికేట్లకు తావివ్వకూడదనే మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాల విధానంలో ఎలాంటి మార్పు లేదని వెల్లడించారు.

టీచర్ల అటెండెన్స్ యాప్‌లో ఇబ్బందుల పరిష్కారం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరు నమోదుపై ఆన్‌లైన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను పాఠశాల విద్యాశాఖ పరిష్కరించింది. ఈ మేరకు టీచర్ల అటెండెన్స్ యాప్‌లో మార్పులు చేసింది. ఈ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరును గుర్తించడంలో మొబైల్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి సవరించిన మార్గదర్శకాలను ఆదివారం జారీచేసింది. దీని ప్రకారం..

టీచర్లు పాఠశాలలో ప్రతి పనిదినం ఉ.9 గంటలకు ముందు తమ హాజరు నమోదు చేయాలి. ప్రస్తుత విధానం ప్రకారం టీచర్ల హాజరును గుర్తించడానికి 10 నిమిషాలు గ్రేస్ టైమ్‌గా పరిగణిస్తారు. నెట్‌వర్క్ సమస్యల కారణంగా హాజరును గుర్తించలేని టీచర్ల కోసం ఆఫ్‌లైన్‌లో హాజరును గుర్తించడానికి యాప్‌లో తగిన సదుపాయం అందుబాటులో ఉంచింది. ఆఫ్‌లైన్‌లో హాజరు క్యాప్చర్ అవుతుంది. అనంతరం నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నప్పుడు అది సింక్రనైజ్ అవుతుంది. ఆండ్రాయిడ్ ఫోన్‌లేని టీచర్లు హెడ్మాస్టర్ లేదా ఇతర టీచర్ల మొబైల్స్‌ద్వారా తమ హాజరును నమోదు చేయవచ్చు. సెలవు మాడ్యూల్‌లో మార్కింగ్ డిప్యుటేషన్/శిక్షణ/విధి నిర్వహణల నిబంధన అమలవుతుంది. ఈ మాడ్యూల్ 25న విడుదల అవుతుంది. హెడ్మాస్టర్లు, టీచర్లు ఏకీకృత హాజరు మొబైల్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసి, నమోదు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సురేష్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు.

జనరల్ మెడిసిన్‌కు డిమాండ్!

▶ మొదటి పేజీ తరువాయి
రంగరాయ వంటి కాలేజీల్లో పీజీ వైద్య సీటు కోసం అభ్యర్థులు తీవ్రంగా పోటీపడతారు. మరో వైపు రాష్ట్రం నుంచి నీట్ ఎండీఎస్–2022లో 896 మంది అర్హత సాధించారు. ప్రభుత్వ పరిధిలో విజయవాడ, కడపలలో రెండు డెంటల్ కళాశాలలున్నాయి. ఈ రెండు కళాశాలలు, ప్రైవేట్ డెంటల్ కళాశాలల్లో 400 వరకూ ఎండీఎస్ సీట్లున్నాయి.

ఇన్ సర్వీస్ సీట్ల భర్తీ ఇలా..
రాష్ట్ర ప్రభుత్వ కోటాలోని 50% సీట్లలో 30% క్లినికల్, 50% నాన్ క్లినికల్ సీట్లను ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించిన ఇన్–సర్వీస్ అభ్యర్థులకు కేటాయించారు. మరో వైపు ఇన్–సర్వీస్ కోటా నిబంధనల్లో ప్రభుత్వం ఈ ఏడాది మార్పులు చేసింది. గిరిజన ప్రాంతాల్లోని రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వం గుర్తించిన సంస్థల్లో రెండేళ్లు పనిచేసిన వైద్యులకు ఇన్ సర్వీస్ కోటా కింద ప్రవేశాలకు అవకాశం కల్పించింది. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు, ఏపీ వైద్య, ఆరోగ్య సేవలు, ఏపీవీవీపీ, ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, యూనివర్సిటీల్లో నిరంతరాయంగా ఆరేళ్లు సేవలందించిన వారికి ఇన్ సర్వీస్ కోటాలో ప్రవేశాలు కల్పించనున్నారు. స్పెషలైజేషన్ పూర్తయ్యాక ఇన్‌సర్వీస్ కోటా కోసం పని చేసినట్టు చూపిన ప్రాంతంలోనే ఆరేళ్ల పాటు పనిచేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో పీజీ సీట్ల వివరాలిలా..

(నోట్: 2022–23 సీట్ మ్యాట్రిక్స్ ఇంకా ప్రకటించలేదు. గడిచిన ఏడాది మ్యాట్రిక్స్ ప్రకారం ఈ వివరాలు)	ప్రభుత్వ పరిధిలో కన్వీనర్ కోటా-509 ఆలిండియా కోటా-475
	ప్రైవేట్‌లో.. కన్వీనర్ కోటా-618 మేనేజ్‌మెంట్ కోటా-580
	ఎఫ్ఐఎంఎస్ కడప కన్వీనర్ కోటా-11 మేనేజ్‌మెంట్ కోటా-14

అల్లూరి తొలి దాడికి వందేళ్లు

- 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై మెరుపు దాడి
- నాటి వీరోచిత ఘట్టాన్ని స్మరించుకుంటూ నేడు చింతపల్లిలో సభ
- హాజరుకానున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా, డిప్యూటీ సీఎం రాజన్న దొర


అల్లూరి సీతారామరాజు దాడిచేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్ ఇదే..

సాక్షి, అమరావతి/చింతపల్లి/చింతపల్లి రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విల్లంబులు ఎక్కుపెట్టి.. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై మెరుపు దాడి చేసిన ఘటనకు సరిగ్గా వందేళ్లు నిండాయి. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై అల్లూరి తన బృందంతో తొలి దాడి జరిపారు. నాటి వీరోచిత ఘట్టాన్ని స్మరించుకుంటూ సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో సభ జరగబోతోంది.

చింతపల్లితో మొదలుపెట్టి..
మన్యంలో గిరిజనులపై బ్రిటిష్ సేనలు సాగిస్తున్న దౌర్జన్యాలను ఎదురించాలంటే.. సాయుధ పోరాటమే శరణ్యమనే నిర్ణయానికి వచ్చాడు అల్లూరి సీతారామరాజు. మన్యానికే చెందిన గంటం దొర, మల్లు దొర, మొట్టడం వీరయ్యదొర, కంకిపాటి ఎండు పడాలు, సంకోజీ ముక్కడు, వేగిరాజు సత్యనారాయణరాజు (అగ్గిరాజు), గోకిరి ఎర్రేసు (మాకవరం), బొంకుల మోదిగాడు వంటి 150 మందికి పైగా వీరులతో బృందాన్ని ఏర్పాటు చేశాడు. తొలుత చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేయాలని 1922 ఆగస్టు 19న నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడటంతో మన్యంలో తిరుగుబాటు మొదలైంది. ఈ దాడిలో 11 తుపాకులు, 5 కత్తులు, 1,390 తుపాకీ గుళ్లు, 14 బాయ్‌నెట్లను ఆ బృందం ఎత్తుకెళ్లింది. ఆగస్టు 23న రాత్రి కృష్ణదేవిపేట, ఆగస్టు 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపైనా అల్లూరి బృందం దాడి చేసింది. ఆ మూడు పోలీస్ స్టేషన్ల నుంచి మొత్తం 26 తుపాకులు, 2,500కు పైగా మందుగుండు సామగ్రిని అల్లూరి బృందం ఎత్తుకెళ్లింది. దీంతో ఆగ్రహించిన బ్రిటిష్ పాలకులు మన్యంలో విప్లవ దళాన్ని అంతం చేయడానికి కబార్డు, హైటర్ అనే అధికారులను చింతపల్లి ప్రాంతానికి పంపించింది. ఆ ఇద్దరు అధికారులను రామరాజు దళం గెరిల్లా యుద్ధరీతిలో సెప్టెంబర్ 24న హతమార్చింది. ఆ తరువాత అక్టోబర్ 15న ముందుగానే సమాచారం ఇచ్చి మరీ అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై అల్లూరి బృందం దాడి చేయడం అత్యంత సాహసోపేతమైనదిగా గుర్తింపు పొందింది. అక్టోబర్ 19న రంపచోడవరం స్టేషన్‌ను పట్టపగలే ముట్టడించారు. ఆ తరువాత 1923 ఏప్రిల్ 17న అన్నవరం పోలీస్ స్టేషన్, 1923 జూన్ 10న మల్కన్‌గిరి పోలీస్ స్టేషన్, ట్రెజరీ, సెప్టెంబర్ 22న పాడేరు పోలీస్ స్టేషన్‌పైన దాడులు జరిగాయి. కాగా, కొయ్యూరు గ్రామ సమీపంలో ఏటి ఒడ్డున స్నానం చేస్తున్న రామరాజును 1924 మే 7న బ్రిటిష్ పోలీసులు బంధించగా.. మేజర్ గుడాల్ తుపాకీతో కాల్చి చంపాడు.

నేడు భారీ బహిరంగ సభ
చింతపల్లి స్టేషన్‌పై అల్లూరి బృందం దాడిచేసి వందేళ్లయిన సందర్భంగా సోమవారం చింతపల్లిలోని డిగ్రీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సభకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరు కానున్నారు.

నేడు ప్రధానితో సీఎం జగన్ భేటీ

- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర మంత్రులతోనూ సమావేశం
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ
- విభజన హామీల అమలు, నిధులు, బకాయిలు విడుదల చేయాలని కోరనున్న ముఖ్యమంత్రి


ఆదివారం రాత్రి ఢిల్లీకి చేరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. ఆదివారం రాత్రి 9.40 గంటలకు ఢిల్లీకి చేరుకున్న ఆయన.. విమానాశ్రయం నుంచి నేరుగా అధికారిక నివాస గృహం జన్‌పథ్ 1కు వచ్చారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రధానితో సమావేశం సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాల మేరకు నిధుల విడుదల, నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని పెండింగ్ అంశాలు, నిధుల విడుదల తదితర విషయాల గురించి మాట్లాడనున్నారని తెలిసింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రాష్ట్రానికి ఇస్తున్న రేషన్ విషయంలో హేతు బద్ధత లేదని, దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని.. దీనిని సవరించి రాష్ట్రానికి మేలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రిని కోరనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు తగిన ఆర్థిక సహాయం చేయాలని, భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించిన క్లియరెన్స్‌లు మంజూరు చేయాలని, ఏపీఎండీసీకి ఇనుప గనులు కేటాయించాలని కూడా సీఎం జగన్ కోరనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం అపాయింట్‌మెంట్‌లను అనుసరించి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతిలతో భేటీ కానున్నట్లు సమాచారం. పలువురు కేంద్ర మంత్రులతో కూడా సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిసింది. అవసరమైతే సోమవారం రాత్రి కూడా ఢిల్లీలోనే బస చేసి మంగళవారం కూడా కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు సమాచారం. అంతకు ముందు సీఎంకు ఢిల్లీ విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

పెట్టుబడుల ప్రవాహం

▶ మొదటి పేజీ తరువాయి
ప్రారంభించడం ద్వారా మొత్తం రూ.40,872 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి.

పూర్తి స్థాయిలో చేయూత
పారిశ్రామికవేత్తల నుంచి కంపెనీ ఏర్పాటు ప్రతిపాదన అందిన నాటి నుంచి యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో చేయూత అందించేలా 'వైఎస్సార్ ఏపీ వన్' ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సదుపాయాలు, సేవలు అందిస్తోంది. ఇదే విషయాన్ని పలు కంపెనీల ప్రతినిధులు స్వయంగా ప్రకటించడమే కాకుండా రెండో దశ విస్తరణ పనులకు కూడా శ్రీకారం చుట్టడం తెలిసిందే. తాజాగా విశాఖ వద్ద ప్రముఖ జపాన్ కంపెనీ యకహోమా గ్రూపు సంస్థ ఏటీసీ టైర్స్ యూనిట్ ప్రారంభం సందర్భంగా సంస్థ సీఈవో నితిన్ మంత్రి రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటును కొనియాడారు. సాధారణంగా అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉంటుందని, రాష్ట్రంలో మాత్రం సింగిల్ డెస్క్ విధానంలో వేగంగా మంజూరయ్యాయని తెలిపారు. దీంతో రికార్డు సమయంలో 15 నెలల్లోనే తొలిదశ యూనిట్‌ను ప్రారంభించడమే కాకుండా రెండో దశ పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ ఆంక్షలు ఉన్నప్పటికీ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించినట్లు నోవా ఎయిర్ ప్రతినిధులు 'సాక్షి'కి వెల్లడించారు. 2020 డిసెంబర్‌లో నిర్మాణం ప్రారంభించి 11 నెలల్లోనే పనులు పూర్తి చేశామని, దీనివల్ల 250 టన్నుల ఆక్సిజన్ రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

సులభతర వాణిజ్యంలో మూడో ఏడాదీ మొదటి స్థానం
గత రెండున్నర ఏళ్లలో రాష్ట్రంలోకి కొత్తగా రూ.24,956 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చినట్లు డీపీఐఐటీ నివేదిక పేర్కొంది. 2020 జనవరి నుంచి 2022 జూన్ నాటికి కొత్తగా 129 భారీ యూనిట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఏడాది ఆరునెలల కాలంలో కొత్తగా 23 కంపెనీలు రూ.5856 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సింగిల్ డెస్క్ విధానంలో అన్ని అనుమతులు ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో పారిశ్రామికవేత్తల్లో నమ్మకం ఏర్పడి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని, సులభతర వాణిజ్య ర్యాంకుల్లో వరుసగా మూడో ఏడాదీ ఏపీ మొదటి స్థానంలో నిలబడటం దీనికి నిదర్శనమని తెలిపారు.

ఎంఎస్ఎంఈలతో కలిపి 28,343 యూనిట్లు ప్రారంభం
భారీగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో 28,343 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. వీటిద్వారా రూ.47,490.28 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే కాకుండా 2,48,122 మందికి ఉపాధి కల్పించారు. ఇందులో 28,247 ఎంఎస్ఎంఈలు ఉండగా 96 భారీ యూనిట్లు ఉన్నాయి. ఇవికాకుండా మరో రూ.1,51,372 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన 61 యూనిట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి ఉత్పత్తిని ప్రారంభిస్తే మరో 1,77,147 మందికి ఉపాధి లభించనుంది. ఈ ఏడాది కొత్తగా 1.25 లక్షల ఎంఎస్ఎంఈలను 'ఉదయం' పోర్టల్‌లో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 40,000 యూనిట్లు నమోదయ్యాయి. ఇవి కాకుండా సుమారు రూ.2.50 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు చర్చల దశలో ఉన్నాయి.

ఆర్ఆర్ఆర్‌లో నటన భేష్

- జూనియర్ ఎన్టీఆర్‌ను అభినందించిన అమిత్‌షా
- అంతకుముందు ఫిల్మ్‌సిటీలో రామోజీతో షా సమావేశం


ఫిల్మ్ సిటీలో రామోజీరావుతో చర్చిస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: ఇటీవల దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో హీరో జూనియర్ ఎన్టీఆర్ నటన బాగుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభినందించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో నోవాటెల్ హోటల్‌లో అమిత్‌షాతో జూనియర్ ఎన్టీఆర్ భేటీ అయ్యారు. కొంతసేపు వారు మాట్లాడుకున్నారు. కలిసి భోజనం చేశారు. దాదాపు 11.10 గంటల సమయంలో జూనియర్ ఎన్టీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. 'అత్యంత ప్రతిభావంతుడైన నటుడు, తెలుగు సినిమా తారక రత్నం జూ.ఎన్టీఆర్‌ను ఈ రోజు హైదరాబాద్‌లో కలుసుకోవడం ఆనందంగా ఉంది' అంటూ అనంతరం అమిత్‌షా తెలుగులో ట్వీట్ చేశారు. కొంతసేపటి తర్వాత నోవాటెల్ నుంచి బయటికి వచ్చిన బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ సినిమాలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన జూనియర్ ఎన్టీఆర్‌ను అభినందించేందుకే ఈ భేటీ జరిగిందని చెప్పారు. దీనికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని తెలిపారు. అయితే అమిత్‌షా అత్యంత బిజీ షెడ్యూల్ మధ్య జూ.ఎన్టీఆర్‌తో సమావేశం కావడంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బీజేపీలో చేరాలని, సముచిత ప్రాధాన్యం ఇస్తామని ఎన్టీఆర్‌ను అమిత్‌షా కోరినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, అంతకు ముందు మునుగోడు నుంచి వస్తూ.. ఫిల్మ్ సిటీలో రామోజీరావుతో అమిత్‌షా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య వివిధ అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం.

కేసీఆర్ సర్కారు పతనానికి నాంది

'మునుగోడు సమరభేరి'లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

(మునుగోడు నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి) : మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి గెలుపు ద్వారా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ పతనానికి నాంది అవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరిక సందర్భంగా ఆదివారం 'మునుగోడు సమరభేరి' బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమిత్‌షా.. రాజగోపాల్ రెడ్డికి కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మునుగోడులో రాజగోపాల్‌రెడ్డిని గెలిపిస్తే తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన అంతానికి, అవినీతి ప్రభుత్వ పతనానికి నాంది అవుతుంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుంది. కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించడానికే రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నారు' అని చెప్పారు. ఈ సభలో అమిత్ షా ఇంకా ఏమన్నారంటే..

కేసీఆర్ మజ్లిస్‌కు భయపడుతున్నారు..
- టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తామన్న కేసీఆర్.. మజ్లిస్ పార్టీకి భయపడి అమలు చేయడం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఘనంగా నిర్వహిస్తాం.
- కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామన్నారు.. ఇచ్చారా? ప్రతి జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అన్నారు. నల్లగొండలో నిర్మించారా? పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామన్నారు.. ఇచ్చారా? దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారా? మరోసారి టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. కేటీఆర్‌ను సీఎం చేస్తారే తప్ప దళితుడిని చేయరు.
- హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు దళిత బంధు కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఇస్తామన్నారు. ఎందరికి ఇచ్చారు? ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైంది? గిరిజనులకు భూమి ఇస్తామన్న హామీ ఏమైంది? కేసీఆర్ కొడుకు, కూతురు, అల్లుడు, ఇతర బంధువులకు మాత్రమే ఉపాధి కల్పించుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారింది.
- రైతులను సీఎం కేసీఆర్ తీవ్రంగా మోసం చేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో పండిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం. మోదీ సర్కారు రూ.2 లక్షల కోట్ల సాయం అందించినా.. రాష్ట్రం అప్పుల ఊబిలో ఎందుకు ఉందో టీఆర్ఎస్ సమాధానం చెప్పాలి. తెలంగాణలో కమలం వికసించేలా చేయాల్సిన బాధ్యత మునుగోడు ప్రజల చేతుల్లోనే ఉంది.

సర్కారు 'యంత్ర'తంత్రం.. కూలీల కొరతకు చెక్

- ఆర్బీకే స్థాయిలో 6,781, క్లస్టర్ స్థాయిలో 391 కేంద్రాల ఏర్పాటు
- మిగిలిన ఆర్బీకేల్లో సెప్టెంబర్ అఖరులో ఏర్పాటుకు సన్నాహాలు
- మండలానికి మూడు చొప్పున డ్రోన్స్ సరఫరాకు చర్యలు

■ నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో 980 మంది రైతులు 2,450 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తుంటారు. సీజన్‌లో కూలీలు దొరక్క ఇబ్బందిపడేవారు. చిన్నచిన్న యంత్రాల కోసం కూడా దళారీలను ఆశ్రయించేవారు. సీజన్‌లో బెంగళూరు, హైదరాబాద్ నుంచి తీసుకొచ్చే యంత్రాలకు వేలకు వేలు పోయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆర్బీకేల పరిధిలో ఏర్పాటైన యంత్ర సేవా కేంద్రాల ద్వారా ట్రాక్టర్, కంబైన్ హార్వెస్టర్, ఇతర యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటివల్ల ఒక్కో సీజన్‌లో పంటను బట్టి ఒక్కో రైతుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆదా అవుతోందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు..


యంత్ర సేవా కేంద్రం వద్ద అద్దెకు తీసుకున్న ల్యాండ్ లెవెలర్‌తో పొలాన్ని చదును చేస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి : ఇలా ఈ ఒక్క గ్రామమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటైన వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు రైతుల కష్టాలకు చెక్ చెబుతున్నాయి. కూలీల కొరతను తీర్చడమేకాదు.. పెట్టుబడి ఖర్చును తగ్గిస్తున్నాయి. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను సన్న, చిన్నకారు రైతులకు తక్కువ ధరకే అద్దెకు ఇచ్చేందుకు ఆర్బీకే, క్లస్టర్ స్థాయిల్లో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. రూ.15 లక్షల అంచనా వ్యయంతో ఆర్బీకే స్థాయిలో వివిధ రకాల పరికరాలను 6,781 కేంద్రాల్లో.. రూ.25లక్షల అంచనా వ్యయంతో క్లస్టర్ స్థాయిలోని 391 కేంద్రాల్లో మరికొన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 40 శాతం సబ్సిడీపై రైతు గ్రూపులకు ఈ కేంద్రాల ద్వారా దుక్కి యంత్రాలు, దమ్ము, చదును చేసే పరికరాలు, వరి నాటే, నూర్పిడి యంత్రాలు.. విత్తనం, ఎరువు పరికరాలు, కలుపుతీసే పరికరాలు, సస్యరక్షణ పరికరాలు, కోత కోసే యంత్రాలను అందించింది. వీటితోపాటు ఇటీవలే ఆర్బీకే స్థాయిలో రైతు గ్రూపులకు 3,800 ట్రాక్టర్లను కూడా అధికారులు అందించారు. పంటల సరళి, స్థానిక డిమాండ్‌ను బట్టి యంత్ర పరికరాల ఎంపిక, నిర్వహణ, అద్దెలు నిర్ణయించే బాధ్యత రైతు కమిటీలకు అప్పగించారు. వీటి ధరలు, సంప్రదించవలసిన వారి వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. మిగిలిన ఆర్బీకేల్లో సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు వ్యక్తిగత యంత్ర పరికరాలు కూడా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. మరోవైపు.. సూక్ష్మ ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు వీలుగా మండలానికి మూడు చొప్పున ఈ ఏడాది రెండువేల గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలకు డ్రోన్స్ సరఫరాకు చర్యలు చేపట్టింది.

యంత్రాలతో పెట్టుబడి ఆదా
నిజానికి.. దుక్కి దున్నేందుకు ఎకరాకు రూ.600, దమ్ముకు రూ.1,000లు తీసుకునేవారు. అలాంటిది ప్రస్తుతం ఆర్బీకేల్లోని ట్రాక్టర్లను అద్దెకు తీసుకుంటే రూ.ఐదారు వందలకు మించి అవడంలేదంటున్నారు.

- అలాగే.. సీడ్ కం ఫెర్టిలైట్ డ్రిల్లర్ ద్వారా విత్తనాలతో పాటు మందును ఒకేసారి చల్లేందుకు ఎకరాకు రూ.300 వరకు మిగులుతోందని రైతులు అంటున్నారు.
- జొన్న, మొక్కజొన్న కట్టలు కట్టేందుకు గతంలో ఎకరాకు కూలీలకు రూ.1,500లు ఖర్చయ్యేది. అలాంటిది ప్రస్తుతం కట్టలు కట్టే మిషన్‌వల్ల రూ.ఐదారు వందలు మించి కావడంలేదు.
- మినుము పంటకు పురుగుల మందు పిచికారి కోసం ఎకరాకు ఒక్కో కూలీకి రూ.600 ఖర్చయ్యేది. ప్రస్తుతం రూ.200కు మించి కావడం లేదు.
- ఇక గతంలో కోత మిషన్‌కు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేలు చెల్లించే వారు. కానీ, ఇప్పుడు రూ.2,500 నుంచి రూ.3వేల లోపే అవుతోందని రైతులు చెబుతున్నారు.

..ఇలా ఇతర పరికరాల ద్వారా పొందే ఆదా లెక్కిస్తే రెండు సీజన్లు కలుపుకుని పంటను బట్టి ఎకరాకు రూ.10 వేలకు పైగా ఆదా అవుతోందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

రైతు గ్రూపునకు ఆదాయం



గ్రామంలో ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి ట్రాక్టర్–టిల్లర్ తీసుకున్నాం. మేం వాడుకోగా గ్రామంలో రైతులకు అద్దెకిస్తున్నాం. బయట ఎకరాకు రూ.1,300–రూ.1,500 తీసుకుంటున్నారు. మేం రూ.900–రూ.1,100కు ఇస్తున్నాం. ఎకరాకు రూ.400 వరకు ఆదా అవుతుండడంతో మా వద్ద అద్దెకు తీసుకునేందుకు గ్రామంలో మెజార్టీ రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.
– పత్తి వెంకటబ్రహ్మయ్య, ఆలమూరు, నంద్యాల జిల్లా

పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది



మా గ్రూపు తరపున రెండు రోటీవేటర్లు, రౌండ్ పీలర్, థ్రషర్స్ తీసుకున్నాం. రోటోవేటర్‌కు బయట ఎకరాకు రూ.1,800 వరకు తీసుకుంటున్నారు. మేం రూ.900కే అద్దెకిస్తున్నాం. థ్రషర్‌కు బయట రూ.2వేలు తీసుకుంటే. మేం రూ.1,600కే ఇస్తున్నాం. రౌండ్ పీలర్‌కు కట్టకు రూ.30లు తీసుకుంటే మేం రూ.25లకే ఇస్తున్నాం. వీటివల్ల మాకే కాదు.. గ్రామంలో మెజార్టీ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.
– పగిడి శివరామయ్య, రుద్రవరం, నంద్యాల జిల్లా

ఎవరిపైనా ఆధారపడాల్సిన పనిలేదు



మా గ్రూపు ద్వారా ట్రాక్టర్ తీసుకున్నాం. మేం మిరప, మినుము సాగుచేస్తున్నాం. మేం వినియోగించుకోగా గ్రామంలో మిగిలిన రైతులకు అద్దెకిస్తున్నాం. ట్రాక్టర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎవరిపైనా ఆధారపడకుండా అన్ని రకాల పనులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.
– జిమ్మి సురేష్, దేవరపల్లి, ఏలూరు జిల్లా

రూ.3.64 లక్షలు సబ్సిడీ జమైంది



మా గ్రూపు కింద ఇటీవలే తైవాన్ స్ప్రేయర్లు, న్యూ హాలాండ్ ట్రాక్టర్ తీసుకున్నాం. వీటి ఖరీదు రూ.9.57 లక్షలు కాగా.. రూ.3.64 లక్షల సబ్సిడీ జమైంది. ఖరీఫ్ సాగు వేళ ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మా గ్రూపులో రైతులందరి అవసరాలు పూర్తికాగానే ఇతర రైతులకు అద్దెకిస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది.
– భీమవరపు శివరామకృష్ణ, పెనుమూలి, గుంటూరు జిల్లా

అక్రమ దందాలకు అడ్డుకట్ట

సీసీటీఎన్ఎస్ పరిధిలోకి సెబ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అక్రమ దందాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ప్రభుత్వం మరింత పటిష్టపరుస్తోంది. గంజాయి, మద్యం, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ తదితర దందాలను మరింత సమర్థంగా కట్టడిచేసేందుకు సెబ్‌కు సాంకేతిక సాధన సంపత్తిని సమకూరుస్తోంది. నేరపరిశోధనలో కీలకమైన క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) పరిధిలోకి సెబ్‌ను తీసుకొచ్చింది. మరోవైపు గంజాయి, ఇసుక, మద్యం అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ తదితర నేరాలు, నేరస్తుల డేటాను సమగ్రంగా రికార్డు చేయనుంది. తాజా విధాన నిర్ణయంతో శాంతిభద్రతల పోలీసు విభాగం, సెబ్‌లను అనుసంధానించనుంది.

సమర్థంగా నేరపరిశోధన, నేరాల కట్టడి

నేరపరిశోధనలో సీసీటీఎన్ఎస్ అత్యంత కీలక విభాగం. వివిధ నేరాలు, ఆ కేసుల పరిశోధన, ఆ నేరాలకు పాల్పడిన వారి వివరాలు అన్నింటినీ సీసీటీఎన్ఎస్‌లో సమగ్రంగా రికార్డు చేస్తారు. ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భద్రపరిచే ఈ వ్యవస్థ నేరపరిశోధనలో పోలీసు అధికారులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇటువంటి వ్యవస్థను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసింది. అనంతరం కేంద్ర హోంశాఖ ఇదే వ్యవస్థను జాతీయస్థాయిలో నెలకొల్పింది. అటువంటి సమర్థమైన సీసీటీఎన్ఎస్ పరిధిలో ప్రస్తుతం శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసు విభాగమే ఉంది. గంజాయి, అక్రమ ఇసుక, అక్రమ మద్యం, ఎర్రచందనం స్మగ్లింగ్ తదితర నేరాల కట్టడికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సెబ్‌ను సీసీటీఎన్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని పోలీసు శాఖ తాజాగా నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో గంజాయి, ఇసుక, మద్యం అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు, ఆ నేరస్తుల వివరాలన్నీ సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేస్తారు. ఆ నేరస్తుల స్వభావం, నేరాల చరిత్ర, పెండింగ్‌లో ఉన్న కేసులు తదితర సమాచారమంతా సెబ్ అధికారులకు అందుబాటులోకి వస్తుంది. ఆ కేసుల పరిశోధన కోసం ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో నేరాలకు పాల్పడుతున్న వారికి ఇతర రాష్ట్రాల్లో ఉన్న నేరస్తులు, సిండికేట్‌లతో ఉన్న సంబంధాలు, వ్యాపార, ఆర్థిక లావాదేవీల వివరాలన్నీ పోలీసులకు అందుబాటులోకి వస్తాయి. తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో వ్యవస్థీకృతమైన ముఠాలు అక్కడి నుంచి మన రాష్ట్రంలో గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ వంటి దందాలకు పాల్పడుతున్నాయి. అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారిపై ప్రస్తుతం సెబ్ దాడులు చేసి కేసులు నమోదు చేస్తోంది. తాజాగా సీసీటీఎన్ఎస్ పరిధిలోకి రావడంతో ఇతర రాష్ట్రాల్లోని ముఠాలపై కూడా కేసులు నమోదు చేసేందుకు, అక్రమ దందాను మూలాలతోసహా పెకలించేందుకు మార్గం సుగమమైంది. కేసు దర్యాప్తునకు దేశంలోని ఏ ప్రాంతాలకు వెళ్లాలో తెలియడంతోపాటు సంబంధిత రాష్ట్రాల పోలీసు, దర్యాప్తు సంస్థల సహకారం పొందడం సులభతరమవుతుంది.

పోలీసు, సెబ్ వ్యవస్థల అనుసంధానం

అక్రమ దందాలను అరికట్టడంతో పోలీసు, సెబ్ విభాగాలు మరింత సమన్వయంతో పనిచేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. సీసీటీఎన్ఎస్ పరిధిలోకి పోలీసు విభాగంతోపాటు సెబ్ కూడా చేరింది. అంటే సీసీటీఎన్ఎస్‌లోని సమాచారం రాష్ట్రంలోని 950 పోలీసు స్టేషన్లతోపాటు 208 సెబ్ పోలీసుస్టేషన్లకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పోలీసు బాస్ డీజీపీనే సెబ్‌కు ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. అదే రీతిలో జిల్లాస్థాయిలో ఎస్పీల పర్యవేక్షణలోనే ఏఎస్పీల నేతృత్వంలో సెబ్ విభాగాలు పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు పోలీసు, సెబ్ విభాగాల మధ్య సాంకేతిక అంశాల్లో కొంత సందిగ్ధత ఉంది. ప్రస్తుతం ఈ రెండు విభాగాలు కూడా సీసీటీఎన్ఎస్ పరిధిలోకి చేరడంతో వాటిమధ్య పూర్తి సమన్వయం సాధించినట్లయింది. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు గంజాయి, మద్యం, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమర్థంగా కట్టడిచేసేందుకు అవకాశం ఏర్పడింది. దర్యాప్తులో ఇబ్బందులు తొలగనున్నాయి. సాంకేతిక అంశాలను సాకుగా చూపించి నేరస్తులు తప్పించుకునేందుకు అవకాశం ఉండదు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్య



చినగంజాం: బాపట్ల జిల్లా చినగంజాం మండలానికి చెందిన ఆర్మీజవాన్ అక్కల సూర్యప్రకాష్‌రెడ్డి (26) ఆదివారం జమ్ములో ఆత్మహత్య చేసుకున్నాడు. చినగంజాం ఎస్‌ఐ పీతా నాగబాబు తెలిపిన వివరాల మేరకు.. మూలగానివారి పాలెం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్‌రెడ్డి తాను ప్రేమించిన యువతి తన ప్రేమను తిరస్కరించిందని మనస్తాపం చెంది విధుల్లో ఉండగా జమ్ములోని ఆర్మీ క్వార్టర్స్‌లో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సూర్యప్రకాష్‌రెడ్డి చీరాల వాడరేవుకు చెందిన అక్కల తిరుపతిరెడ్డి కుమారుడు. అతడి చిన్నతనంలో తల్లి చనిపోవడం, తండ్రి రెండో వివాహం చేసుకోవడంతో మూలగానివారిపాలెంలో అమ్మమ్మ, తాతయ్యల వద్ద పెరిగాడు. అక్కడే చదువుకు ఆర్మీలో చేరాడు. మూలగానివారి పాలేనికి చెందిన ఒక యువతితో అతడికి ప్రేమ వ్యవహారం నడిచింది. ఇటీవల అతడి ప్రేమను ఆ యువతి తిరస్కరించింది. యువతి తండ్రి ఫిర్యాదు చేయడంతో సూర్యప్రకాష్‌రెడ్డిపై ఈ నెల 7న కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీఆర్వోలందరినీ ఒకే గ్రేడ్‌గా చూడాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పనిచేస్తున్న 15వేల మంది వీఆర్వోలను ఒకే గ్రేడ్ ఉద్యోగులుగా కొనసాగించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం విజయవాడలోని కేడీసీసీ బ్యాంక్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ వీఆర్వోలు అందరూ ఒకే జాబ్‌చార్ట్ ప్రకారం పనిచేస్తున్నారని, కాబట్టి గ్రేడ్–1, గ్రేడ్–2 అనే తేడా లేకుండా ఒకేలా చూడాలన్నారు. గ్రేడ్‌ల విధానాన్ని తొలగించాలన్నారు. వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారిలో అర్హులను వీఆర్వోలుగా నియమించాలని కోరారు. వీఆర్వోలకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో వీఆర్వోల నుంచి సీనియర్ సహాయకులుగా 400 మందికి పదోన్నతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్–2 వీఆర్వోలకు సర్వే శిక్షణతో సంబంధం లేకుండా వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేసి పే స్కేలు అమలుచేయాలని, వారికి బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. వీఆర్వోలకు బయో మెట్రిక్ విధానాన్ని తొలగించాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వీఆర్వోలకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

30 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు చాన్స్

- 23 నుంచి 31వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- సెప్టెంబర్ 3న ఆప్షన్లలో మార్పులకు అవకాశం.. 6న సీట్ల కేటాయింపు
- 12లోగా సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలి
- హెల్ప్‌లైన్ నెంబర్లు 7995681678, 7995865456

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఏపీఈఏపీ సెట్–2022 అడ్మిషన్ల తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 6న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఈ ఏడాది మొత్తం 1,94,752 మంది విద్యార్థులు ఏపీఈఏపీ సెట్‌కు హాజరుకాగా.. 1,73,572 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరికి కాలేజీల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశమిచ్చారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ అడ్రస్: https://-sche.ap.gov.in కాగా, ఇక ఈనెల 23 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 3న ఆప్షన్లలో మార్పులకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 6న సీట్ల కేటాయింపు చేస్తారు. అదే రోజు నుంచి 12లోగా సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలి. 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అడ్మిషన్ల కన్వీనర్ పోలా భాస్కర్ తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 25 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థులకు సమస్యలు తలెత్తితే కన్వీనర్ కార్యాలయాన్ని 'కన్వీనర్ ఏపీఈఏపీసెట్2022 ఎట్ ద రేట్ జీమెయిల్.కామ్' ద్వారా సంప్రదించవచ్చు. లేదా 7995681678, 7995865456 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుల్ హత్యకేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: నంద్యాలలో ఈ నెల ఏడో తేదీన హత్యకు గురైన కానిస్టేబుల్ గూడూరు సురేంద్రనాథ్ (35) కేసులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. నిందితుల్లో నంద్యాలకు చెందిన కల్లూరి వెంకటసాయి, మాలిక్ బాషా, బండి మహేంద్ర, దైవందిన్నె మౌలీకిషోర్, షేక్ మహబూబ్ బాషా, గోసుల విజయ్, యడవలి కళ్యాణ్, ఆళ్లగడ్డకు చెందిన దూదేకుల సుభాన్‌బాషా ఉన్నట్లు చెప్పారు.

క్లీన్ విలేజ్

స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకున్న గొనసపూడి

- బహిరంగ మల, మూత్ర విసర్జనకు స్వస్తి
- ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి



గొనసపూడి గ్రామం



గొనసపూడి గ్రామంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సాక్షి, బాపట్ల: మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ గ్రామంగా బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని గొనసపూడి రూపుదిద్దుకుంది. గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గం కలిసి పారిశుద్ధ్య పనులకు పెద్దపీట వేశారు. గ్రామ పరిసరాల్లో ఎవరూ బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకునేలా చేశారు. ఏడాదిలోపే తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. గొనసపూడి గ్రామంలో 650 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం జనాభా 2,500 మంది కాగా, 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. గ్రామంలో దాదాపు 75 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు.

అవగాహన కల్పిస్తూ.. సాయం అందిస్తూ..

- గొనసపూడిని స్వచ్ఛ గ్రామంగా నిలపాలని స్థానిక పెద్దలు, పంచాయతీ సర్పంచ్ దీప్తి, పాలకవర్గ సభ్యులు గత ఏడాది అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు పారిశుద్ధ్యంపై యుద్ధం ప్రారంభించారు.
- బహిరంగ మల, మూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునేలా అవగాహన కల్పించారు. మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు.
- కొద్దిరోజుల తర్వాత గ్రామంలో 650 కుటుంబాలు ఉండగా, 580 కుటుంబాలకే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు గుర్తించారు. మిగిలినవారు బహిరంగ మల, మూత్రవిసర్జన చేస్తున్నట్లు నిర్ధారించారు.
- మరుగుదొడ్డి నిర్మించుకోలేని 25 మందికి సర్పంచ్ దీప్తి భర్త విక్రమ్ నారాయణ రావు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. స్థలాలు లేనివారికి పంచాయతీవారు సమీపంలో స్థలం చూపించారు. ఇలా ప్రతి ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుని ఉపయోగించుకునేలా చేశారు.
- వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న తర్వాత కూడా కొందరు ఆరుబయట మల, మూత్ర విసర్జన చేయడాన్ని గుర్తించి, వారి కుటుంబాల్లో చదువుకునే యువతను పిలిపించి వారి ద్వారా అవగాహన కల్పించారు.
- గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిది మరుగుదొడ్లు నిర్మించారు.

నిఘా నేత్రంతో పర్యవేక్షణ..

గ్రామంలో విస్తృత ప్రచారం చేసినా అప్పుడప్పుడు కొందరు బహిరంగ మల, మూత్రవిసర్జనకు పాల్పడుతుండటాన్ని పంచాయతీ పాలకవర్గం గుర్తించింది. వంద శాతం బహిరంగ మల, మూత్ర విసర్జనను నిర్మూలించేందుకు గ్రామం చుట్టూ దాదాపు 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం పంచాయతీ కొందరు యువకులను నియమించి నెలకు రూ.80వేల వరకు వేతనాలు చెల్లిస్తోంది. అయినా ఆరుబయట మల విసర్జన చేస్తూ 25 మంది పట్టుబడడంతో వారికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. దీంతో ప్రస్తుతం గ్రామమంతా బహిరంగ మల, మూత్ర విసర్జనకు దూరంగా ఉంటున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే..

గ్రామస్తుల సహకారంతో ఆరుబయట మల, మూత్ర విసర్జనకు స్వస్తి పలికాం. గత ఏడాది గాంధీ జయంతి రోజు నుంచి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నాం. అందరూ గ్రామ సర్పంచ్‌గా నా భార్యను ఎన్నుకున్నారు. గ్రామానికి ఎంతో కొంత మేలు చేయాలనే సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం.

– విక్రమ్ నారాయణ, పారిశ్రామికవేత్త

గ్రామం శుభ్రంగా మారింది

ఉదయాన్నే చెంబు చేతపట్టి ఆరుబయటకు వెళ్లి రావడంతోనే మా దినచర్య ప్రారంభమయ్యేది. ఆరుబయట మల, మూత్ర విసర్జన వల్ల కలిగే నష్టాల గురించి మాకు గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు వివరించారు. మా ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించారు. అప్పటి నుంచి మేము ఆరుబయట మల, మూత్ర విసర్జనను మానేశాం. గ్రామమంతా పరిశుభ్రంగా ఉంది.

– మాదాసు సుబ్బారావు, గొనసపూడి



నిజమైన జ్ఞానాన్ని ఆలోచన వల్ల పొందలేము. అది మీరేమిటో అది; అది మీరేం అవుతారో అది!

– అరవిందులు

సాక్షి

సోమవారం, ఆగస్టు, 22

30 రోజుల్లో రచయిత

సమాజంలో భౌతికంగా మనిషి ఎదగగలిగే ఎన్నో హోదాలున్నాయి. కానీ 'రచయిత' కావడం అనేది వేరే లెవెల్. రాయడం వల్ల వచ్చే 'రిటర్నులు' ఏమిటనేవి ఇదమిద్ధంగా ఎవరూ చెప్పలేరు. అయినాకూడా కొందరు రాస్తూనేవుంటారు. రాయడం అనేది వారికి గాలి వీచినంత, పూవు పూచినంత, ప్రవాహం సాగినంత సహజం.

రచయిత అనే ట్యాగ్ మనం ఊహించలేనంత పెద్దది. రచయిత అనగానే ఒక మేధావి, ఒక ఆలోచనాపరుడు, జీవితంలో అన్నీ చూసినవాడు అనే ఇమేజ్ కదలాడుతుంది. ఆటోమేటిగ్గా అది ఒక ప్రత్యేక గౌరవానికి కారణం అవుతుంది. అయితే రాసేవాళ్లకు కొన్ని సమస్యలు ఉన్నాయి. చదివే వాళ్లు తగ్గిపోయారు, పుస్తకాలు అమ్ముడు కావడం లేదు, అసలు ఎవరికైనా కాంప్లిమెంటరీ కాపీ ఇచ్చినా దాన్ని ఆసాంతం చదువుతారన్న ఆశ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంత స్థితప్రజ్ఞుడైనా కొంత నిరాశ పడక తప్పదు. మరి ఇలాంటప్పుడు ఎవరైనా ఎందుకు రాయాలి?

అసలు ఏ రచయితకైనా తన పుస్తకాన్ని పాఠకులు చదవాలి, పుస్తకం అమ్ముడు కావాలి అని అంత పట్టింపు ఎందుకు? అని ఎదురు ప్రశ్నిస్తారు దీపక్ విలాస్ పర్వత్. 'వెల్ డన్! యు ఆర్ హైర్డ్', 'ఏ మాంక్ ఇన్ సూట్' లాంటి రచనలు చేసిన దీపక్, అచ్చయ్యే పుస్తకాల్లో 60–70 శాతం చదవనివే ఉంటాయంటారు. అందుకే అమ్మడానికి బదులుగా ఫ్రీ గిఫ్ట్‌గా ఇవ్వడం ద్వారా పుస్తకానికి వచ్చే ఆ వందో, రెండు వందలో ఖరీదు కంటే కూడా ఎక్కువ సంపాదించవచ్చని చెబుతారు. ''ఒక మోటివేషనల్ స్పీకర్‌గా మనం ఒక కాలేజీకి వెళ్లి ప్రిన్సిపాల్‌కు ఏ విజిటింగ్ కార్డో, బ్రోషరో ఇస్తే– మనం అక్కడినుంచి వచ్చిన మరుక్షణం అది చెత్తబుట్టలో పడిపోవచ్చు. పైగా అలాంటివి ఎన్ని ఇచ్చినా మన గురించి వాళ్లకు ఒక సరైన అంచనా రాకపోవచ్చు. అదే ఒక పుస్తకం ఇస్తే? బ్రోషర్ కంటే తక్కువ ఖర్చుతో ప్రింటయ్యే పుస్తకం మన గురించిన అత్యుత్తమ పరిచయ పత్రం అవుతుంది. ఆయన చదవకపోవచ్చు, ఊరికే ర్యాకులో పెట్టేయొచ్చు; కానీ ఇచ్చివెళ్లినవాడు ఒక రచయిత అనే ఇమేజ్ పనిచేస్తుంది. ఆ సైకాలజీతోనే మనం ఆడుకోవాలి,'' అంటారు.

ఆ కారణంగానే పుస్తకాన్ని మీ ఎదుగుదలకు ఒక పెట్టుబడిగా వాడుకోండి అని సలహా ఇస్తారు కైలాశ్ సి.పింజానీ. 'డేట్ యువర్ క్లైంట్స్', 'క్యాచ్ ద షార్క్' లాంటి రచనలు చేసిన కైలాశ్... ఏ ఫీల్డ్ వాళ్లయినా ఎదగడానికి పుస్తకాన్ని ఒక ఆయుధంగా మలుచుకోవచ్చునంటారు. ''ఉజ్జాయింపుగా సమాజంలో తొంభై తొమ్మిది శాతం మంది రచయితలు కాలేరు. కాబట్టి, ఆ రాయగలిగేవాళ్లు అమాంతం ఆ ఒక్క శాతం బ్రాకెట్లోకి వచ్చేస్తారు. ఆ గుర్తింపే మిమ్మల్ని ప్రత్యేకంగా ఉంచుతుంది. మీరు రాకెట్ అనుకుంటే, పుస్తకం మీకు రాకెట్ లాంచర్ అవుతుంది,'' అని చెబుతూ అర్జెంటుగా ఒక పుస్తకం రాసేయమని సలహా ఇస్తారు.

అంత అర్జెంటుగా ఎలా రాసేయడం? ముప్పై రోజుల్లో పుస్తకం ఎలా రాయాలో ఈ ఇరువురు సహచరులు 'సూపర్ ఫాస్ట్ ఆథర్' పేరుతో శిక్షణ ఇస్తుంటారు. ''పుస్తకం నూటాయాభై పేజీలకు మించకూడదు. ఏ మనిషైనా రాయగలిగేవి మూడు ఏరియాలు: సొంతం జీవితంలోని డ్రామా, వృత్తిపరమైన అనుభవాలు, ప్రత్యేక ఇష్టాయిష్టాలు. పెద్దగా రీసెర్చ్ అవసరం లేని టాపిక్ ఎంచుకోండి. దాన్ని పది అధ్యాయాలుగా విభజించుకోండి. ప్రతి అధ్యాయానికీ పది ముఖ్యమైన ప్రశ్నలు వేసుకోండి. ఒక ప్రశ్నను ఒక పేరాగా విస్తరించండి. దానికి జవాబును మూడు పేరాల్లో రాయండి. అంటే పది అధ్యాయాల్లో వంద ప్రశ్నలకు నాలుగు వందల పేరాలు అవుతాయి. రోజుకు ఐదు ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి. ఇరవై రోజుల్లో వంద ప్రశ్నలు పూర్తవుతాయి. ఐదు రోజులు రీసెర్చ్‌కు వదిలేస్తే, ఇంకో ఐదురోజుల్లో మార్పులు చేర్పులు, కరెక్షన్స్ చేయండి. ముప్పయ్యో నాటికి ఫస్ట్ డ్రాఫ్ట్ రెడీ! ఎగ్జామ్ హాల్లో ఇచ్చే మూడు గంటల సమయంలో మనకు ఇష్టం లేని పాఠాల మీద ఎన్నో అడిషనల్ పేపర్లు రాసివుంటాం. అలాంటప్పుడు మనకు ఇష్టమైన టాపిక్ మీద రాయడం ఎంత సులభం?'' అంటారు కైలాశ్.

ఇలా మ్యాగీ నూడుల్స్‌లా వండే రచనలు ఎలా ఉంటాయో తెలీదు. బాగుండొచ్చు కూడా. అయితే కొందరు తెలుగు కవులు, రచయితలకు ఇవి కొత్త చిట్కాలు కాకపోవచ్చు. వాళ్లు ఇంతకంటే వేగంగా రాయగలరు; ఇంతకంటే బాగా ప్రమోట్ చేసుకోగలరు. తేడా అల్లా దీపక్, కైలాశ్ లాంటి వాళ్లకు తమ విషయంలో ఒక పారదర్శకత ఉంది; మనవాళ్ల విషయంలో అదీ కనబడదు.

కేవలం నెమ్మదిగా రాయడం వల్లే ఒక రచన గొప్పదైపోదు. తన రాత మీద రచయిత ఎంత ప్రాణం పెడతాడన్నది ముఖ్యం. 'యుద్ధము–శాంతి' మహానవలను టాల్‌స్టాయ్ తొమ్మిదిసార్లు తిరగరాశాడట. 'కరమజోవ్ బ్రదర్స్' చదువుతున్నప్పుడు దోస్తోవ్‌స్కీ ఒక ఆధ్యాత్మిక జ్వర పీడితుడిలా కనబడతాడు. వాక్యంలో పెట్టాల్సిన ఒక్క కామా గురించి కూడా ఆస్కార్ వైల్డ్ తల బద్దలుకొట్టుకునేవాడట. యావజ్జీవితం సాహిత్యమే ఊపిరిగా బతికాడు చలం. జీవితకాలం రాసిన మొత్తం కూడా గట్టిగా ఒక పుస్తకానికి మించనివాళ్లు ఉన్నారు. వాళ్లు నిజంగా రచయితలు. కానీ ఇప్పుడు పుంఖానుపుంఖంగా వస్తున్న పుస్తకాలు కొన్ని చెట్ల ప్రాణాలు తీయడానికి తప్ప పనికిరావు. కాబట్టి రాసేవాళ్లందరూ రచయితలు కారు. వచ్చిన ప్రతిదీ పుస్తకం కాదు. దాన్ని వేరు చేసుకోగలగడమే పాఠకుల విజ్ఞత.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణమాసం, తిథి: బ.ఏకాదశి పూర్తి (24గంటలు)
నక్షత్రం: మృగశిర ఉ.9.07 వరకు, తదుపరి ఆరుద్ర
వర్జ్యం: సా.6.21 నుండి 8.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.48 వరకు
అమృతఘడియలు: రా.12.32 నుండి 2.20 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

రగిలింది విప్లవాగ్ని ఈరోజే!

సందర్భం



డా॥ గోపరాజు నారాయణరావు

భారత స్వాతంత్య్ర ఉద్యమానికి అతివాద, మితవాద, విప్లవ వాద మార్గాలను ఎన్నుకున్న అనేకమంది దేశ భక్తులు తమ జీవితాలను అంకితం చేశారు. ఈ ఉద్యమ స్రవంతుల్లో ఆయుధం పట్టి బ్రిటిష్‌వాళ్ల భరతం పట్టాలన్న వర్గానికి చెందినవారు అల్లూరి సీతారామరాజు. అమాయక గిరిజనుల బాధలను దగ్గర నుంచి గమనించి, విజ్ఞాపనల ద్వారా వారి సమస్యలు పరిష్కారం కావని గ్రహించారు. అందుకే మన్యం ప్రాంతంలో అద్భుతమైన గిరిజన తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. అల్లూరి సీతారామరాజు చేసిన ఈ సంచలన యుద్ధానికి నేటితో నూరు వసంతాలు.

అడవి నుంచీ, పూర్వీకుల నుంచీ వచ్చిన స్వేచ్ఛా జీవనానికి సంకెళ్లు వేయాలని చూసిన చట్టాలకు ప్రతిఘటనలే గిరిజనోద్యమాలు. దేశం నలుమూలలా జరిగిన అలాంటి ఉద్యమాలలో 1922–24 నడుమ విశాఖ మన్యంలో అల్లూరి సీతారామరాజు (శ్రీరామరాజు) నిర్వహించిన పోరాటం ప్రత్యేకమైనది. అవన్నీ కొండా కోనా మీద హక్కు కోసం కొన్ని తరాల ఆదివాసీలు పడిన తపన, వేదనలే. స్థానిక సమస్యల మీద తలెత్తినట్టు కనిపించినా నిజానికి అవి ప్రభుత్వాల మీద యుద్ధాలే. విశాఖ మన్య పోరాటంలో మైదాన ప్రాంత రాజకీయ స్పృహ, సైద్ధాంతిక ఛాయ ఉన్నాయి.

శ్రీరామరాజు ఉద్యమకారునిగా అవతరించడం ఒక చారిత్రక నేపథ్యంలో జరిగింది. మొదటి ప్రపంచయుద్ధం, గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం పిలుపు, ఉపసంహరణ; ఉత్తర భారత యాత్ర ఆ నేపథ్యాన్ని ఇచ్చాయి. తన కుటుంబం తునిలో ఉన్నప్పుడే 1915లో ఉద్యోగాన్వేషణ పేరుతో రామరాజు ఉత్తర భారతదేశం వెళ్లారు. ఆ యాత్రలోనే రామరాజు కలకత్తా వెళ్లి ప్రముఖ జాతీయ ఉద్యమ నేత సురేంద్రనాథ్ బెనర్జీని కలుసుకున్నారు. ఆ తరువాత అల్లూరి తూర్పు కనుమలలోని కృష్ణదేవిపేటకు 1917 జూలై 24న ఒక ఆధ్యాత్మికవేత్తగా చేరుకున్నారు. ఈ ఊరే ఆయన కార్యక్షేత్రమయింది. ఇక ఆయన ఆయుధం పట్టి, ఉద్యమం ప్రారంభించడానికి చాలా కారణాలు ఉన్నాయి. 1920లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపు, 'ఒక్క ఏడాదిలోనే స్వాతంత్య్రం' అన్న నినాదమూ ఇచ్చారు. రాళ్లపల్లి కాశన్న, నర్సీపట్నం ప్రాంత కాంగ్రెస్ కార్యకర్తలు కృష్ణదేవిపేటలోనూ సహాయ నిరాకరణోద్యమ ప్రచారం చేశారు. 1921లో రామరాజు కాలినడకన నాసికాత్రయంబకం వెళ్లారు. అక్కడ 'అభినవ్ భారత్' విప్లవ సంస్థ ప్రభావం ఆయనపై గాఢంగా పడింది. అప్పటికే రామరాజు మన్యవాసులలో కొన్ని సంస్కరణలు తెచ్చారు. గాంధీజీ కార్యక్రమమంతటిలోను మద్యపాన నిషేధం, కోర్టుల బహిష్కారం... ఈ రెండూ ఆయనకు నచ్చాయి. ఇవే రామరాజు 'సహాయ నిరాకరణ వాది' అన్న అనుమానం కలిగించాయి.

మొదటి ప్రపంచ యుద్ధం ఆగిన తర్వాత కరవు విజృంభించడంతో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఆకలి దాడులు జరిగాయి. ప్రభుత్వం ఉపాధి కల్పన ఆరంభించింది. మన్యంలో రోడ్ల నిర్మాణం అందులో ఒకటి. ఆసియా చరిత్రలోనే ఈ రోడ్ల నిర్మాణం ఓ అమానుష ఘట్టం. ఇందుకు బాధ్యుడు గూడెం డిప్యూటీ తహసీల్దార్ అల్ఫ్ బాస్టియన్. నిజానికి 1882 చట్టంతో అడవిలో ప్రవేశం కోల్పోయిన ఆదివాసీలు కూలీలుగా మారిపోయారు. పెద్దవలస మాజీ ముఠాదారు కంకిపాటి బాలయ్యపడాలు (ఎండు పడాలు), బట్టిపనుకుల మునసబు గాం గంతన్న దొర, అతని తమ్ముడు గాం మల్లు దొర, గోకిరి ఎర్రేసు, బొంకుల మోదిగాడు వంటివారు 1922 జనవరిలో రాజు దగ్గరికి వచ్చి గోడు వినిపించుకున్నారు. బాస్టియన్ మీద పై అధికారులకు శ్రీరామరాజు ఫిర్యాదు రాశారు. రామరాజు మన్యంలో సహాయ నిరాకరణ ఆరంభించాడన్న ఆరోపణకు ఈ ఫిర్యాదు దోహదం చేసింది. రామరాజును ఆ ఫిబ్రవరి 3న నిర్బంధంలోకి తీసుకున్నది కూడా సహాయ నిరాకరణవాది అన్న ఆరోపణతోనే! ఆ ఒకటో తేదీనే సహాయ నిరాకరణను తీవ్రం చేస్తున్నట్టు గాంధీజీ ప్రకటించారు. 5వ తేదీన జరిగిన 'చౌరీచౌరా' ఉదంతంతో గాంధీ ఆ పిలుపును ఉపసంహరించుకున్నారు. అహింసాయుతంగా పోరాడే సంస్కారం భారతీయులకు లేదని నింద మోపారు. ఇదే యువతను ఇతర పంథాల వైపు నడిపించింది. అలాంటి వారిలో రామరాజు ఒకరు.



సంప్రదాయ, ఆధునిక ఆయుధాలతో గెరిల్లా పోరు జరపాలని అనుకున్న రాజు... ఆయుధాల కోసం మన్యంలోని పోలీస్ స్టేషన్లను దోచుకోవాలని నిర్ణయించారు. అనుచరులను మూడు దళాలుగా విభజించారు. 1922 ఆగస్ట్ 22న పట్టపగలు చింతపల్లి పోలీస్ స్టేషన్ మీద 300 మందితో దాడి చేశారు. ఆయుధాలు తీసుకు వెళుతున్నానని ఒక లేఖ రాసి వచ్చారు రాజు. తొలి దాడితోనే మన్య ఉద్యమ తత్త్వం తెలుస్తుంది. కొండదళం 'వందేమాతరం... మనదే రాజ్యం', 'గాంధీజీకి జై' అంటూ నినదించింది.

ఆగస్టు 23న కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ మీద దాడి జరిగింది. ఆగస్ట్ 24న రాజవొమ్మంగి స్టేషన్ (తూర్పు గోదావరి)ను ఎంచుకున్నారు. లాగరాయి పితూరీని సమర్థించిన నేరానికి అరెస్టయిన మొట్టడం వీరయ్యదొర అప్పుడు ఆ స్టేషన్‌లోనే ఉన్నారు. ఆయనను విడిపించడం కూడా ఈ దాడి ఆశయాలలో ఒకటి. తొలి రెండు దాడులతోనే మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రధాన కార్యదర్శి ఆర్ఏ గ్రాహమ్‌కు టెలిగ్రామ్‌లు వెళ్లాయి. 26 తుపాకులు, వేలాది తూటాలు కొండదళం చేతికి చిక్కాయి. ఎంత ప్రమాదం! ఏజెన్సీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సాండర్స్, కలెక్టర్ వాయువేగంతో నర్సీపట్నం చేరుకున్నారు. నర్సీపట్నం కేంద్రంగా మన్యం ఖాకీవనమైంది. అలాంటి వాతావరణంలోనే జైపూర్ మహారాజు ఐదు ఏనుగుల మీద పోలీసుల కోసం పంపిన సామగ్రిని సెప్టెంబర్ 3న ఒంజేరి ఘాట్‌లో రాజుదళం వశం చేసుకుంది. తరువాత జరిగిన ఘటన మద్రాస్ ప్రెసిడెన్సీని మరీ కలవరపెట్టింది. రామరాజు పేరు మొదటిసారి తెలుగునేలంతా వినిపించింది. దామనపల్లి అనే కొండమార్గంలో 1924 సెప్టెంబర్ 24న గాలింపు జరుపుతున్న స్కాట్ కవర్ట్, నెవెల్లి హైటర్ అనే ఒరిస్సా పోలీసు ఉన్నతాధికారులను రాజు దళం చంపింది. వీరిలో హైటర్ మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్నాడు. తరువాత అడ్డతీగల, చోడవరం, మల్కనగిరి, పాడేరు స్టేషన్‌ల మీద చేసిన దాడులు విఫలమయ్యాయి. బ్రిటిష్‌వాళ్లు ఆయుధాలను ట్రెజరీలకు పంపి జాగ్రత్త పడ్డారు. మన్యం మీద పట్టు బిగించడానికి మద్రాస్ ప్రెసిడెన్సీ మరొక అడుగు ముందుకు వేసి, 1922 సెప్టెంబర్ 23న మలబార్ పోలీసు దళాలను దించింది. కానీ రామవరం అనే చోట ఆ దళమూ వీగిపోయింది.

1922 డిసెంబర్ 6న పెద్దగడ్డపాలెం, లింగాపురం అనేచోట్ల రాజుదళం మీద లూయీ ఫిరంగులతో మలబార్ దళం యుద్ధానికి దిగింది. ఎనిమిది మంది రాజు అనుచరులు వీరమరణం చెందారు. ఆ డిసెంబర్ 23న ఉద్యమకారుల తలలకు ప్రభుత్వం వెలలు ప్రకటించింది. నాలుగు మాసాల అనంతరం 1923 ఏప్రిల్ 17న రామరాజు దళం ఆకస్మాత్తుగా అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షమై మొత్తం యంత్రాంగాన్ని కలవరపరిచింది. ఆ సంవత్సరం డిసెంబర్‌లో కాకినాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు రామరాజు మారువేషంలో హాజరయ్యారు. నడిపేది గిరిజనోద్యమమే అయినా, ఆయన మైదాన ప్రాంత ఉద్యమాన్ని గమనిస్తూనే ఉన్నారు.

1924 జనవరికి అస్సాం రైఫిల్స్‌ను దించారు. వీరికి మొదటి ప్రపంచ యుద్ధంలో అనుభవం ఉంది. అస్సాం రైఫిల్స్ అధిపతే మేజర్ గుడాల్. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న థామస్ జార్జ్ రూథర్‌ఫర్డ్‌ను ఆ ఏప్రిల్‌లో మన్యం స్పెషల్ కమిషనర్‌గా నియమించారు. మే ఐదు లేదా ఆరున 'రేవుల కంతారం' దగ్గర పోలీసుల దాడి నుంచి తప్పించుకున్న రాజు ఒక్కడే రాత్రివేళ 'మంప' అనే గ్రామం వచ్చి, ఒక చేనులోని మంచె మీద గడిపారు. మే 7వ తేదీ వేకువనే ఓ కుంటలో స్నానం చేస్తుండగా రాజును ఈస్ట్‌కోస్ట్ దళానికి చెందిన కంచుమేనన్, ఇంటెలిజెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆళ్వార్‌నాయుడు అరెస్టు చేశారు. రాజును ఒక నులక మంచానికి కట్టి, కృష్ణదేవిపేటకు పయనమయ్యారు. దారిలోనే ఉంది కొయ్యూరు. అక్కడే మేజర్ గుడాల్... రాజుతో మాట్లాడాలని గుడారంలోకి తీసుకువెళ్లాడు. ఒక చెట్టుకు కట్టి కాల్చి చంపాడు. జూన్ 7న గాం గంతన్నను కాల్చి చంపారు. దాదాపు రెండేళ్ల ఉద్యమం, పోలీస్ వేధింపులతో మన్యవాసులు భీతిల్లిపోయారు. కొందరు ఉద్యమకారులను స్థానికులే చంపారు. పోలీసులకు పట్టించారు. సరైన విచారణ లేకుండానే 270 మంది వరకు ఉద్యమకారులకు శిక్షలు విధించింది మిలిటరీ ట్రిబ్యునల్. 12 మందిని అండమాన్ పంపారు. చివరిగా... దేశం కోసం పోరాడిన ఏ వర్గం త్యాగమైనా విలువైనదే. అవన్నీ నమోదైతేనే స్వరాజ్య సమర చరిత్రకు పరిపూర్ణత. ఉద్యమ నూరేళ్ల సందర్భం ఇచ్చే సందేశం అదే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(అల్లూరి సీతారామరాజు పోరాటానికి నూరు వసంతాలు)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



జవాబుందా అసలు?



దేవుడిని నమ్మేవాళ్లలో చాలామంది తెలివైనవాళ్లు ఉన్నారు. కానీ వాళ్లు ఎందుకు దేవుడిని నమ్ముతున్నారో ఎప్పుడైనా తెలివైన జవాబు ఇచ్చారా?

– రిచర్డ్ డాకిన్స్, నాస్తికుడు

ఎందుకు దాస్తారు?



మాస్కు నిర్బంధాలు పాటిస్తూ, ప్రపంచంలోనే టీకా, బూస్టర్ల శాతం ఎక్కువున్న దేశం అయినప్పటికీ న్యూజిలాండ్‌లో కొత్తగా కోవిడ్ మరణాలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయని ఎవరైనా గ్రహించారా? చూస్తుంటే 'నిపుణులు', మీడియా దీన్ని పట్టించుకుంటున్నట్టు లేదు. ఎందుకంటే అది వారి కథనానికి విరుద్ధంగా ఉంటుంది మరి!

– ఇయాన్ మిల్లర్, సామాజిక వ్యాఖ్యాత

అది మామూలే!



'డో'లో కథనం మనల్ని పెద్దగా ఆశ్చర్యపరిచే పనిలేదు. ఎందుకంటే, 2019లో నేను సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన నాలుగు అభ్యర్థనలకుగానూ ఔషధాల శాఖ; కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖలు ఇరవై ఫార్మా కంపెనీల జాబితా ఇచ్చాయి. డాక్టర్లకు లంచాలు ఇచ్చాయని ప్రభుత్వానికి తెలుసు. కానీ ఒక్క కంపెనీ కూడా శిక్షకు గురి కాలేదు.

– బాంజోత్ కౌర్, హెల్త్ రిపోర్టర్

ఎలాంటివాళ్లో చూసుకో...



మా గురువు నాకు చెప్పారు: "ఒకవేళ నువ్వు ఐదుగురు ఆత్మవిశ్వాసం గలవారితో తిరిగావనుకో, నువ్వు ఆరోవాడివి అవుతావు. ఒకవేళ నువ్వు ఐదుగురు తెలివైనవాళ్లతో తిరిగావనుకో, నువ్వు ఆరోవాడివి అవుతావు. ఒకవేళ నువ్వు ఐదుగురు మూర్ఖులతో తిరిగావనుకో, నువ్వు..."

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అప్పటికి ఏది సరైనదో...



ఏదో ఒక రాజకీయ పక్షానికో, భావజాలానికో విధేయత చూపనివాళ్లు కొందరు ఉంటూనే ఉంటారు. దాన్ని అంగీకరించండి. రెండు వైపులా మాట్లాడతారనో, కోతి కొమ్మచ్చి ఆడుతారనో వారి మీద ముద్రలు వేయడం వల్ల ఉపయోగం లేదు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

అదేనా పరిచయం?



నేను నలభై ఏళ్లకు పైనే మానవవాదం, లౌకికవాదం, హేతువాదం, స్త్రీవాదం, ఉదారవాదం, మానవ హక్కులు, జంతు హక్కులు, సమ సమాజం, సహానుభూతి, ప్రేమ, కరుణల గురించి రాస్తున్నాను. అయినాకూడా పాత్రికేయులు నన్ను పరిచయం చేస్తున్నప్పుడు 'ఆమె వివాదాస్పద ఇస్లాం వ్యతిరేక రచయిత్రి' అని చెబుతుంటారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

అప్పుడు మాత్రమే...



పేదవాళ్లందరికీ కార్లుంటేనే అది అభివృద్ధి చెందిన దేశం అని కాదు; ఎక్కడ ధనికులు కూడా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తారో అప్పుడు మాత్రమే అది నిజంగా అభివృద్ధి చెందిన దేశం అవుతుంది.

– గుస్తావో పెట్రో, కొలంబియా అధ్యక్షుడు

మెట్టినింటి జాతీయోద్యమ పిపాసి!

స్విట్జర్లాండ్ జ్యూరిచ్ నగరానికి చెందిన 'మెల్లీ షోలింగర్' ఒక భారతీయుని వివాహం చేసుకుని, భారత జాతీయోద్యమంలో పాల్గొన్న గొప్ప విదేశీ వనిత. 'అతడు – ఆమె' సృష్టికర్త డా॥ ఉప్పల లక్ష్మణరావు జర్మనీలోని ట్యూబెంగెన్‌లో పరిశోధకునిగా ఉన్నప్పుడు ఆమెతో పరిచయం ప్రేమగా మారడంతో... 1937లో వివాహం చేసుకున్నారు. ఆ విధంగా మెల్లీకి గంజాం జిల్లా, బరంపురం మెట్టినిల్లయింది. మెల్లీ గాంధీజీ సిద్ధాంతాలనూ, ఆశయాలనూ త్రికరణశుద్ధిగా పాటించేవారు. నూలు వడకటం, ఖద్దరు ధారణ, రైలులో 3వ తరగతి పెట్టెలోనే ప్రయాణించటం వంటి పనులు చేసేవారు. జాతీయోద్యమం వివిధ దశలలో చురుగ్గా పాల్గొన్నారు. మెల్లీ, లక్ష్మణరావు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి లాహోర్ కాంగ్రెసు సమావేశాలకు వెళ్ళారు. ఆమె జవహర్‌లాల్ నెహ్రూ ఇంటర్వ్యూ తీసుకున్నారు. రావీనది ఒడ్డున 1929 డిసెంబరు 31 అర్ధరాత్రి జరిగిన జాతీయ జెండా వందనం కార్యక్రమంలో మెల్లీ దంపతులు పాల్గొని 'సంపూర్ణ స్వరాజ్య' సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సబర్మతి ఆశ్రమంలో (1930) మెల్లీ ఒక సంవత్సరం, లక్ష్మణరావు 6 నెలలు ఉన్నారు. అక్కడ నూలు వడకటం నేర్చుకున్నారు. ఇక్కడే వారికి పొట్టి శ్రీరాములుతో పరిచయం ఏర్పడింది.



మెల్లీ షోలింగర్

1939లో ప్రారంభమైన వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమంలో బెజవాడలో మెల్లీ పాల్గొన్నారు. ఆమెను అరెస్టు చేసి వెల్లూరు స్త్రీల జైలుకి పంపారు. అక్కడ ఆమె 'సి' క్లాస్ ఖైదీగా కొన్నాళ్ళూ, 'బి' క్లాస్ ఖైదీగా కొన్నాళ్ళూ ఉన్నారు. 1941లో సత్యాగ్రహంలో పాల్గొని ఏడాది జైలు శిక్ష అనుభవించారు. 1942లో బెజవాడ సత్యనారాయణపురంలో 'క్విట్ ఇండియా' నినాదాలు చేస్తూ అరెస్టయ్యారామె. జైలులో ఆమెను రాజకీయ ఖైదీగా చూడకుండా, చేతులకి, కాళ్ళకి సంకెళ్ళు వేసి ఉంచేవారట! ఆమెను జర్మనీ గూఢచారిగా బ్రిటిష్‌వాళ్లు భావించారని లక్ష్మణరావు అనేవారు. ఈ ఆదర్శ మహిళ 1965 జూలై 29న కన్నుమూశారు.

– తుర్లపాటి రాజేశ్వరి, రచయిత్రి – అనువాదకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మన నిశ్శబ్దం చేసిన గాయం

కామెంట్



కరణ్ థాపర్

సల్మాన్ రష్దీపై తీవ్రమైన దాడిపై మన రాజకీయనాయకులు చాలామంది నిశ్శబ్దంగా ఉండటం చూసి కలవరపడ్డాను, దిగులు పడ్డాను. 1988లో 'శాటానిక్ వర్సెస్' నవలను నిషేధించిన ఏకైక అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదే. ఆ పుస్తకాన్ని చదవకుండానే మనం దాన్ని నిషేధించేశాము. 34 సంవత్సరాల తర్వాత రష్దీపై జరిగిన దాడిని ఖండించని ఏకైక అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కూడా మనదే. ఎందుకు అనేది నాకు నిజంగానే అర్థం కావడం లేదు.


సల్మాన్ రష్దీ భారతదేశంలో జన్మించారు. ఆయన పౌరసత్వం మారి ఉండవచ్చు కానీ, ఈ దేశంతో తన ఉనికిని ఆయన కొనసాగిస్తూనే ఉన్నారు. 2000 సంవత్సరంలో 'బీబీసీ హార్డ్‌టాక్ ఇండియా' కోసం ఆయనతో చేసిన ఇంటర్వ్యూలో ''ఈ దేశం ఇప్పటికీ మీ ఇల్లేనా?'' అని ప్రశ్నించాను. దానికి ఆయన సమాధానం ఏమిటో తెలుసా? ''ఏ దేశంలో మీరు పుట్టారో, పిల్లవాడిగా మీరు ఏ దేశంలో పెరిగారో అది ఎప్పటికీ మీ ఇంటిలాగే ఉంటుంది. ఏ ఇతర ప్రదేశంలోనూ మీరు అలాంటి అనుభూతి చెందలేరు. నా పుస్తకాలు చదివిన ఎవరైనా సరే, ఈ దేశాన్ని ఇల్లు అని పిలవడంలో నా ఊహాస్థాయిని తెలుసుకునే ఉంటారు.''

నా తదుపరి ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం మరింత ఆసక్తికరంగా ఉండింది. ''సల్మాన్ రష్దీ భారతీయుడా లేక ఆంగ్లేయుడా లేక పాకిస్తానీయుడా? ఏ ఉనికిని మీరు అంగీకరిస్తారు?'' అని అడిగాను. ఈ ప్రశ్నకు ఆయన సమాధానం క్లుప్తంగా, నిక్కచ్చిగా ఉండటమే కాదు, అది సరళం కూడా. ''ఓహ్ పాకిస్తానీ మాత్రం కాదు,'' అంటూ తర్వాత ఆయన నవ్విన నవ్వు వెక్కిరిస్తున్నట్లుగా ధ్వనించింది. పాకిస్తానీగా ఉండటం అనే ఆలోచనే ఆయనకు హాస్యాస్పదంగా తోచింది.

మరి మన ప్రముఖ రాజకీయ నేతల నుంచి ఆయనపై దాడిపట్ల ఖండనకు సంబంధించిన వ్యక్తీకరణ బహిరంగంగా ఎందుకు రాలేదు? అక్కడ జరిగినదానిపై వారు ఎందుకు ఆగ్రహం ప్రదర్శించలేదు? కనీసం ఆయన కోలుకోవాలని సానుభూతి ప్రకటించడానికి కూడా వీరు ఎందుకు ఇష్టపడలేదు? అసలెందుకు వారు నిశ్శబ్దంగా ఉండిపోయారు?

నిస్సందేహంగా వేళ్ల మీద లెక్కబెట్టినంతమంది మాట్లాడారు. బహిరంగంగా ఆ దాడి గురించి మాట్లాడిన ఏకైక పార్టీ నేత సీతారాం ఏచూరి. మిగతావారికి దాని గురించి మాట్లాడటానికి ఏమీ ఉన్నట్టు లేదు. ప్రధాని నరేంద్రమోదీ, ఆయన మొత్తం మంత్రి మండలి మాత్రమే కాదు... సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్, ఎంకే స్టాలిన్, నితీశ్ కుమార్, కోనార్డ్ సంగ్మా, ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా... రష్దీపై దాడి గురించి విన్నప్పుడు వీరిలో ఏ ఒక్కరూ దానిగురించి నిజంగానే అనుభూతి చెందలేకపోయారా? లేదా రాజకీయాలు లేక ముస్లిం ఓటర్లను గాయపరుస్తామనే భయానికి గురయ్యారా లేక ఇరాన్ ప్రభుత్వానికి ఇబ్బంది కలగకూడదనే విషయం మౌనం పాటించేలా చేసిందా?

పూర్తి వాస్తవం ఏమిటంటే, ఈ విషయం మీద మన విదేశీ వ్యవహారాల మంత్రి మాట్లాడారు. కానీ ఆయన చెప్పింది ఏమిటో పరిశీలించినప్పుడు, దానికంటే నిశ్శబ్దంగా ఉండటమే ఉత్తమమని అనిపిస్తుంది. బెంగళూరులో జరిగిన పత్రికా సమావేశంలో ఒక ప్రశ్నకు స్పందిస్తూ జై శంకర్ ఇలా అన్నారు: ''నేను కూడా దాని గురించి చదివాను. మొత్తం ప్రపంచమే దాన్ని గమనించింది. మొత్తం ప్రపంచమే అలాంటి దాడి పట్ల స్పందించింది.'' మొత్తం ప్రపంచం స్పందించింది కానీ మన విదేశీ వ్యవహారాల మంత్రి మాత్రం కాదు. ఆ దాడి పట్ల ఆయనది స్పందన కాదు. కచ్చితంగా ఆ దాడి గురించిన ఖండన కాదు. కేవలం ఆ దాడి గురించి తనకు తెలుసు అని మాత్రమే చెప్పారాయన.



సల్మాన్ రష్దీ

రష్దీ అతి గొప్ప రచయిత కావచ్చు. భారత సంతతి రచయితగా అందరికీ తెలిసిన, చాలామంది చదవగలిగిన రచయితగా ఉండొచ్చు. కానీ ఆయనకు మనం మద్దతు తెలుపడానికి అంగీకరించలేకపోయాం. ఈలోగా తక్కిన ప్రపంచం ఆయన్ను కౌగలించుకుంది, తమవాడిని చేసుకుంది. ''ఆయన పోరాటం మా పోరాటం'' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ చెప్పారు. ''గతంలో కంటే మిన్నగా మేం ఆయన పక్షాన నిలబడతాం'' అన్నారు.

కాబట్టి నిక్కచ్చిగా నన్ను ప్రశ్నించనివ్వండి. మనం ఎవరివైపు నిలబడుతున్నాం? ఈ విషయాన్ని మరింత స్పష్టంగా ప్రకటించాల్సిన సందర్భాలు తారసపడతాయి. ఇలాంటి సందర్భంలో ఇబ్బంది పెట్టే ప్రశ్నలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి కూడా. మనవాడు అని గర్వంగా చెప్పుకోగలిగిన వ్యక్తిపై దాడి జరిగినప్పుడు, మనం ఆయన గురించి ఎందుకు ఏమీ చెప్పలేకపోయాం? ప్రవాస భారతీయుల పట్ల మన వైఖరి గురించి ఇది ఏమని సూచిస్తోంది? సల్మాన్ రష్దీ మన ఉజ్వల తారల్లో ఒకరు కాదా? లేక ఆయన పుట్టిపెరిగిన విశ్వాసమే ఇక్కడ సమస్యాత్మకంగా ఉంటోందా? (నిజానికి ఆ విశ్వాసాన్ని ఆయన పాటించడం లేదు).

రష్దీ గతంలో చెప్పిన చివరి మాటను ప్రస్తావించనివ్వండి. భారత్ తనను తిరస్కరించినట్లు రష్దీ భావిస్తున్నారా అని నేను బీబీసీ ఇంటర్వ్యూలో అడిగాను. ఎందుకంటే భారత్ అనేక సంవత్సరాలుగా ఆయనకు వీసాను నిరాకరించింది. ''అవును, నేను అలా భావించాను'' అని రష్దీ సమాధానం ఇచ్చారు. ''చాలా గాయపడిన భావన కలిగింది. భారత్‌కు దూరంగా ఉండటం అప్పటి సంవత్సరాల్లో చాలా బాధాకరమైన జ్ఞాపకాల్లో ఒకటిగా నేను భావించాను. నేను భారత్‌కు తిరిగి రావడాన్ని ప్రేమించాను. ప్రతి సంవత్సరం ఇక్కడికి వచ్చేవాడిని'' అన్నారు. కానీ బహుశా ఇప్పుడు మన నిశ్శబ్దం ఆయన పాతగాయానికి జత కలిసివుంటుంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

క్లుప్తంగా

పూర్ణచందుకు జానమద్ది పురస్కారం



కడప సెవెన్‌రోడ్స్: జానమద్ది సాహితీ పీఠం దశమ సాహిత్య సేవా పురస్కారాన్ని విజయవాడకు చెందిన సుప్రసిద్ధ సాహితీవేత్త, ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందుకు అక్టోబరు 16న ప్రదానం చేయనున్నట్లు జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. బ్రౌన్‌శాస్త్రి 98వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సాహిత్యం, గ్రంథాలయ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు తొమ్మిదేళ్లుగా తమ సాహితీపీఠం పురస్కారాలు అందజేస్తోందని వివరించారు. ఈ పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువ, నూతన వస్త్రాలు, ప్రశంసాపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మంగళగిరి బైపాస్‌లో విద్యా శాఖ కార్యాలయం ఏర్పాటు



పూజలు చేస్తోన్న పోలా భాస్కర్

మంగళగిరి: కాలేజీ హయ్యర్ ఎడ్యుకేషన్, రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని కొత్తగా గుంటూరు జిల్లా మంగళగిరి బైపాస్‌లో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కృష్ణా జిల్లా ప్రసాదంపాడులో ఉన్న ఈ కార్యాలయాన్ని మంగళగిరి హైవే పక్కన ఏర్పాటు చేసిన భవనంలోకి ఆదివారం మార్చారు. దీనికి రాష్ట్ర కమిషనర్, కాలేజీ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ పూజలు నిర్వహించారు. 64 వేల చదరపు అడుగుల గల ఆరు అంతస్తుల భవనంలో కమిషనర్ కార్యాలయంతోపాటు విద్యా శాఖకు చెందిన రూసా, టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యాలయాలను ఇదే భవనంలోకి మార్చనున్నట్లు అధికారులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి



అంబేడ్కర్ ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

సాక్షి, అమరావతి: విజయవాడలో చేపట్టిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో జరుగుతోన్న అంబేడ్కర్ ప్రాజెక్ట్ పనులను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విగ్రహం ఏర్పాటు చేయనున్న వేదిక వద్ద జరుగుతోన్న కాంక్రీట్, కన్వెన్షన్ సెంటర్ పనులను పరిశీలించారు. నిర్దీత గడువులోగా విగ్రహ నిర్మాణ పనులను పూర్తి చేయడం కోసం రాత్రి పగలు పనిచేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు చెప్పిన విధంగానే విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న అంబేడ్కర్ జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని, పనులు ఆలస్యం కాకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

'స్పోర్ట్స్‌కోడ్ అమలు చేయించండి'

సాక్షి, అమరావతి: దేశంలో క్రీడాభివృద్ధికి నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్‌ను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కేపీ రావు కోరారు. ఆదివారం విజయవాడలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రధాని ఆలోచనలకు అనుగుణంగా క్రీడా సమాఖ్యలను ప్రక్షాళన చేయాలని కోరారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం క్షేత్రస్థాయి నుంచి స్పోర్ట్స్ కోడ్ అమలుకు చర్యలు చేపట్టిందని.. ఇదే బాటలో మరి కొన్ని రాష్ట్రాలు నడుస్తున్నాయని తెలిపారు.

8,665 లీటర్ల సారా ధ్వంసం

నర్సీపట్నం: అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరు వరకు పట్టుకున్న 8,665 లీటర్ల సారాను ఆదివారం ధ్వంసం చేశారు. నర్సీపట్నం పోలీసు సబ్ డివిజన్‌లో పట్టుకున్న సారాను నర్సీపట్నం మండలం గబ్బాడ సమీపంలోని నెల్లిమెట్ల వద్ద, అనకాపల్లి పోలీసు సబ్ డివిజన్‌లో పట్టుకున్న సారాను మండల కేంద్రం వి.మాడుగులలోను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) జాయింట్ డైరెక్టర్, జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్, ఏఎస్పీ విజయమణికంఠ చందోలు ఆధ్వర్యంలో సిబ్బంది పారబోశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ నుంచి గత నెలాఖరు వరకు జిల్లాలోని 28 పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 1,391 కేసులకు సంబంధించిన 8,665 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 8 సారా కేసుల్లో నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వరద తగ్గుముఖం

బేసిన్‌లో వర్షాలు తెరపి ఇవ్వడంతో సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం



శ్రీశైలం నుంచి నాలుగు గేట్ల ద్వారా సాగర్‌కు విడుదలవుతున్న నీరు

- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 8.39 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- కృష్ణాలో మరింత తగ్గిన వరద
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1.45 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- గొట్టా బ్యారేజ్ నుంచి 30 వేల క్యూసెక్కులు బంగాళాఖాతంలోకి

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: పరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లో) వర్షాలు తెరపి ఇవ్వడంతో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి నదుల్లో వరద తగ్గుముఖం పడుతోంది. వర్షపాత విరామం వల్ల ఉపనదుల్లో వరద తగ్గడంతో ఆదివారం గోదావరి ప్రవాహం సాధారణ స్థాయికి చేరుకుంది. భద్రాచలం వద్ద వరద మట్టం 30.9 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న జలాల్లో ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 8,50,469 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇందులో గోదావరి డెల్టాకు 11 వేల క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 8,39,469 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు వరద మట్టం 11.7 అడుగులకు తగ్గడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గిన నేపథ్యంలో సోమవారం ధవళేశ్వరం వద్ద ప్రవాహం మరింత తగ్గనుంది.

స్థిరంగా వంశధార, నాగావళి

వంశధార, నాగావళి నదుల్లో వరద స్థిరంగా కొనసాగుతోంది. గొట్టా బ్యారేజ్‌లోకి 40,602 క్యూసెక్కులు చేరుతుండగా.. కుడి కాలువకు 1,186, ఎడమ కాలువకు 142 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. 30,186 క్యూసెక్కులను బ్యారేజ్ 16 గేట్లను 0.6 మీటర్ల మేర ఎత్తి బంగాళాఖాతంలోకి వదిలేస్తున్నారు. నాగావళి నుంచి తోటపల్లి బ్యారేజ్‌లోకి 11,462 క్యూసెక్కులు చేరుతుండగా.. ఆయకట్టుకు 1,520 క్యూసెక్కులను విడుదల చేస్తూ, 6,979 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు నారాయణపురం ఆనకట్ట మీదుగా బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

శ్రీశైలం జలాశయంలోకి 2.16 లక్షల క్యూసెక్కులు

కృష్ణా, ఉపనదుల్లో వరద ప్రవాహం మరింతగా తగ్గింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 2,16,946 క్యూసెక్కులు చేరుతుండగా.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 18 వేలు, కల్వకుర్తి ద్వారా 1,600, హంద్రీ-నీవా ద్వారా 1,688 క్యూసెక్కులు తరలిస్తున్నారు. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,954, స్పిల్ వే నాలుగు గేట్లను పదడుగులు ఎత్తి 1,11,564.. మొత్తం 1,74,518 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.6 అడుగుల్లో 213.4 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 1,62,647 క్యూసెక్కులు చేరుతుండగా.. కుడి కాలువకు 9,500, ఎడమ కాలువకు 8,108, ఏఎమ్మార్పీకి 1,800, వరద కాలువకు 400 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,967, స్పిల్ వే 14 గేట్లను ఐదడుగులు ఎత్తి 1,09,872.. మొత్తం 1,42,839 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 585.6 అడుగుల్లో 305.86 టీఎంసీల నీరు ఉంది. పులిచింతలలోకి 1,36,192 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ 8వేలు, స్పిల్ వే 5 గేట్లను మూడడుగులు ఎత్తి 1,15,665.. మొత్తం 1,23,665 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం పులిచింతలలో 169.81 అడుగుల్లో 38.08 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,59,148 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణాడెల్టాకు 13,898 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మిగిలిన 1,45,250 క్యూసెక్కులను 60 గేట్లను మూడడుగులు, 10 గేట్లను రెండడుగులు ఎత్తి కడలిలోకి వదిలేస్తున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర, ఉజ్జయిని డ్యామ్‌లలోకి వరద తగ్గడంతోసోమవారం శ్రీశైలంలోకి వచ్చే వరద మరింత తగ్గనుంది.

వైభవం..వరసిద్ధుని మహాకుంభాభిషేకం

- ఐదు నెలల తర్వాత స్వయంభు దర్శనం
- తొలిరోజే పోటెత్తిన భక్తులు.. మధ్యాహ్నం నుంచి సర్వదర్శనం అమలు
- శిలాఫలకం ఆవిష్కరించిన శ్రీపురం స్వర్ణదేవాలయం వ్యవస్థాపకులు, శక్తి నారాయణి అమ్మవారు



కాణిపాక ఆలయంలో శిలాఫలకం ప్రారంభించిన శక్తినారాయణి అమ్మవారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

సాక్షి చిత్తూరు: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని విరాళదాతలు ఇచ్చిన రూ.10 కోట్లతో శిల్పకళా సౌందర్యంతో పునర్నిర్మించారు. ఇందులో భాగంగా ఆదివారం మహా కుంభాభిషేకం క్రతువును ఆగమ పండితులు వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు చతుర్థకాల పూజ, హోమం, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన నిర్వహించారు. 8 గంటలకు రాజగోపురం, పశ్చిమ ద్వార గోపురం, విమాన గోపురం, నూతన ధ్వజ స్తంభానికి, 8.30 గంటలకు స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను స్వయంభు దర్శనానికి అనుమతించారు. సుమారు 5 నెలల తరువాత స్వయంభు దర్శనం తిరిగి ప్రారంభించడంతో భక్తులు పోటెత్తారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. తొలి రోజే సుమారు 20–30 వేల మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కుంభాభిషేకం క్రతువు సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వేలూరు శ్రీపురం స్వర్ణదేవాలయం వ్యవస్థాపకులు శక్తినారాయణి అమ్మవారు ఆవిష్కరించారు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీ మిథున్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఎంఎస్‌బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో సురేష్‌బాబు, విరాళ దాత కుటుంబ సభ్యులు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఊరూరా

ఘన స్వాగతం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు ఘన స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరువేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



నెల్లూరు జిల్లా విరువూరులో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం సుద్ధగుండ్లపల్లెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం కన్నంపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

ఈ ఏడాదీ లోటు లేదు

మొదటి పేజీ తరువాయి


ఐదు అల్పపీడనాలు, రెండు వాయుగుండాలు ఏర్పడ్డాయి. ఇవి మోస్తరు నుంచి భారీ వర్షాలకు దోహదపడ్డాయి. దీంతో గత రెండు నెలల కాలంలో రాష్ట్రంలో సాధారణానికి మించి వర్షాలు కురిశాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (ఏపీఎస్‌డీపీఎస్) నివేదిక ప్రకారం ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజనులో ఇప్పటి వరకు రాష్ట్రంలో 370.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 379.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 2.4 శాతం అధికంగా వర్షం పడింది.

సత్యసాయి జిల్లాలో అత్యధికంగా..

ఈ సీజనులో రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. విశాఖ జిల్లాలో మాత్రమే సాధారణం కంటే 19.7% తక్కువ వర్షం కురిసింది. బాపట్ల, కాకినాడ, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. సత్యసాయి జిల్లా 58.7% అధిక వర్షపాతంతో ఏపీలోనే అత్యధిక వర్షపాతం కురిసిన జిల్లాగా తొలి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో బాపట్ల (+51.3%), అనంతపురం (+34.3%), కాకినాడ (+21.1%) జిల్లాలున్నాయి. సాధారణం కంటే 20%కి పైగా వర్షపాతం తక్కువ నమోదైతే లోటు వర్షపాతంగా పరిగణిస్తారు.

ఖరీఫ్‌కు ఢోకా లేదు..

నైరుతి రుతుపవనాల సీజన్ జూన్‌లో మొదలై సెప్టెంబర్‌తో ముగుస్తుంది. రెండు నెలలుగా ఎప్పటికప్పుడు వర్షాలు కురుస్తుండడంతో రాష్ట్రంలో ఎక్కడా కరువు పరిస్థితులు ఏర్పడలేదు. 40 రోజుల్లో నైరుతి రుతుపవనాల సీజన్ ముగియనుంది. రానున్న రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఐఎండీ అంచనా. ఈదఫా నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ వెల్లడించింది. వరుసగా నాలుగేళ్ల నుంచి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడం, ఈ ఏడాదీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఏపీఎస్‌డీపీఎస్ డేటా ప్రకారం ప్రస్తుత 'నైరుతి' సీజనులో వర్షపాతం (సెం.మీ.లో)

జిల్లా పేరు	కురిసింది	కురవాల్సింది	వ్యత్యాసం (శాతం)
శ్రీకాకుళం	432.9	445.8	-2.9
విజయనగరం	468.0	431.2	8.5
పార్వతీపురం మన్యం	529.4	496.6	6.6
అల్లూరి సీతారామరాజు	668.9	639.2	4.6
విశాఖపట్నం	303.5	377.0	-19.5
అనకాపల్లి	422.1	425.8	0.9
కాకినాడ	538.8	445.1	21.1
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	605.4	519.2	16.6
తూర్పు గోదావరి	621.2	539.8	15.1
పశ్చిమ గోదావరి	580.3	535.9	8.3
ఏలూరు	613.6	523.0	17.3
కృష్ణా	474.7	421.2	12.7
ఎన్టీఆర్	509.6	499.1	2.1
గుంటూరు	439.3	376.4	16.7
బాపట్ల	441.6	291.8	51.3
పల్నాడు	323.4	310.7	4.1
ప్రకాశం	181.7	203.5	-10.7
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	224.0	192.7	16.2
కర్నూలు	261.5	243.8	7.3
నంద్యాల	289.5	323.4	-10.5
అనంతపురం	240.2	178.8	34.3
శ్రీసత్యసాయి	317.1	199.8	58.7
వైఎస్సార్	224.9	243.1	-7.5
అన్నమయ్య	270.6	239.3	13.1
చిత్తూరు	308.2	276.0	11.7
తిరుపతి	217.9	263.4	-17.3
రాష్ట్రం మొత్తం	379.7	370.8	2.4

తెలుగు భాష అమలుకు విశిష్ట అధికారాలు

- ప్రత్యామ్నాయ పద నిధి ఏర్పాటు
- అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషను పటిష్టంగా అమలు చేసేందుకు సీఎం జగన్ విశిష్ట అధికారాలిచ్చారని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం విశాఖ ఏయూ హిందీ విభాగంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను చైతన్యవంతం చేస్తూ గత ప్రభుత్వం మూసివేసిన తెలుగు అకాడమీ, ఏపీ అధికార భాషాభివృద్ధి సమాఖ్యలను ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేసిందని చెప్పారు. మైసూరులో ఉన్న తెలుగు భాష ప్రాచీన అధ్యయన కేంద్రాన్ని నెల్లూరుకు తరలించి, 5 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. తెలుగును అధికార భాషగా అమలు చేయడంపై డివిజన్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమీక్షిస్తామన్నారు. శాస్త్ర, సాంకేతిక, న్యాయ పరిపాలనా రంగాల్లో పారిభాషక పదాలకు తెలుగులో ప్రత్యామ్నాయ పదాలను అన్వేషించి పద నిధి ఏర్పాటు చేయడంతోపాటు పరిపాలనా పదకోశాలను తయారు చేస్తామన్నారు. ఇంటర్ వరకు తెలుగును మొదటి భాషగా, డిగ్రీస్థాయి వరకు అన్ని సెమిస్టర్లలో తెలుగును పాఠ్యాంశంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ పాలనా వినియోగం కోసం రూ.25 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేసిన నిధిని 'తెలుగు భాషాభివృద్ధి నిధి'గా వ్యవహరిస్తామని చెప్పారు. తెలుగు భాష అమలులో నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన జరిమానాలు, శిక్షలు విధిస్తామన్నారు.

టీడీపీ నేతల హైడ్రామా

- ఆక్రమణదారును పరామర్శించే నెపంతో గలాటాకు యత్నం
- లోకేశ్‌ను శ్రీకాకుళం కొత్తబ్రిడ్జి వద్ద అడ్డుకున్న పోలీసులు
- విశాఖ విమానాశ్రయం వద్ద బైఠాయించిన లోకేశ్



విశాఖ ఎయిర్‌పోర్ట్ వద్ద బైఠాయించిన లోకేశ్

సాక్షి, విశాఖపట్నం/శ్రీకాకుళం రూరల్/కాశీబుగ్గ/నరసన్నపేట/ఎచ్చెర్ల క్యాంపస్: సిక్కోలులోను, విశాఖలోను ఆదివారం టీడీపీ నాయకుడు లోకేశ్, ఇతర నేతలు నాయకులు హైడ్రామా సృష్టించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విశాఖ విమానాశ్రయం వద్ద ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. లోకేశ్, పార్టీ శ్రేణులు రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించినా పోలీసులు సంయమనం పాటించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పలాసలో రెవెన్యూ అధికారులు భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. ఈ ఆక్రమణలన్నీ టీడీపీ నేతలవే కావడంతో ఆ పార్టీ నాయకులంతా ఆక్రమణల తొలగింపును వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున గలాటా సృష్టించడానికి ప్రయత్నించారు. ఆక్రమణదారుడు పలాస కౌన్సిలర్ సూర్యనారాయణను పరామర్శించే నెపంతో అందరూ ఒక్కచోటుకు చేరి గొడవ చేయడానికి పూనుకున్నారు. పలాసలో 144 సెక్షన్ అమల్లో ఉంది. ఆ పార్టీ నేత లోకేశ్ అనుమతి లేకుండా పలాస వెళ్లడానికి ప్రయత్నించగా శ్రీకాకుళం కొత్తబ్రిడ్జి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ కార్యకర్తలకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. అనంతరం లోకేశ్‌ను, పార్టీ నాయకులు కళా వెంకట్రావు, చినరాజప్పలను రణస్థలం పరిధిలోని జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లారు. లోకేశ్‌కు 149 నోటీసులు ఇచ్చి విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకెళుతుండగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. మార్గంమధ్యలో మధురవాడలో విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కుమారుడి వివాహ వేడుకకి హాజరైన ఆయన అక్కడ ప్రెస్ మీట్ పెడతామని చెప్పారు. 149, 151 నోటీసులు జారీచేసినప్పుడు మీడియాతో మాట్లాడకూడదని పోలీసులు పలు మార్లు చెప్పినా ఆయన వినిపించుకోకుండా బెదిరింపు ధోరణితో వ్యవహరించారు. దీంతో పోలీసులు లోకేశ్‌ని బలవంతంగా వాహనంలో ఎక్కించి విమానాశ్రయానికి తీసుకొచ్చారు. ఆయన ఎయిర్‌పోర్టు వద్ద పేవ్‌మెంట్‌పై బైఠాయించారు. నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం ఆరుగంటలకు ఆందోళన విరమించిన లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులు కిరాతకంగా తనని నిర్బంధించారని చెప్పారు. ఎక్కడికి తీసుకెళుతున్నారో చెప్పకుండా ఎయిర్‌పోర్టుకి తీసుకొచ్చారని, మధ్యలో పెళ్లికి తీసుకెళ్లారని, ఎయిర్‌పోర్టు బయట కూర్చోబెట్టారని పేర్కొన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడులను ముందస్తుగా నరసన్నపేట మండలం మడపాం టోల్‌గేట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం విడిచిపెట్టారు.

మంత్రివి ఎలా అయ్యావు లోకేశ్?

- కుప్పంలో చంద్రబాబును మత్స్యకారుడితో ఓడిస్తాం
- టీడీపీ చంద్రబాబు ఆక్రమించుకున్న పార్టీ
- మంత్రి సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: 'ఏపీ రాష్ట్రం మీ బాబు జాగీరా.. లోకేశ్ నువ్వు మంత్రి ఎలా అయ్యావు.. టీడీపీని ఆక్రమించుకున్నది మీరు. అలాంటి మీరు సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేస్తారా?' అంటూ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. ఆయన ఆదివారం శ్రీకాకుళం జిల్లా పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉండి దొడ్డిదారిలో లోకేశ్‌కు ఎమ్మెల్సీ ఇస్తే మంత్రి అయ్యారని చెప్పారు. చంద్రబాబు కుమారుడిగా పుట్టడం తప్ప లోకేశ్‌కు ఇంకెలాంటి అర్హతలు లేవని విమర్శించారు. ఎక్కడైనా ఎమ్మెల్యేగా గెలవగలవా అని సవాల్ విసిరారు. కుప్పంలో మత్స్యకారుడు పోటీచేస్తున్నాడని, ఆయనపై చంద్రబాబు గెలవగలరా అంటూ ప్రశ్నించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు అయితే దేశ నాయకుడు అయిపోరని చురకలు అంటించారు. సీఎం జగన్ వద్దకు వెళ్లాలంటే అప్పలరాజు వంటి లక్షలమందిని దాటాల్సి ఉంటుందని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు నివాసంతోపాటు ప్రజావేదిక వంటివన్నీ అక్రమ నిర్మాణాలేనని, అలాంటి వ్యక్తులు అక్రమాలపై మాట్లాడడమా అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే పలాసలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. వైఎస్ జగన్ నేర్పించిన క్రమశిక్షణ వల్ల సహనంతో ఉంటున్నామన్నారు. గౌతు కుటుంబసభ్యులు తమ 60 ఏళ్ల పాలనలో పలాసకు ఒక డిగ్రీ కాలేజీ తీసుకురాలేకపోయారని విమర్శించారు. సీఎం దయ వల్ల డిగ్రీ కళాశాల, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ కేంద్రాలు తెచ్చుకున్నామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని గిరిజన గ్రామాల్లో రూ.42 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గౌతు శిరీష మాటతీరు చూస్తుంటే లచ్చన్న మనవరాలి మాటల్లా లేవన్నారు. తనను పలుమార్లు పశువు పశువు అని సంబోధిస్తుంటే చాలా బాధ కలిగిందని చెప్పారు.

ఇతర రాష్ట్రాలకూ విద్యుత్ ఎగుమతి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను భారీ స్థాయిలో నెలకొల్పడం ద్వారా భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేసే స్థాయికి ఏపీ చేరనుందని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం వర్చువల్ విధానంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కొత్త యూనిట్ల ప్రారంభం ద్వారా రాష్ట్ర విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్(ఎస్డీఎస్టీపీఎస్) కృష్ణపట్నం రెండో దశలో 800 మెగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి ఈ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్(డాక్టర్ ఎన్టీటీపీఎస్) ఐదో దశలో మరో 800 మెగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అందుబాటులోకొస్తుందని మంత్రి వివరించారు. 33,240 మెగావాట్ల సామర్థ్యంతో పునరుత్పాదక(పవన, సౌర, జల) ఇంధన ప్రాజెక్టుల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దేశంలోనే ఇది వినూత్న ప్రయోగమన్నారు. ఇంత భారీ స్థాయిలో విద్యుదుత్పత్తి వల్ల మన రాష్ట్రం నుంచి విద్యుత్‌ను వాణిజ్య పరంగానూ ఎగుమతి చేయవచ్చని మంత్రి వివరించారు. అప్పులు, వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు అమర్చటం, ట్రూ అప్, ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ, నైపుణ్య అభివృద్ధి వంటి అంశాలపై అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భవిష్యత్‌లోనూ పెద్ద ఎత్తున పవన విద్యుదుత్పత్తికి అనుకూల వాతావరణ పరిస్థితులున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మీటిరోలోజీ ఇచ్చిన నివేదికను మంత్రి స్వాగతించారు.

'ఖురాన్ మానవత్వాన్ని బోధిస్తుంది'

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు) : మానవులందరూ సమానత్వం, మానవత్వంతో జీవించాలని ఖురాన్ బోధిస్తుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జనరల్ సెక్రటరీ హజరత్ మౌలాలీ ఖాలీద్ సైఫుల్లా రహ్మాని సాహెబ్ అన్నారు. విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సాహెబ్ మాట్లాడుతూ ముస్లిం పర్సనల్ లాకు సంబంధించిన అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయని, వాటిని నివృత్తి చేసేందుకు ముస్లిం న్యాయవాదులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భార్య, భర్త, తల్లిదండ్రులు, వారసులు, ఆస్తి, పెళ్లి, విడాకులకు సంబంధించిన అన్ని హక్కులు ముస్లిం పర్సనల్ లాలో ఉన్నాయని వివరించారు. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జాతీయ సహాయ ప్రధాన కార్యదర్శి హజరత్ మౌలాలీ షా ఖాద్రీ సయ్యద్ ముస్తఫా రిఫాయ్ జిలానీ సాహెబ్, రాష్ట్ర కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముఫ్తీ ఓమర్ అబిదీన్ సాహెబ్, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జవహర్ ఆలీ, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, కోశాధికారి ఇక్బాల్ ఆలీ పాల్గొన్నారు. స్వాతంత్య్రం కోసం ముస్లింలు చేసిన పోరాటాలు, త్యాగాల గురించి తెలియజేస్తూ చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహ్మద్ రాసిన 'చరితార్థులు-2' పుస్తకాన్ని ఈ సందర్భంగా అతిథులు ఆవిష్కరించారు.

ఇంకా జల్లెడ నుంచి చంద్రుడిని చూస్తారా?

రాజస్తాన్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



జైపూర్: కర్వాచౌత్ నాడు భారతీయ మహిళలు జల్లెడ ద్వారా చంద్రుడిని చూసి తమ భర్తల ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు నిర్వహించడం దురదృష్టకరమని రాజస్తాన్ మంత్రి గోవింద్ రామ్ మేఘవాల్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రేపాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైన్స్ ప్రపంచంలో బతుకుతూ ఉంటే, మన దేశంలో జల్లెడ ద్వారా చంద్రుడిని చూస్తూ భర్త ఆయుష్షు కోసం పూజలు చేస్తున్నారని మరి ఆ భర్తలు భార్యల కోసం జల్లెడలోంచి ఎప్పుడూ చంద్రుడిని చూడలేదని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఎందరో భారతీయ మహిళలు విమాన పైలెట్లుగా ఉన్నారని, కల్పనా చావ్లా వంటి వారు అంతరిక్షంలోకి వెళ్లారని బీజేపీ ఎమ్మెల్యే రామ్‌లాల్ శర్మ గుర్తు చేశారు.

క్లుప్తంగా...

జపాన్ ప్రధాని కిషిదాకు కరోనా

న్యూఢిల్లీ: జపాన్ ప్రధాని ఫుమియో కిషిడాకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణయింది. అధికార నివాసంలోనే చికిత్స తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. కిషిడా కోవిడ్ నుంచి త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ ఆదివారం ట్విట్టర్ ద్వారా ఆకాంక్షించారు.

హిమాచల్ కాంగ్రెస్‌కు ఆనంద్ శర్మ షాక్



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఆనంద్ శర్మ ఆదివారం తన పదవి నుంచి వైదొలిగారు. ఆత్మ గౌరవానికి మించింది ఏదీలేదంటూ ఆయన పార్టీ చీఫ్ సోనియా గాంధీకి లేఖ రాశారు. తనతో సంప్రదించకుండానే రాష్ట్ర పార్టీ నిర్ణయాలు తీసుకోవడం, సమావేశాలకు ఆహ్వానించకపోవడం బాధించిందని పేర్కొన్నారు. అయితే, పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొంటానని స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న జీ-23 బృందం నేతల్లో ఆనంద్ శర్మ ఒకరు. ఈ బృందం నేత గులాం నబీ ఆజాద్ జమ్మూకశ్మీర్ ప్రచార కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన కొద్ది రోజులకే తాజా పరిణామం సంభవించింది.

కార్పొరేట్ల కంటే సామాన్యుడి పైనే పన్ను భారం: రాహుల్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం పన్ను ఆదాయంలో కార్పొరేట్ల కంటే సామాన్యుడి నుంచి వసూలు చేసేదే ఎక్కువగా ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సన్నిహితులైన కార్పొరేట్ మిత్రులపై పన్నులను తగ్గిస్తూ వస్తున్న కేంద్ర సర్కారు ప్రజలపై మాత్రం ఆ భారం పెంచుతూ పోతోందంటూ ఆదివారం ఆయన ట్విట్టర్‌లో గ్రాఫ్ ద్వారా వివరించారు. 2010లో పన్నుల ద్వారా ప్రభుత్వానికి లభించిన ఆదాయంలో కార్పొరేట్ల వాటా 40%, మిగతా ప్రజల వాటా 24%గా ఉంది. 2021లో కార్పొరేట్ కంపెనీల పన్ను వాటా 24%కి తగ్గిపోయి, మిగతా ప్రజల వాటా 48%కి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.


కాంగ్రెస్ చీఫ్ ఎన్నిక షెడ్యూల్ ప్రకారమే

కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎన్నిక ప్రక్రియ మొదలైందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే సెప్టెంబర్ 20వ తేదీ నాటికి కొత్త అధ్యక్షుడి ఎంపిక పూర్తవుతుందని పేర్కొన్నాయి. అధ్యక్షుడి ఎన్నిక తుది తేదీని సీడబ్ల్యూసీ నిర్ణయించాల్సి ఉందని పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ తెలిపారు. ఆగస్ట్ 21– సెప్టెంబర్ 20వ తేదీలకు మధ్యలోనే ఉంటుందన్నారు.

ప్రతి ఓటు కోసం చివరిదాకా పోరు : రిషి

లండన్: అధికార కన్జర్వేటివ్ పార్టీ నేత ఎన్నికకు మరో రెండు వారాల గడువే ఉండటం, ప్రధాన ప్రత్యర్థి లిజ్ ట్రస్ కంటే వెనుకబడి ఉన్న నేపథ్యంలో రిషి సునాక్ వర్గం కొత్త తరహా ప్రచారాన్ని ప్రకటించింది. శుక్రవారం రాత్రి మాంచెస్టర్‌లో జరిగిన ప్రచార కార్యక్రమంలో రిషి పాల్గొన్నారు. 'చివరి రోజు వరకు ప్రతి ఓటు కోసం పోరాటం కొనసాగిస్తూనే ఉంటా'అంటూ రిషి సునాక్ ట్వీట్ చేస్తూ మాంచెస్టర్ ప్రచార వీడియోను విడుదల చేశారు. అందులో 'అండర్ డాగ్‌తో జాగ్రత్త. ఎందుకంటే ఓటమి అంచున ఉన్న వాళ్లు పోగొట్టుకునేదేమీ ఉండదు. ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటారు'అని వినిపిస్తుంటుంది.

'మహాకాల్' వివాదంపై జొమాటో క్షమాపణలు



భోపాల్: హృతిక్ రోషన్ నటించిన మహాకాల్ వాణిజ్య ప్రకటన వివాదం కావడంతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో క్షమాపణ చెప్పింది. తాము పేర్కొన్న మహాకాల్ ఒక రెస్టారెంటే తప్ప ఉజ్జయిని ఆలయానికి సంబంధించింది కాదంటూ వివరణిచ్చింది. ఆ ప్రకటనలో హృతిక్..'ఉజ్జయినిలో నాకు థాలి(నార్త్ ఇండియా భోజనం) తినాలనిపిస్తే మహాకాల్ నుంచే తెప్పించుకుని తింటా' అని అంటారు. దీనిపై మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయ పూజారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో, తమ ప్రకటన ఉజ్జయినిలోని అందరికీ తెలిసిన మహాకాల్ రెస్టారెంట్‌కు మాత్రమే సంబంధించిందని జొమాటో వివరణ ఇచ్చుకుంది.

కట్టేందుకు మూడేళ్లు... కూల్చేందుకు... తొమ్మిదే సెకన్లు

నోయిడా జంట భవనాలు వచ్చే ఆదివారం నేలమట్టం
- 3,500 కేజీల పేలుడు పదార్థంతో కూల్చివేత
- చుట్టుపక్కల నివసిస్తున్న వారిలో టెన్షన్.. టెన్షన్

ఆగస్టు 28. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో అక్రమంగా నిర్మించిన సూపర్‌టెక్ జంట భవనాలను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు నేలమట్టం చేయనున్నారు. 40 అంతస్తులున్న ఈ భవనాలను ఆగస్టు 21నే కూల్చేయాల్సి ఉన్నా భద్రతా ఏర్పాట్లకు అధికారులు గడువు కోరడంతో 28కి వాయిదా పడింది.

ఏం జరిగింది?

నోయిడాలో ఎమరాల్డ్ కోర్టు సమీపంలోని సెక్టార్ 93ఏలో ఎపెక్స్, సియాన్ ట్విన్ టవర్స్ ఉన్నాయి. ఎపెక్స్ ఎత్తు 102 మీటర్లు. దీన్ని 32 అంతస్తులతో నిర్మించారు. 95 మీటర్ల ఎత్తున్న సియాన్‌లో 29 అంతస్తులున్నాయి. ఈ జంట భవనాల్లో 915 ఫ్లాట్లు, 21 వాణిజ్య సముదాయాలు, రెండు బేస్‌మెంట్లున్నాయి. 2009లో సూపర్‌టెక్ లిమిటెడ్ కంపెనీ దీని నిర్మించింది. పూర్తవడానికి మూడేళ్లు పట్టింది. అయితే పలు నిబంధనల్ని కంపెనీ గాలికొదిలేసింది. నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్‌బీసీ) ప్రకారం గృహ నివాస భవనాల మధ్య కనీసం 16 మీటర్ల దూరముండాలి. కానీ ఎపెక్స్‌కు, పక్కనే ఉన్న ఎమరాల్డ్ కోర్టులోని టవర్‌కు మధ్య 9 మీటర్ల దూరం కూడా ఉంచలేదు. దాంతో ఎమరాల్డ్ కోర్టు నివాసులు 2012లోనే కోర్టుకెక్కారు. వీటి నిర్మాణం అక్రమమేనని తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు 2014లో తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టులోనూ కంపెనీకి ఎదురు దెబ్బ తగిలింది. జంట భవనాల్ని కూల్చేయాల్సిందేనని కోర్టు 2021 ఆగస్టు 31న తీర్పునిచ్చింది. అందుకు ఈ నెలలో తుది గడువు ప్రకటించింది.

మూడేళ్ల పాటు నిర్మించిన ఆకాశ హర్మ్యాలవి. తొమ్మిదంటే తొమ్మిదే సెకండ్లలో నేలమట్టం కానున్నాయి. నోయిడాలో అక్రమంగా నిర్మించిన 100 మీటర్ల ఎత్తైన జంట భవనాలు చూస్తుండగానే కుప్పకూలనున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాటిని కూల్చడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతకూ ఈ ట్విన్ టవర్స్‌ను ఎలా కూలుస్తారు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?



భద్రతా ఏర్పాట్లు ఇలా ?

- ఇంత ఎత్తైన భవనాల కూల్చివేత వల్ల పరిసర ప్రాంతాలకు, ఇతర నివాసాలకు నష్టం లేకుండా చూడటం సవాలుగా మారింది. ఇందుకోసం ఎన్నో జాగ్రత్తలు చేపట్టారు.
- ట్విన్ టవర్స్ సమీపంలోనిఎమరాల్డ్ కోర్టు, ఏటీఎస్ విలేజ్ సొసైటీస్‌లో నివసిస్తున్న 5 వేల మందిని ఆగస్టు 28న ఖాళీ చేయిస్తున్నారు. ఉదయం 7.30కి ఇళ్లు వీడి, సాయంత్రం ఎడిఫస్ కంపెనీ చెప్పాకే తిరిగి రావాలి.
- వారికి చెందిన 1200 వాహనాలను కూడా తరలిస్తున్నారు.
- టవర్స్ సమీపంలోని నోయిడా–గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాల రాకపోకల్ని మధ్యాహ్నం 2.15 నుంచి 2.45వరకు నిలిపివేస్తారు.
- జంట భవనాలున్న ప్రాంతంలోకి ఆగస్టు 28 రోజంతా ప్రజలు, వాహనాలు, జంతువులు ఎవరినీ రానివ్వరు.
- చుట్టుపక్కల భవనాల్లోకి ధూళి, సిమెంట్ ముక్కలు పోకుండా మూడంచెల భద్రతా ఏర్పాటు చేశారు.
- పేల్చివేతతో చుట్టుపక్కల భవనాలకు నష్టం జరగకుండా జంట భవనాల చుట్టూ కందకం తవ్వారు. అదనపు భద్రత కోసం మధ్యలో అతి పెద్ద కంటైనర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- చుట్టుపక్కల భవనాల కోసం ముందు జాగ్రత్త చర్యగా ఎడిఫస్ కంపెనీ రూ.100 కోట్ల బీమా కవరేజీ తీసుకుంది!
- అగ్నిమాపక శకటాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచుతున్నారు.

ఇలా కూలుస్తారు...

- కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆగస్టు 28 మధ్యాహ్నం 2.30కు కంట్రోల్డ్ ఇంప్లోజన్ టెక్నిక్ సాయంతో కూల్చివేత జరుగుతుంది.
- రెండు భవనాలూ తొమ్మిది సెకండ్లలో పేకమేడలా నేలకొరుగుతాయి. దీన్ని ఎడిఫిస్ ఇంజనీరింగ్ సంస్థ పర్యవేక్షిస్తోంది.
- 46 మంది ఇంజనీర్లు రోజుకు 12 గంటలు నిర్విరామంగా పని చేస్తున్నారు. 300కు పైగా సీసీటీవీ కెమెరాలతో పనులను పర్యవేక్షిస్తున్నారు.
- కూల్చివేతకు 3,500 కేజీల పేలుడు పదార్థాలను వాడుతున్నారు. రెండు భవనాల్లో ఏకంగా 9,600 రంధ్రాలు చేసి వాటిని నింపుతారు.
- సియాన్ టవర్‌లో పేలుడు పదార్థాలు నింపడం పూర్తయింది. ఎపెక్స్‌నూ పూర్తి కావచ్చింది.
- హర్యానాలోని పల్వాల్‌లో పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పెసో) నుంచి పేలుడు పదార్థాలు తెప్పిస్తున్నారు.
- కూల్చివేత కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి బ్రిటన్ నుంచి నిపుణుల్ని రప్పిస్తున్నారు.
- కూల్చివేతతో 25 వేల క్యూబిక్ మీటర్ల శిథిలాలు మిగులుతాయని అంచనా. వీటి తొలగింపుకే కనీసం మూణ్నెల్లు పడుతుంది. వీటి డంపింగ్‌కు సూపర్‌టెక్ కంపెనీ 5 హెక్టార్లు కేటాయించింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీలో తికాయత్ నిర్బంధం




న్యూఢిల్లీ: నిరుద్యోగ సమస్యపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న రైతు నేత రాకేశ్ తికాయత్‌ను ఢిల్లీ పోలీసులు ఘాజీపూర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. మధు విహార్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, తిరిగి వెళ్లిపోవాల్సిందిగా కోరినట్లు ఆయన్ను కోరినట్లు స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్(శాంతి భద్రతలు) దేపేంద్ర పాఠక్ చెప్పారు. ఆయన అంగీకరించడంతో పోలీసు భద్రతతో వెనక్కి పంపినట్లు వివరించారు. దేశ రాజధానిలో అనవసరంగా గుమిగూడటాన్ని నివారించడానికే తికాయత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. రైతు గళం వినిపించకుండా చేసేందుకు కేంద్రం ఆదేశాల మేరకే ఢిల్లీ పోలీసులు తనను నిర్బంధంలోకి తీసుకున్నారని తికాయత్ ఆరోపించారు. ఇది మరో విప్లవానికి నాంది కానుందని, తమ పోరాటం ఆపేది లేదని ఆయన ట్వీట్ చేశారు. తికాయత్‌ను నిర్బంధించడాన్ని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఖండించారు. రైతు సంఘాల సమాఖ్య ఎస్‌కేఎం సోమవారం జంతర్‌మంతర్‌లో మహాపంచాయత్ తలపెట్టిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

కేజ్రీవాల్‌కు సంకెళ్లే

- ఎక్సైజ్ కుంభకోణంలో ఆయనే ప్రధాన సూత్రధారి: బీజేపీ
- నాపై లుకౌట్ నోటీసు: సిసోడియా
- అలాంటిదేమీ లేదన్న సీబీఐ



కేజ్రీవాల్



సిసోడియా

న్యూఢిల్లీ: ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాలే కీలక సూత్రధారి అని బీజేపీ ఆరోపించింది. అతి త్వరలో ఆయనకు సంకెళ్లు తప్పవని జోస్యం చెప్పింది. కరోనా ఉధృతి సమయంలో ప్రజలంతా సాయం కోసం అల్లాడిపోతుంటే కేజ్రీవాల్ మాత్రం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆదివారం ఆరోపించారు. ఆయన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. ''ఎక్సైజ్ విధానం కుంభకోణంలో మూలాలు కేజ్రీవాల్ ఇంటికే దారి తీస్తున్నాయి. చట్టానికి ఎవరూ అతీతులు కారు. అక్రమార్కులు శిక్ష అనుభవించాల్సిందే'' అన్నారు. మరోవైపు తనపై సీబీఐ లుక్‌ఔట్ నోటీసు జారీ చేసిందని ఎక్సైజ్ పాలసీ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, మనీశ్ సిసోడియా ఆదివారం ట్వీట్ చేశారు. తాను అందరికీ అందుబాటులో ఉన్నా సీబీఐ ఇలా డ్రామాలాడుతోందని మండిపడ్డారు. ''మోదీజీ! నేనెక్కడున్నానో తెలియడం లేదా? ఎక్కడికి రమ్మన్నా వస్తా'' అటూ ట్వీట్ చేశారు. తన ఇంట్లో సోదాల్లో ఆదాయానికి మించిన ఆస్తి ఒక్క రూపాయి కూడా సీబీఐకి దొరకలేదన్నారు. సిసోడియా ఆరోపణలను సీబీఐ ఖండించింది. ఇప్పటిదాకా నిందితులెవరికీ లుకౌట్ నోటీసులివ్వలేదని స్పష్టం చేసింది. ''ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు అనుమతి లేకుండా దేశం దాటలేరు. కాబట్టి వారికి ఆ నోటీసులు అవసరం లేదు'' అని పేర్కొంది. ఈ కేసులో 8 మంది ప్రైవేటు వ్యక్తులకు లుకౌట్ నోటీసులిచ్చినట్టు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా మాత్రం, కుంభకోణాలకు పాల్పడితే లుకౌట్ నోటీసులొస్తాయి తప్ప గ్రీటింగ్ కార్డులు కాదనడం విశేషం. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ కరడుగట్టిన అవినీతిపరులని ఆరోపించారు. సిసోడియా తక్షణం రాజీనామా చేయాలని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ చౌదరి డిమాండ్ చేశారు.

ఇక మోదీ వర్సెస్ కేజ్రీ: సిసోడియా

కేజ్రీవాల్ ప్రధాని అవుతారని సిసోడియా జోస్యం చెప్పారు. ప్రజలంతా అదే కోరుకుంటున్నారు. కేజ్రీవాల్‌కు అవకాశమిచ్చి చూడాలన్న ఆలోచనలో ఉన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు మోదీ వర్సెస్ కేజ్రీవాల్‌గా జరగడం ఖాయం'' అన్నారు. కేజ్రీవాల్ మాట్లాడుతూ కేంద్రం రోజూ ఉదయమే సీబీఐ–ఈడీ అంటూ గేమ్ ఆడుతోందని దుయ్యబట్టారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాల్సిన కేంద్రం దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించారు.

మరిన్ని హైదరాబాద్ లింకులు?

ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన పలు హోల్‌సేల్, రిటైల్ మద్యం వర్తకుల పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. ''ఢిల్లీలో మద్యం లైసెన్సులను దక్కించుకున్న పలువురు వ్యక్తులు, కంపెనీలకు హైదరాబాద్ మూలాలున్నాయి. ఇక్కడి అడ్రస్‌లతోనే వారు టెండర్లు దాఖలు చేశారు. ఈ పాలసీకి పాపులారిటీ పెంచేందుకు 50 మంది దాకా స్టాండప్ కమేడియన్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తదితరులను పనిముట్లుగా వాడుకున్నట్టు తేలింది. వీరి విదేశీ యాత్రలు, విదేశాల నుంచి అందిన నిధులపై విచారణ సాగుతోంది'' అని వివరించారు.

కుంభకోణంలో కేసీఆర్ కుటుంబీకుల పాత్ర: బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: వివాదాస్పద ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల పాత్ర ఉందని బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ ఆరోపించారు. ''పాలసీ రూపకల్పన కోసం ఢిల్లీలోని ఒబెరాయ్, చండీగఢ్‌లోని హయత్ హోటళ్లలో జరిగిన భేటీల్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు, సిసోడియా, ఢిల్లీ ఎక్సైజ్ కమిషనర్, ఆ శాఖ అధికారులు, లిక్కర్ మాఫియా వ్యక్తులు పాల్గొన్నారు. ఒబెరాయ్ హోటల్లో సూట్‌ను తెలంగాణ మద్యం మాఫియాకు చెందిన వ్యక్తి ఆర్నెల్ల కోసం బుక్ చేశాడు. డీల్ జరిగినన్ని రోజులు కేసీఆర్ కుటుంబ సభ్యులు తెలంగాణ మద్యం మాఫియా ఏర్పాటు చేసిన ప్రైవేట్ విమానంలో హైదరాబాద్ నుంచి ఢిల్లీ వచ్చేవారు. లిక్కర్ మాఫియా కమిషన్‌ను 10 శాతానికి పెంచేందుకు ఒప్పందం కుదిరింది. అందుకు ప్రతిగా తొలి విడతగా రూ.150 కోట్లు సిసోడియాకు లంచంగా ముట్టింది. దీన్ని తెలంగాణ లిక్కర్ మాఫియానే ఇచ్చింది. గోవా, పంజాబ్ ఎన్నికల ఖర్చుల నిమిత్తం ఆప్‌కు లిక్కర్ మాఫియా అడ్వాన్స్ చెల్లింపులు జరిపింది. ఆ తర్వాతే పంజాబ్‌లోనూ, ఢిల్లీలోనూ కొత్త మద్యం విధానాల అమలు మొదలైంది. పంజాబ్‌లో ఆప్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ తరహా ఎక్సైజ్ విధానాన్నే అక్కడ కేసీఆర్ కుటుంబీకులు అమలు చేయించారు'' అని ఆరోపించారు. లిక్కర్ పాలసీపై కేసీఆర్ కుటుంబీకులతో భేటీ అయ్యారో లేదో సిసోడియా చెప్పాలని డిమాండ్ చేశారు.

చైనా లోన్ యాప్ నెట్‌వర్క్ గుట్టురట్టు

రూ.500 కోట్ల వసూళ్లు: 22 మంది అరెస్టు

న్యూఢిల్లీ: సామాన్యుల పాలిట ప్రాణాంతకంగా మారిన చైనా లోన్ యాప్‌ల నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. రుణాలు చెల్లించాలంటూ జనాన్ని పీడిస్తున్న 22 మందిని అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ ఫ్యుజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ యూనిట్ దాదాపు రెండు నెలలపాటు శ్రమించి, రుణ యాప్‌ల బండారం బహిర్గతం చేసింది. ఈ నెట్‌వర్క్‌లో 100కు పైగా నకిలీ యాప్‌లు ఉన్నట్లు తేల్చారు. వాటిని బ్లాక్ చేశారు. వీటితో చైనా సంస్థలకు నేరుగా సంబంధాలు ఉన్నాయని డీసీపీ కేపీఎస్ మల్హోత్రా చెప్పారు. వీరు రూ.500 కోట్ల దాకా వసూలు చేసినట్టు వివరించారు. రుణ యాప్‌ల ముఠా నుంచి రూ.4 లక్షల నగదు, 51 మొబైల్ ఫోన్లు, 25 హార్డ్‌డిస్కులు, 9 ల్యాప్‌టాప్‌లు, 19 క్రెడిట్, డెబిట్ కార్డులు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చైనా రుణ యాప్‌ల ఆగడాలపై నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా పోలీసులకు వందలాది ఫిర్యాదులందాయి. కేటుగాళ్లు ఈ యాప్‌ల ద్వారా కొద్ది మొత్తంలో రుణాలు ఇస్తున్నారు. వడ్డీలపై వడ్డీలు వేసి భారీగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.5,000 నుంచి రూ.10,000 దాకా రుణం తీసుకుంటే రూ.లక్షల్లో తిరిగి చెల్లించాల్సిందే. కొన్నిసార్లు ఎంత చెల్లించినా అప్పు తీరదు. చెల్లించని వారిని వేధింపులకు గురి చేస్తున్నారని పోలీసులు చెప్పారు. చైనాలోని జిజియా ఝూంగ్, లువో రోంగ్‌నుంచి రుణ యాప్‌ల నెట్‌వర్క్ నడిపిస్తున్నారని వెల్లడించారు. ఈ రాకెట్ కార్పొరేట్ తరహాలో పని చేస్తోందని, డైరెక్టర్లు, మేనేజర్లు, టీమ్ హెడ్స్, టెలీకాలర్స్ ఉంటారని తెలిపారు.

కరువుపై మేఘమథన అస్త్రం!

ప్రణాళికలు సిద్ధం చేస్తున్న చైనా ప్రభుత్వం

చాంగ్‌కింగ్(చైనా): దక్షిణ చైనాలో కరువు ఉరుముతోంది. ఎండలు మండిపోతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. నదుల్లో నీరు లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఏసీలు వాడొద్దని అధికారులు సూచనలు జారీ చేస్తున్నారు. కరెంటు లేక ఫ్యాక్టరీలకు తాళాలు వేయాల్సి వస్తోంది. రిజర్వాయర్లలో నీరు అడుగంటుతోంది. తాగునీరు కూడా సరఫరా కావడం లేదు. కరువు నేపథ్యంలో కొన్నిచోట్ల అత్యవసర పరిస్థితిని సైతం ప్రకటించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కరువు సమస్యను అధిగమించడానికి మేఘ మథనంపై చైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. మేఘాలపై రసాయనాలు వెదజల్లి, వర్షాలు కురిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది. సిచువాన్, హూబే ప్రావిన్స్‌ల్లోనూ ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు చేతికి రాకుండా పూర్తిగా ఎండిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో పంటలను కరువు బారినుంచి కాపాడుకోవాలన్నదే తమ ప్రయత్నమని పేర్కొంది. చైనాలో వర్షపాతం, ఉష్ణోగ్రతలను ప్రభుత్వం అధికారికంగా రికార్డు చేసే ప్రక్రియ 61 ఏళ్ల క్రితం ప్రారంభమయ్యింది. ఇప్పటి నుంచి ఇప్పటిదాకా చూస్తే ఈ ఏడాదే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సిచువాన్ ప్రావిన్స్‌లో 45 డిగ్రీల సెల్సియస్(113 డిగ్రీల ఫారెన్‌హీట్) ఉష్ణోగ్రత నమోదయ్యింది. దక్షిణ చైనాలో వరిసాగు అధికం. పంట దెబ్బతినకుండా కాపాడుకోవడానికి రాబోయే 10 రోజులు చాలా కీలకమని వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెంజియాన్ చెప్పారు. ఇప్పటికిప్పుడు వర్షాలు కురిసే అవకాశం లేదు. దాంతో చైనా సర్కారుకు ఇప్పుడు మేఘమథనం (క్లౌడ్ సీడింగ్) ఒక ప్రత్యామ్నాయంగా మారింది. డ్రోన్ల సాయంతో మేఘాలపై రసాయనాలు చల్లి, కృత్రిమంగా వర్షాలు కురిపించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, ఉత్తర చైనాలో మాత్రం వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కింగాయ్ ప్రావిన్స్‌లో వరదల కారణంగా 26 మంది మృతిచెందారు. ఐదుగురు గల్లంతయ్యారు.



మూగబోయిన మధుర స్వరం

పాక్ గానకోకిల నయ్యారా నూర్ కన్నుమూత



కరాచి: పాకిస్తాన్ గానకోకిల, మెలోడి క్వీన్ నయ్యారా నూర్ కన్నుమూశారు. ఆమె వయసు 71 సంవత్సరాలు. నయ్యారా మరణంతో పాకిస్తాన్, భారత్ రెండింటి సంస్కృతులకి ప్రతీకగా నిలిచే సంగీత దిగ్గజాల శకం ముగిసినట్టయింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కరాచీలో ఆస్పత్రిలో తుది శ్వాస విడిచినట్టుగా ఆమె మేనల్లుడు రజా జైదీ వెల్లడించారు. 1950లో అస్సాంలోని గౌహతిలో నయ్యారా నూర్ జన్మించారు. దేశ విభజన సమయంలో ఆమె తండ్రి మహమ్మదాలీ జిన్నాకి చెందిన ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీలో చురుగ్గా ఉండేవారు. 1958లో ఆమె కుటుంబం లాహోర్‌కు వెళ్లిపోయింది. ఆమెలోని ప్రతిభకు చిన్న వయసులోనే పాకిస్తాన్ రేడియోలో పాడే అవకాశం వచ్చింది. 1971లో తొలిసారిగా పాకిస్తాన్ టెలివిజన్ సీరియల్స్‌కి పాడారు. ఆ తర్వాత వెండితెరకి పరిచయమయ్యారు. ఘరానా, తాన్‌సేన్ వంటి చిత్రాల్లో నయ్యారా పాడిన పాటలు దేశాన్ని ఒక ఊపు ఊపేశాయి. నయ్యారా స్వరం వెంట గాలిబ్ గజల్స్‌ను పాక్, భారత్‌లో కోట్లాది మంది మైమరచి వినేవారు. కెరీర్ ఉచ్ఛ దశలో ఉన్నప్పుడే పెళ్లి చేసుకొని వైవాహిక జీవితానికే ఆమె ప్రాధాన్యం ఇచ్చారు. లతా మంగేష్కర్‌కు ఆమె వీరాభిమాని.

పుతిన్ సన్నిహితుడి కుమార్తె హత్య

కారు బాంబు పేలి ప్రాణాలు కోల్పోయిన దారియా డుగిన్



మాస్కో: రష్యా కరడుగట్టిన జాతీయ వాది, అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అత్యంత సన్నిహితుడైన అలెగ్జాండర్ డుగిన్ కుమార్తె దారియా డుగిన్ దారుణ హత్యకు గురయ్యారు. ఆమె నడిపిస్తున్న ఎస్‌యూవీ వాహనంలో బాంబు అమర్చడంతో అది పేలిపోయిప్రాణాలు కోల్పోయారు. మాస్కో శివార్లలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన అధికార పార్టీలో తీవ్ర విషాదాన్ని నింపింది. 29 ఏళ్ల వయసున్న దారియా తన తండ్రితో కలిసి ఒక సాంస్కృతిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆఖరి నిముషంలో ఆమె ఒక్కరే తన తండ్రి కారుని డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి తిరిగి వస్తుండగా మాస్కోకి 40 కి.మీ. దూరంలోని బోల్షి అనే గ్రామం దగ్గరకి వచ్చేసరికి కారులో అమర్చిన బాంబు పేలి వాహనం తునాతునకలైంది. దారియా డుగిన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పుతిన్ ఆలోచనల్ని ప్రభావితం చేసే స్థాయి కలిగిన నాయకుడిగా అలెగ్జాండర్‌ను అభివర్ణిస్తూ ఉంటారు. ఉక్రెయిన్‌పై దండయాత్రని గట్టిగా సమర్థించిన నాయకుల్లో అలెగ్జాండర్ ఒకరు. నవ రష్యా నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి అలెగ్జాండర్‌ను లక్ష్యంగా చేసుకొని బాంబుని అమర్చారని, ఆయన ఆఖరి నిముషంలో తన షెడ్యూల్ మార్చుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారని రష్యా పోలీసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ బాంబు అమర్చింది ఎవరా అన్న దిశగా మాస్కోలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ నిర్వహిస్తోంది. ఉక్రెయిన్ వేర్పాటువాద సంస్థ పనని అనుమానిస్తోంది.

'ఆ మూక హత్యలు మావాళ్లు చేసినవే'



జైపూర్: తన మద్దతుదారుల మూకదాడిలో ఆవుల స్మగ్లర్లు ఐదుగురు హతమయ్యారని చెప్పుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే జ్ఞాన్‌దేవ్ అహూజాపై ఆల్వార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ దొంగతనం ఆరోపణలపై శుక్రవారం మేవాట్‌కు చెందిన ముస్లింలు చిరంజీలాల్ సైనీ అనే వ్యక్తిని కొట్టి చంపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన సందర్భంలో అహూజా 'లావాండి ప్రాంతంలో మా వాళ్ల మూకదాడిలో ఐదుగురు హతమయ్యారు. ఇలాంటిది జరగడం మాత్రం ఇదే మొదటిసారి. ఆవుల దొంగలపై మూకదాడులకు పాల్పడిన మా వాళ్లకు బెయిల్ ఇప్పించి బయటకు తీసుకువచ్చే పూచీ నాది'అని అంటున్నట్లుగా ఉన్న ఓ వీడియో వైరల్ అవుతోంది.

అమెరికా నుంచి అత్యాధునిక డ్రోన్లు

- ఎంక్యూ–9 బీ ప్రిడేటర్ల కోసం చర్చలు
- రక్షణ శాఖ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికా నుంచి అత్యాధునిక ఎంక్యూ–9బీ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు సంబంధించిన సంప్రదింపులు పురోగతిలో ఉన్నాయని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. మొత్తం రూ.300 కోట్ల విలువైన 30 ఎంక్యూ–9బీ డ్రోన్లు అందితే వీటిని చైనా సరిహద్దులతోపాటు హిందూమహా సముద్రం ప్రాంతంపై నిఘాకు వినియోగించనున్నట్లు వెల్లడించాయి. ఎంక్యూ–9 రీపర్ డ్రోన్ ఆధునిక వెర్షనే ఎంక్యూ–9బీ. గత నెలలో అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని ఓ ఇంట్లో ఉన్న అల్‌ఖైదా నేత అల్ జవహరిని హతమార్చేందుకు వాడింది ఎంక్యూ–9 రీపర్ డ్రోన్‌నే కావడం గమనార్హం. జనరల్ ఆటమిక్స్ అభివృద్ధి చేసిన ఎంక్యూ–9 బీ ప్రిడేటర్ల కోసం రెండు ప్రభుత్వాల మధ్య చర్చలు తుది దశకు వచ్చాయన్న వార్తలను రక్షణ శాఖ వర్గాలు తోసిపుచ్చాయి. ప్రస్తుతం చర్చలు పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశాయి. వీటి ఖరీదు,, ఆయుధాల ప్యాకేజీ, సాంకేతికత భాగస్వామ్యానికి సంబంధించిన కొన్ని అంశాలపై చర్చలు నడుస్తున్నాయని తెలిపాయి. ఇదే విషయాన్ని జనరల్ ఆటమిక్స్ గ్లోబల్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ వివేక్ లాల్ కూడా ధ్రువీకరించారు. చర్చల వివరాలను రెండు దేశాల ప్రభుత్వాలే వెల్లడిస్తాయన్నారు. ఎంక్యూ–9బీ గార్డియన్ రకం రెండు డ్రోన్లను 2020 నుంచి భారత్ తమ నుంచి లీజుకు తీసుకుని భూ సరిహద్దులు, హిందూ మహాసముద్రంపై నిఘాకు వినియోగిస్తోందన్నారు. ఈ హంటర్–కిల్లర్ డ్రోన్లు 450 కిలోల బరువైన బాంబులతోపాటు నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులను మోసుకెళ్లగలవు.

సాక్షి శ్రీకాకుళం

సోమవారం ; 22 ; ఆగస్టు ; 2022



పల్లె పాటకు పెద్దపీట

నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం. ఈ కళలకు చాలామంది కాపు కాస్తున్నారు.

- 8లో



సిక్కోలు వేదికగా..

సిక్కోలు వేదికగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో టోర్నీ జరగనుంది.

- 8లో

కరోనా@ 01

ఆదివారం సేకరించిన నమూనాలు	186
ఆదివారం నమోదైన కేసులు	1
మొత్తం పాజిటివ్ కేసులు	1,34,253
ఆదివారం డిశ్చార్జ్‌లు	5
హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారు	31
కోవిడ్ కేర్ సెంటర్‌లో ఉన్నవారు	0
ఆస్పత్రిలో ఉన్నవారు	0

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా సువర్ణ

- సొంత జిల్లాలో తొలి పోస్టింగ్
- నేడు బాధ్యతల స్వీకరణ



పరపటి సువర్ణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో కీలకమైన పరిపాలనాధికారి (ఏఓ)గా గ్రూప్–1 అధికారి పరపటి సువర్ణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె సోమవారం ఉదయం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఏఓ సస్పెండ్ కావడంతో ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. తాజా నియామకాల్లో ప్రాధాన్యత క్రమంలో సువర్ణకు ఈ పోస్టు కేటాయిస్తూ పబ్లిక్ హెల్త్, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ యు.స్వరాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం గ్రామానికి చెందిన పరపటి ధర్మారావు కుమార్తె సువర్ణ సత్తా చాటారు. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి ఈస్ట్‌కోస్టు థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక ఉద్యమంలో పరపటి ధర్మారావు కీలకంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. తాజా నియామకంపై సువర్ణ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా తన తండ్రి ధర్మారావు ప్రోత్సాహంతోనే ఉన్నత చదువులు, మంచి ఉద్యోగం సాధ్యమైందన్నారు.

ప్రశాంతంగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఆదివారం ఏపీ టెట్ సజావుగా ముగిసింది. మొదటి షిఫ్టులో 192 మందికి 182 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టులో 191 మందికి 181 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 8 నుంచి ఈ కేంద్రంలో పరీక్షలు ప్రారంభం కాగా ఆదివారంతో ముగిశాయి. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో 3128 మందికి గాను 2948 మంది హాజరయ్యారు. పరిశీలకునిగా కోలా ముఖలింగం, చీఫ్ సూపరింటెండెంట్‌గా స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు వ్యవహరించారు.

నీలమణిదుర్గ సన్నిధిలో హైకోర్టు విశ్రాంత జడ్జి



అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు విశ్రాంత జడ్జి కాంతారావు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారిని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జడ్జి ఆర్.కాంతారావు ఆదివారం దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. పాతపట్నం బార్ అసోసియేషన్ కార్యదర్శి జి.రాజేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ఎం.రామారావు, జి.రామ్మోహనరావు, కోర్టు సిబ్బంది కలిసి విశ్రాంత జడ్జికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించి శాలువతో సత్కరించారు. ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కలెక్టరేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్కులో బహుజన మహనీయుల విగ్రహాలను ఈ నెల 23న ఆవిష్కరించనున్నామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి తెలిపారు. పార్కులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు శాసనసభాపతి తమ్మినేని సీతారాం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు బుడుమూరు రాజేష్, కర్రి రంగాజీదేవ్, ఎ.త్రినాథరెడ్డి, ఆర్.మంగరాజు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సచి'వాహ్'లయం

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

- అక్టోబర్ 2 నుంచి ప్రారంభం
- ముందుగా 250 సచివాలయాల్లో సేవలు
- డిజిటల్ అసిస్టెంట్, సచివాలయం కార్యదర్శికి జాయింట్ సబ్ రిజిస్ట్రార్–3హోదా



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సచివాలయాలు వేదికగా పౌర సేవలు విస్తృతం చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. అక్టోబర్ రెండో తేదీ నుంచి ఎంపిక చేసిన గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఒకవైపు పారదర్శకంగా పౌరసేవల్ని అందించేందుకు, మరోవైపు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల్లో మరింత పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

సాధారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంటేనే ప్రహసనంగా ఉంటుంది. ఒక్కోసారి వారు అడిగినంత అదనపు మొత్తం ఇస్తే గానీ పని పూర్తవ్వదు. స్టాంపులు మొదలుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు ప్రతిచోటా అదనంగా దండుకుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా మార్చి, క్రయవిక్రయదారుల ఇబ్బందులు తొలగించేందుకు రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను వికేంద్రీకరించే ప్రక్రియలో భాగంగా అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. సచివాలయం స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేసేందుకు డిజిటల్ అసిస్టెంట్, సచివాలయం కార్యదర్శికి జాయింట్ సబ్ రిజిస్ట్రార్–3 హోదా కల్పిస్తోంది.

తొలుత ఆ గ్రామాల్లో...



వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం కింద భూముల రీ సర్వే ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోంది. ఇప్పటికే 193 గ్రా మాల్లో రీ సర్వే పూర్తయింది. శ్రీకాకుళం డివిజన్‌లో 97, టెక్కలి డివిజన్‌లో 56, పలాస డివిజన్‌లో 40గ్రామాల్లో సర్వే పూర్తయింది. అక్టోబర్ 2నాటికి ఈ సంఖ్య 480కు చేరనుంది. ప్రస్తుతం గ్రామాల్లో రీ సర్వే శరవేగంగా చేస్తున్నారు. రీ సర్వే పూర్తయిన భూముల కొనుగోళ్లు, అమ్మకాలు చేసుకుంటే రిజిస్ట్రేషన్ కూడా ఆయా గ్రామ సచివాలయంలోని డిజిట ల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలోనే జరగనుంది. వీటితో పాటు 250 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్న సచివాలయాలు (మండలాల వారీగా)..

ఇచ్ఛాపురం (తేలుకుంచి,కొలిగాం,అరకభద్ర, కోతారి), కంచిలి (కుంబరినౌగాం,కొల్లూరు,మఠంసరియాపల్లి, కొల్లూరు, పురుషోత్తపురం,అంపురం, మండపల్లి,బూరగాం), కవిటి(కొజ్జిరియా,రాజపురం–1, 2,సీహెచ్ కపాసుకుద్ది), మందస(కొత్తపల్లి,నరసింగపురం,జిల్లుండ,సొండిపూడి,బాలిగాం), నందిగాం(కొత్త అగ్రహారం,దేవుపురం,పెద్దతామరాపల్లి,సైలాడ), పలాస(లొద్దభద్ర, రెంటికోట,పెదంచల,అల్లుకోల,తర్లాకోట, లొద్దభద్ర, చినంచల, కేదారిపురం, గురుదాసుపురం, బంటుకొత్తూరు, బ్రాహ్మణతర్ల, అమలకుడియా, టెక్కలిపట్నం), సోంపేట (మాకన్నపురం,పలాసపురం,గొల్లవూరు), వజ్రపుకొత్తూరు (చీపురపల్లి,అక్కుపల్లి, పల్లిసారథి, వజ్రపుకొత్తూరు, నగరంపల్లి, బెండి, పెద్ద బొడ్డపాడు, పాతటెక్కలి, సైనూరు), ఆమదాలవలస (చింతలపేట, శ్రీనివాసాచార్యులపేట, లక్ష్ముడిపేట, గేదెలవానిపేట, కట్యాచార్యులపేట, తొగరాం,ఎస్సీ కాలనీ–2,వంజంగి), బూర్జ (పాలవలస, పెద్దపేట, అల్లెన, తోటవాడ, కొల్లివలస, అన్నంపేట, ఉప్పినవలస), ఎచ్చెర్ల (ఇబ్రహీంబాద్–1, కొత్తపేట, జర్జాం, ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్ పురం, డి.మత్స్యలేశం–2), జి. సిగడాం(పాలఖండ్యాం, ఆనందపురం, పున్నాం, యందువ, దేవరవలస), గార(బూరవల్లి, శాలిహుండం–2, గార, వమరవల్లి–1,కళింగపట్నం,కొర్లాం, వత్సవలస, తూలుగు–1,తూలుగు–2,సతివాడ,కె. సైరిగాం, రామచంద్రాపురం,గొంటి,వాడాడ)

జలుమూరు(నగరికటకాం,మర్రివలస,అక్కురాడ,సైరిగాం,పాగోడు,రాణ,కరవంజ,పాగోడు,టిక్కలిపాడు), లావేరు(కొత్తకుంకాం,గోవిందపురం, తాళ్లవలస,లావేరు–2,గుమడాం,చిన్నమురపాక), నరసన్నపేట(తెలగవలస,చిక్కాలవలస,కంబకాయ,జమ్ము,కరగాం, చోడవరం,కామేశ్వరిపేట,తామరాపల్లి,యారబాడు, కోమర్తి,రావులవలస,మాకివలస,బొరిగివలస), పోలాకి(గుప్పిడిపేట,కుసుంపోలవలస,చెల్లయ్యవలస,ఉర్జాం,గొల్లలవలస,తలసముద్రం), పొందూరు(లైదాం,పెనుబర్తి,దళ్లిపేట, నందివాడ), రణస్థలం(వేలుపురాయి,జేఆర్‌పురం–1,కొండములగాం,బంటుపల్లి,అర్జునవలస,పైడిభీమవరం–1,పిసిని,కోష్ట,రావాడ,

జీరుపాలెం,కోటపాలెం,నారువ), సరుబుజ్జిలి(రొట్టవలస,తెలికిపెంట,మతలబుపేట,విజయరాంపురం, చిన్నకాగితాపల్లి,సరుబుజ్జిలి,పెద్దసవళాపురం,సింధువాడ, కొత్తకోట,పాలవలస,షళంత్రి), శ్రీకాకుళం(పొన్నాం,గేదెలవానిపేట,నైర,అలికాం, ఎస్సీ కాలనీ–1,లంకాం,రాగోలు–1,ఎస్ఎస్ వలస,కరజాడ,భైరి,సింగుపురం–3,తండేంవలస, గూడెం,డీసీసీబీ కాలనీ,పాత్రునివలస,పెద్దపాడు–1,సానివాడ,ఒప్పంగి,అరసవల్లివెలమవీధి,మహాలక్ష్మినగర్, ఇప్పిలి,కళ్లేపల్లి,పీజీ పేట), హిరమండలం(చొర్లంగి,ఎంఎల్ పురం,పింద్రువాడ), కోటబొమ్మాళి(చిన్నసాన,దంత,మాసాహెబ్‌పేట,తర్లిపేట,చీపుర్లపాడు,కొత్తపేట–1, జర్జంగి–1,లఖిందిడ్డి–1, 2,జర్జంగి–2,రేగులపాడు,వాంగ్రాడ,నిమ్మాడ), కొత్తూరు(కుద్దిగాం,దిమిలి,బమ్మిడి,వసపలబ్బ,నివగాం,సోమరాజుపురం,మెట్టూరు–3),

ఎల్ఎన్‌పేట(గొట్టిపల్లి,పెద్దకొల్లివలస,రావిచంద్రి,యంబరాం,బొత్తాడసింగి,పెద్దకోట–1,కరకవలస), మెళియాపుట్టి(మర్రిపాడు–కె,బాణాపురం,సిరియకండి, కేరసింగి,మర్రిపాడు–సి,జోడూరు), పాతపట్నం(ఆర్ఎల్‌పురం,రొంపివలస,ఏఎస్ కవిటి,తిడ్డిమి,చంగుడి,గంగువాడ), సంతబొమ్మాళి(కె నౌపడ–2,చిన్నతుంగాం, లక్కివలస,గోవిందపురం,పాలతలగాం–1), సారవకోట(చిన్నకిట్టాలపాడు,వాంద్రాయి,గొర్రిబంద,భద్రి,గుమ్మపాడు, సారవకోట, రామకృష్ణాపురం,అంగూరు,అవలంగి, చీడిపూడి,బుడితి,చీడిపూడి), టెక్కలి(నరసింగపల్లి,గూడెం, అయోధ్యపురం,గూడెం,బూరగాం,పాత నౌపడ,తలగాం,రావివలస,తొలుసూరుపల్లి,బొప్పాయిపురం, చాకిపల్లి,పెద్దసాన,పోలవరం,తిర్లంగి,టెక్కలి–5,మేఘవరం).

ఏడో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- కొత్తూరులో ఘటన
- అదే ఇంటిలో కొన్నేళ్ల కిందట ఆమె తల్లి ఆత్మహత్య



ఉరివేసుకొని మృతి చెందిన కొరికాన సుస్మిత

కొత్తూరు: పన్నెండేళ్ల వయసు, బతుకు, చావు అనే పదాలకు అర్థం తెలియని ప్రాయం. ఏం కష్టం వచ్చిందో, పసి మనసు ఎంత వేదన అనుభవించిందో గానీ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. కొత్తూరు మండలం గూనభద్ర కాలనీకి చెందిన కొరికాన సుస్మిత(12) ఆదివారం ఇంటిలో ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.గోవిందరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

గూనభద్ర కాలనీకి చెందిన కొరికాన శ్యామసుందరరావు రెండో కుమార్తె సుస్మిత తండ్రి నానమ్మలతో కలిసి ఉంటోంది. బాలిక తండ్రి ఉపాధి కోసం రాజమండ్రి సమీపం నల్లజర్లలో పనిచేస్తున్నారు. ఈమె కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉంది. నానమ్మ గాబు తీయడానికి ఉదయమే పొలానికి వెళ్లిపోయారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపులు కొడితే ఎవరూ తీయలేదు. కిటికీలో నుంచి చూస్తే సుస్మిత దూలానికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. దీంతో వెంటనే ఆమె వీధిలో ఉన్న వారిని పిలిచింది. అందరూ వచ్చి తలుపులు తీసి చూసే సరికే సుస్మిత ఊపిరి వదిలేసింది. దీంతో ఈ విషయాన్ని సరుబుజ్జిలి మండలం తెలిపెంటలో ఉన్న మృతురాలి అమ్మమ్మ నల్లాన తవిటమ్మకు, పాలకొండలో ఉన్న బంధువులకు, తండ్రికి ఫోన్ చేసి చెప్పారు. అమ్మమ్మ తవిటమ్మ మనవరాలి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సుస్మిత మృతి చెందడటంతో రోదిస్తున్న పెద్దమ్మ, అక్క, ఇతర కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహంతో పాటు పరిసరాలు పరిశీలించారు. అమ్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం. గోవిందరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుస్మిత తల్లి జయలక్ష్మి కూడా 2012లో ఇదే ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందారు. అప్పటిలో భర్త శ్యామసుందరరావుతో పాటు పలువురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కేసు కోర్టు విచారణలో ఉంది. తల్లి మృతి చెందడంతో పెద్ద కుమార్తె జస్మితను పాలకొండలో నివాసం ఉంటున్న పెద్దమ్మ నెమలపురి మోహిని వద్ద ఉంచారు. చిన్నకుమార్తె సుస్మిత తండ్రి దగ్గర ఉంటోంది. సుస్మిత తల్లి మృతిపైన, తండ్రిపై రాసుకున్న కొన్ని కవితలను పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

తండ్రి చేతిలో కొడుకు హతం

- తల్లిని చంపబోయిన కుమారుడు
- చివరకు తండ్రి చేతిలో హతమైన వైనం
- తల్లి పరిస్థితి విషమం
- చిచ్చు పెట్టిన మద్యం మత్తు



మృతుడు రాము(ఫైల్)



అపస్మారక స్థితిలో ఉన్న పోలమ్మ

నరసన్నపేట: స్థిరం లేని మనస్తత్వం, నిత్యం మద్యపానం, అదుపు తప్పిన ప్రవర్తన అతడి జీవితాన్ని బలి చేయడమే కాకుండా కుటుంబానికి తీరని నష్టం మిగిల్చాయి. నరసన్నపేట మండలం కిల్లాం గ్రామంలో ఆదివారం జరిగిన హత్య స్థానికంగా సంచలనం సృష్టించింది. తల్లిని చంపడానికి కొడుకు దాడికి పాల్పడగా.. ఆమెను రక్షించే క్రమంలో తండ్రే కుమారుడిని కడతేర్చిన ఘటన కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

కిల్లాంలో గొలివి సూర్యనారాయణ, పోలమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. కుమారుడు గొలివి రాము (33) తనకు ఇష్టమైన ఆర్మీ ఉద్యోగంలో చేరాడు. నాలుగైదేళ్లు బాగానే గడిచాయి. కానీ తర్వాత ఆయన ప్రవర్తనలో విపరీతమైన మార్పులు వచ్చాయి. ఆర్మీలో కూడా అనేక మార్లు తప్పులు చేయడంతో రెండేళ్ల కిందట సర్వీస్ నుంచి



తండ్రి సూర్యనారాయణ

డిస్మిస్ చేశారు. అనంతరం ఇంటికి వచ్చేసిన రాము భార్యతో పాటు కుటుంబ సభ్యులను నిత్యం హింసించేవాడు. దీంతో భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోయారు. అప్పటి నుంచి అతడు మరింత ఉన్మాదిగా మారి తల్లిదండ్రులను చిత్రహింసలు పెట్టేవాడు. ఇరుగు పొరుగు వాళ్లు ఆపినా వారి మీద తిరగబడేవాడు. నిత్యం మద్యం మత్తులో ఉంటూ తల్లిని దూషించేవాడు.

ఈ క్రమంలో ఆదివారం వేకువజామున ఇంటిలోనే తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. అప్పటికే మద్యం మత్తులో ఉండడంతో ఇనుప రాడ్డుతో తల్లిని తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయం కావడంతో పోలమ్మ నట్టింటిలో కుప్పకూలిపోయింది. కళ్ల ముందే భార్య రక్తపు మడుగులో పడి ఉండడాన్ని చూసి తట్టుకోలేకపోయిన సూర్యనారాయణ ఇనుప రాడ్డు తీసుకుని కొడుకు రాము తలపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే నేల కూలి మృతి చెందాడు. వెంటనే స్థానికుల సహాయంతో పోలమ్మను శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పోలమ్మ పరిస్థితి విషమంగా ఉంది. ఘటన జరిగాక కుమార్తెలకు అన్ని విషయాలను వివరించిన సూర్యనారాయణ నేరుగా నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం తన సిబ్బందితో కిల్లాం వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇరుగుపొరుగు వారి నుంచి వివరాలు సేకరించారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతి తెలిపారు. అయితే రాము ప్రవర్తనతో చాలాకాలంగా ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళలు పోలీసులకు చెప్పడం గమనార్హం.

వివాదం ఏంటి..?

పలాసలో భూ ఆక్రమణల తొలగింపు.

ఆక్రమించినది ఎవరు..?

పలాసలోని కొందరు టీడీపీ నాయకులు.

మరి టీడీపీ అగ్రనేతలు పలాస ఎందుకు వెళ్లాలనుకున్నారు..?

ప్రభుత్వ భూములు మింగేసిన పార్టీ నాయకుడిని పరామర్శించేందుకు.

కాశీబుగ్గ నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు ఆదివారం చేసిన హడావుడికి మూలకారణం ఇదే. ఎవరైనా బాధితులను పరామర్శిస్తారు. కానీ తెలుగుదేశం పార్టీ నాయకులు వింతగా భూ ఆక్రమణదారుడి పరామర్శ పేరిట కొత్త, చెత్త రాజకీయానికి తెర తీశారు. ఇలాంటి కార్యక్రమానికి సాక్షాత్తు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ హాజరవ్వాలనుకోవడం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని జిల్లా వాసులంటున్నారు.



కొత్తబ్రిడ్జి వద్ద నారా లోకేష్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

టీడీపీ హైడ్రామా

- పలాసలో గలాటా సృష్టించడానికి టీడీపీ యత్నం
- ఎక్కడికక్కడ నాయకులను అడ్డుకున్న పోలీసులు
- ఆక్రమణలు తొలగిస్తుంటే అడ్డుకోవడంపై జనం ఆశ్చర్యం



నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం రూరల్, కాశీబుగ్గ, నరసన్నపేట, ఎచ్చెర్ల క్యాంపస్: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పబ్లిసిటీ పిచ్చి ఏపాటిదో సిక్కోలుకు అర్థమైంది. సొంత పార్టీ నాయకుడు పలాసలో భూములు మింగేశాడని తెలిసినా, ఆ ఊరిలో పోలీసులు 144 సెక్షన్ పెట్టారని సమాచారం ఉన్నా.. మళ్లీ పరామర్శ పేరుతో పలాస వెళ్లడానికి ప్రయత్నించి లోకేష్ భంగపడ్డారు. నారా లోకేష్ జిల్లా పర్యటన ఉద్రిక్తతలకు దారి తీసింది. టీడీపీ నాయకుడి ఇంటిలో వివాహానికి హాజరు కావాల్సిన లోకేష్ దారి మార్చుకుని పలాస వైపు వెళ్లడానికి ప్రయత్నించడంతో ముందస్తుగానే విషయం తెలుసుకున్న పోలీసులు శ్రీకాకుళంలోనే ఆయనను అడ్డుకున్నారు. కొత్త బ్రిడ్జి వద్ద ఆయన కాన్వాయ్‌ను అడ్డుకుని వెనక్కి వెళ్లిపోవాలని కోరారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పార్టీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శ్రీకాకుళం ఏఎస్పీ కె.శ్రీనివాసరావు లోకేష్‌తో మాట్లాడుతూ తమకు సహకరించాలని కోరారు. అయితే అప్పటికే కార్యకర్తలు శృతిమించి నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అందరినీ జీపులోకి ఎక్కించారు. అనంతరం లోకేష్‌తో పాటు టీడీపీ నాయకులు కళా వెంకటరావు, చినరాజప్ప సైతం రోడ్డుపై బైఠాయించారు. దాదాపు గంట వరకు ఈ హైడ్రామా నడిచింది. దీని వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పోలీసులు బలవంతంగా లోకేష్‌ను అదే కాన్వాయ్‌లో జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తు తీసుకుని అక్కడి నుంచి విశాఖ పంపించారు. పబ్లిక్ న్యూసెన్స్ చేసినందుకు 151 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేల అరెస్టు, విడుదల

నరసన్నపేట, ఎచ్చెర్ల క్యాంపస్: పలాసలో ర్యాలీకి వెళ్లడానికి సిద్ధమైన ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టెక్కలి ఎమ్మెల్యే, టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులను పోలీసులు ముందస్తుగా నరసన్నపేట మండలం మడపాం టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నరసన్నపేట పోలీసు స్టేషన్‌కు తరలించి ఒంటి గంట సమయంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పోలీసు రాజ్యం నడుస్తోందని అన్నారు. అలాగే నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆదివారం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఉంచి అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



కాశీబుగ్గలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు, కార్యకర్తలు



నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

పలాసలో ఉద్రిక్త పరిస్థితి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రి సీదిరి అప్పలరాజుపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ఆదివారం ర్యాలీ చేయడానికి నిర్ణయించుకున్నారు. ఉదయం 9 గంటల సమయంలో టీడీపీ కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు పట్టణంలో 144 సెక్షన్ అమలు చేసిన పోలీసులు ర్యాలీని అడ్డుకున్నా రు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 70 మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాశీబుగ్గ డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ శంకరరావు డివిజన్ పరిధిలో తమ సిబ్బందితో బృందాలుగా విడిచిపోయి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంటికి పరిమితం కాగా గౌతు శిరీష పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేతలే భూ బకాసురులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: ప్రజల దృష్టిని మరల్చి కవ్వింపులకు దిగేందుకు టీడీపీ నాయకులు పాల్పడితే సహించేది లేదని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ టీడీపీ నాయకులను హెచ్చరించారు. టీడీపీ నాయకులే అసలైన భూబకాసురులని, భూఆక్రమణదారులను వెనకేసుకురావడానికి లోకేష్ జిల్లాకు రావడం సబబు కాదని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల కిందటే ప్రజావేదికను కూల్చడం ద్వారా రాష్ట్రంలో అక్రమ కట్టడాలు, భూ ఆక్రమణలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారని పేర్కొన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అధికారుల విధుల్లో తామెవ్వరం జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు పలాసలో బల ప్రదర్శన చేయడాన్ని చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. ప్రతిపక్షంగా కూడా టీడీపీ విఫలమైందని, తప్పుడు ప్రచారాలతో మరింత చులకనైందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ పర్యటనకు కింతలి పాఠశాల హెచ్ఎం


బుడుమూరు గోవిందరావు

పొందూరు/శ్రీకాకుళం న్యూకాలనీ: న్యూఢిల్లీలోని సర్వోదయ ప్రభుత్వ పాఠశాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ జిల్లా నుంచి పొందూరు మండలం కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుడుమూరు గోవిందరావును ఎంపిక చేసింది. ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యా విధానాన్ని పరిశీలించేందుకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, ఫ్యాకల్టీ సభ్యులతో పాటు ప్రతి జిల్లా నుంచి ఒక్కొక్కరు చొప్పున 30 మంది సభ్యులతో కూడిన బృందాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు వీరంతా ఢిల్లీలో పర్యటించనున్నారు. గోవిందరావుకు స్థానం లభించడంతో డీఈఓ జి.పగడాలమ్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రజాకవి శిల్లా రాజులరెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: జాతీయోద్యమ నాయకుడు, సామాజిక సమస్యలపై స్పందించిన ప్రజాకవి శిల్లా రాజుల రెడ్డి అని కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు, అరుణోదయ గాయకుడు సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో ఆదివారం ఉత్తరాంధ్ర – కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'శ్రీకాకుళ దళిత కవి శిల్లా రాజుల రెడ్డి జీవితం – కవిత్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళింగ సీమ సాహిత్య సంస్థ కార్యదర్శి బి.జగన్నాథ రావు పుస్తకాన్ని పరిచయం చేసి ప్రసంగించారు. పోలాకి మండలం పల్లిపేటలో మధ్య తరగతి బహుజన రైతు కుటుంబంలో 1906లో జన్మించిన రాజుల రెడ్డి యుక్త వయస్సులోనే కవిగా ప్రసిద్ధుడయ్యారని, కాంగ్రెస్‌లోని అతివాదులైన నాయకులతో సన్నిహితంగా ఉంటూ, సమరశీల తీవ్రతలు, ప్రత్యేకతలూ ఉండేలా కవితలు రాశారని చెప్పారు. రక్తాశ్రువులు, రణభేరీ, ఓ భారత వీర, వీర హరిజన్, పౌరహితుడు తదితర రచనలు రచించారని తెలిపారు. కార్యక్రమంలో మార్పు మల్లేశ్వర రావు, మిస్క కృష్ణయ్య, డి.గణేష్, బడియా కామరాజు, బెందాళం కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పొన్నాడ రుషి, టి.కామేశ్వరి, పి.సుగుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: విద్యార్థులు క్రీడల్లో మంచి నైపుణ్యం కనబరిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. స్థానిక సురంగి రాజావారి క్రీడామైదానంలో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి బాలబాలికల సబ్ జూనియర్ ఖోఖో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఇచ్ఛాపురం వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 179 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇచ్ఛాపురంలో సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో క్రీడాపోటీల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ఉలాల కోదండరామ్, పిలక ఈశ్వరి, రోటరీ అధ్యక్షుడు మాటూరు నవీన్‌కుమార్, రాంబాబు, తాడి ఆదిరెడ్డి, బత్తిన నాగరాజు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి పి తవిటయ్య, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ కన్వీనర్ కె.హరిబాబు, ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ సాధు శ్రీను, జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభం రెడ్డి, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పద్మవల్లి, దక్కత కృష్ణమూర్తి, తిప్పన రమణరెడ్డి, ఇచ్ఛాపురం వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణయ్య, యాదవ రావు, పీఈటీలు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,530–00
బంగారం(22సి. 10గ్రా.)	48,150–00
వెండి (కిలో)	64,800–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹175	₹ 195

పల్లెపాటకు పెద్దపీట

- కనుమరుగవుతున్న కళలకు జీవం
- గ్రామీణ సంస్కృతిని కాపాడుతున్న జానపద కళాకారులు
- నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం


పండరి భజనా బృంద నృత్యం

ఇచ్ఛాపురం రూరల్: జానపద కళలు ఒకప్పుడు సిక్కోలు సంస్కృతికి నిదర్శనంగా ఉండేవి. కాలక్రమంలో వీటికి ఆదరణ తగ్గిపోయింది. టీవీ, ఇంటర్నెట్ రాకతో పూర్వ వైభవం లేకున్నప్పటికీ వివిధ ప్రాంతాల్లో కొందరు కళాకారులు తమ కళలతో జానపదాలకు జీవం పోస్తున్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక, ఉద్దానం సాహితీ సంస్కృతిక వేదిక, గిడుగు రామ్మూర్తి జానపద కళావేదిక వంటి జానపద సాహిత్య సంస్థలు ఆధ్వర్యంలో బద్రి కూర్మారావు, మల్లెన దేవరాజు, లండ రుద్ర మూర్తి, కుమార్‌నాయక్, కుత్తుమ వినోద్ వంటి జానపద కళాకారులు జానపద కళలను బతికించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. తోలుబొమ్మలాట, నెమలి నృత్యం, పండరి భజన, కోయ నృత్యాలు, తప్పెటగుళ్లు, థింసా నృత్యం, చెక్కభజన, తూర్పు భాగవతం, బోనేల పాట, రాజమ్మ వేషం ,గొల్లాట, కోలాటం వంటి నృత్యాలతో జానపద నృత్యాలకు జీవం పోస్తున్నారు.

గ్రామదేవత ఉత్సవాలలో..

ప్రాచీన జానపద కళలలో పాండురంగ భజన నృత్యం ఒకటి. ప్రస్తుతం పండరి భజన లేనిదే గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించని పరిస్థితి. జనాకర్షణ పొందిన జానపద కళారూపం పాండురంగ బృంద నృత్యానికి ఆద్యులు కవిటి మండలం ఆర్.బెలగాంకు చెందిన దివంగత జీరు పాపయ్యరెడ్డి, కప్ప నరసింహరెడ్డి. ప్రస్తుతం ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన తిప్పన ధనుంజయరెడ్డి ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన బాలబాలికలకు నృత్యాన్ని నేర్పిస్తూ జానపద కళను ప్రోత్సాహిస్తున్నారు. ఉత్తరాంధ్ర యాదవుల కళారూపం తప్పెటగుళ్లు. రామాయాణం, భారతం, బొబ్బిలి యుద్ధం గాథలను చెబుతూ మధ్య మధ్య 'రంధరంధరా మా స్వామి జన్నయ్య' వంటి కీర్తనలు పాడుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంటారు. రేగులపాడు, సారంగపురం, మాకన్నపురం, నారాయణపురం, పురుషోత్తపురం, బెండి, పూర్ణభద్ర, శ్రీకాకుళం వంటి పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో తప్పెట గుళ్ల బృందాలు ఉన్నాయి. ఇవేకాకుండా కోయ నృత్యాలు, థింసా నృత్యం, చెక్కభజన, తూర్పు భాగవతం, బోనేల పాట, రాజమ్మ వేషం, గొల్లాట తదితర కళాకారులు కూడా ప్రదర్శనలు ఇస్తూ కళలను కాపాడుతున్నారు.


తప్పెటగుళ్లు నృత్య ప్రదర్శన

ఐదేళ్ల వయసు నుంచి...



ఐదేళ్ల ప్రాయం నుంచే జానపద కళల్లో ప్రవేశం ఉంది. ఉద్దానం ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన 'పండరి భజన బృంద నృత్యం' అంటే నాకు పంచ ప్రాణాలు. వేలా ఇప్పటికీ చిన్నారులకు నేర్పిస్తునే ఉంటాను.

– తిప్పన ధనుంజయరెడ్డి, జానపద నాట్య బ్రహ్మ అవార్డు గ్రహీత, ఇచ్ఛాపురం మండలం

ఏటా రాష్ట్ర స్థాయిలో వేడుకలు



సంఘాన్ని స్థాపించినప్పటి నుంచి ఏటా సంక్రాంతి వేడుకల్లో భాగంగా 'సిక్కోలు జానపధ సాహిత్య కళావేదిక' ఆధ్వర్యంలో వార్షికోత్సవాలు నిర్వహిస్తుంటాం. కోలాటం, డప్పు వాయిద్యం, తప్పెటగుళ్ల తదితర కళారూపాలను ప్రదర్శింపజేసి పురస్కారాలు అందిస్తుంటాం.

– మల్లెన దేవరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు, సిక్కోలు జానపద కళావేదిక

వందలాది ప్రదర్శలు



పూర్వీకుల నుంచి నేర్చుకున్న విద్య తప్పెటగుళ్ల.రాష్ట్ర, అంతర్రాష్ట్ర స్థాయిలో వందలాది ప్రదర్శనలు ఇచ్చాం. రామాయణం, భారతం, భాగవతం వంటి కథలతో పాటు సమాజానికి ఉపయోగపడే పాటలు పాడుతూ ఇప్పటి తరం యువతకు నేర్పిస్తునే ఉన్నాం.

– కొర్రాయి తాతయ్య, తప్పెటగుళ్ల గురువు, సారంగపురం

సిక్కోలు వేదికగా రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు

- సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు మెగా చాంపియన్‌షిప్
- సబ్-జూనియర్ విభాగంలో బాలబాలికలకు పోరు
- నగరంలోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు
- వివరాలు వెల్లడించిన ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కె.సాగర్


ఏర్పాట్లు వివరిస్తున్న ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కె.సాగర్, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా మరో రాష్ట్రస్థాయి పోటీలకు రంగం సిద్ధమవుతోంది. శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు ఏపీ రాష్ట్ర సబ్-జూనియర్స్ (అండర్-17) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2022 పోటీలు జరగనున్నాయి. 8వ తేదీన క్వాలిఫైయింగ్ రౌండ్స్ నిర్వహిస్తుండగా, 9 నుంచి 11 వరకు మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా నిర్వహించనున్నారు.

13 జిల్లాల నుంచి ప్లేయర్స్ హాజరు..

సిక్కోలు వేదికగా సబ్‌జూనియర్స్ విభాగంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఈ మెగా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు సంఘ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం పలు విభాగాలకు సంబంధించి కమిటీలను నియమించారు. ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 206 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. చీఫ్ రిఫరీ, రిఫరీలు, టెక్నికల్ అఫీషియల్స్ 15 మంది వరకు పాల్గొననున్నారు.

5 కేటగిరీల్లో పోరు..

ఈ మెగా మీట్‌లో మొత్తం 5 కేటగిరిల్లో పోరు కొనసాగనుంది. బాలురు సింగిల్స్, డబుల్స్, బాలికల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. మరో 26 మంది కోచ్, మేనేజర్లు క్రీడాకారుల వెంట హాజరుకానున్నారు. వీరికి స్థానికంగా హోటళ్లలో వసతి కల్పిస్తుండగా, పోటీలు జరిగిన వేదిక వద్దనే భోజన సదుపాయాలను కల్పించనున్నారు. మీట్ నిర్వహణకు సుమారు రూ.6లక్షల వరకు ఖర్చు అవుతుందని నిర్వహణ కమిటీ భావిస్తోంది. అందులో భాగంగా కిమ్స్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ తరపున, జెమ్స్ హాస్పటల్ తరపున జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడెన సోమేశ్వరరావు మీట్ నిర్వహణకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తూ రూ.1.50లక్షలు అందజేస్తున్నారు.

విజయవంతం చేయాలి

శ్రీకాకుళం వేదికగా జరిగే ఏపీ సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2022 పోటీలను విజయవంతం చేయాలని ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పిలుపునిచ్చారు. ఈ మెగా మీట్‌కు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం స్థానంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బైరి దామోదరరావు, కేఎస్ఎం శైలానీ, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, కోశాధికారి ఎంతఈ రత్నాజీ, ఎ.వేణుగోపాలరావు, నక్క రామకృష్ణ, గోర అనిల్, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెలకాపరి మృతి


మల్లేసు మృతదేహం

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మలగాం పంచాయతీ ఉదయపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఇప్పిలి మల్లేసు(74) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పిలి మల్లేసు తన బావ బారికయ్యతో కలిసి పదిరోజులుగా సూరాడవానిపేట సమీపంలో సముద్రతీరంలో సరుగుడు తోటల వద్ద గొర్రెలు మేపుతున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో స్నానం చేసి వస్తానని వెళ్లిన మల్లేషు ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో బారికయ్య ఇంటికి సమాచారం అందించాడు. బంధువులతో కలిసి వెతకగా ఆదివారం ఉదయం సముద్ర తీరంలోని ఎరుపల్లి తాతయ్య తోటలో జీడి చెట్టుకు ఉరివేసుకుని ఉండటం గుర్తించారు. ఈ మేరకు మల్లేసు కుమారుడు గంగయ్య సంతబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారని సంతబొమ్మాళి ఎస్ఐ మదుసూదనరావు తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన యాచకుడు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయం వద్ద భిక్షాటన చేసే 45 ఏళ్ల వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. రూరల్ హెడ్ కానిస్టేబుల్ బి.రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇతను కొంత కాలంగా ధనరాజులమ్మ ఆలయం, పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుండేవాడు. మూడు రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం ఆలయ పరిసర ప్రాంతంలోనే మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆశి దాలయ్యరెడ్డి సమాచారం మేరకు హెచ్‌సీ రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు సంఘటనా స్థలానికి చేరుకొని అంత్యక్రియలు పూర్తి చేశారు.

కోతకు గురవుతున్న వరద గట్టు

కొత్తూరు: ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలో ప్రవాహం పెరిగింది. దీంతో కొత్తూరు మండలం నివగాం గ్రామంలో కుమ్మర వీధి వద్ద నది వరదగట్టు కోతకు గురవుతోంది. నదికి ఆనుకొని గతంలో వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. పెనుగొటివాడ, మదనాపురం , ఆకులతంపరలో రోడ్డు మీదుగా వరద నీరు ప్రవహించింది. దీంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోఆయయి. నదీతీర ప్రాంతాలైన మాతల, పెనుగొటివాడ, అంగూరు, ఆకులతంపర, శోభనాపురం, నివగాం, మదనాపురంతో పాటు పలు గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నివగాం కుమ్మరివీధి వద్ద వరదకు కోతకు గురవుతున్న వరద గట్టు


మదనాపురం రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం


ఆదిత్యుని సన్నిధిలో పూరీ జగన్నాథ్ భార్య లావణ్య, కుటుంబ సభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం 6 నుంచి సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. ఉచిత దర్శనాలతో పాటు ప్రత్యేక, విశిష్ట దర్శనాలకు ఈవో వి.హరిసూర్యప్రకాష్ చర్యలు చేపట్టారు. అనధికారిక వీఐపీల తాకిడితో క్యూలైన్లలో ఉన్న భక్తులు ఒకింత అసహనానికి గురయ్యారు. ఒక్కరోజున దర్శన టికెట్ల ద్వారా రూ.2,12,300, విరాళాల ద్వారా రూ.47,361, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ తెలిపారు. ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ భార్య లావణ్య ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ప్రత్యేక దర్శనం చేయించారు.


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

బీఆర్ఏయూ సమాచారం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ ఇయర్ ఎండ్ స్పెషల్ డ్రైవ్ పరీక్షకు సంబంధించి సోమవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. సెప్టెంబర్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జరిగే ఈ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- స్టేట్ పీజీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 25లోపు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.
- డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్ ఆన్‌లైన్‌లో కొనసాగుతోంది. షెడ్యూల్ మేరకు సోమవారం నుంచి ఈ నెల 26 వరకు విద్యార్థులు కళాశాలలు, గ్రూపుల ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. 30న సీట్లు ప్రకటన, సెప్టెంబర్ 2 నుంచి క్లాస్‌వర్కు ప్రారంభం కానుంది.
- డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 26తో ముగియనున్నాయి.
- వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 2, 4 సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 26 వరకు పరీక్షలు జరగనున్నాయి.

● ఉద్ధృతంగా నాగావళి..


నాగావళి నది ఉగ్రరూపం దాల్చింది. నదిలో ఒక్కసారిగా నీటిప్రవాహం పెరిగింది. శ్రీకాకుళం నగరంలోని పాతబ్రిడ్జి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నాగావళిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని తమ్మినాయుడుపేటలో లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో ఆదివారం అసిరితల్లి సమేత లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసరాజు, ప్రధాన అర్చకులు శ్రీపాదసురేష్ శర్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఎచ్చెర్ల: వర్షాల నేపథ్యంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్నందున ప్రజలు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కిషోర్‌కుమార్ ఆదివారం సూచించారు. ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఇన్‌కంటాక్స్ దరి నానుబాలవీధిలో విజయగణపతి ఆలయం వద్ద నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పందిరిరాట వేశారు. ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధి ఇప్పిలి హరనాధరావు, ప్రధాన అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, పెంట నగేష్‌శర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పిచ్చిమొక్కలు

లావేరు: లావేరు పంచాయతీ కేశవరాయునిపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఏకాగ్రతతో చదవాలి



ఉచిత ట్యూషన్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మం మండలం చింతువలసలో ద ఫాదర్ హౌస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ట్యూషన్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జె.కిరణ్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ట్యూషన్ చెప్పి ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గార వైస్ ఎంపీపీ బరాటం రామశేషు, విశ్రాంత ఎంఈవో చార్లీ ఫ్రాన్సిస్, విశ్రాంత ఎస్‌టీవో పరమానందకుమార్, అడ్వకేట్ రతన్‌పాల్, కృపారావు, సంస్థ ఇన్‌చార్జి సునీత, బాలు, అరుణ్, సతీష్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో సెప్టెంబర్ 4న నిర్వహించనున్న జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. భేతాళ యువజన సంఘం 21వ వార్షికోత్సవం సందర్భంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేరోజు పలాస డివిజనల్ స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఫోన్ 90000 45663, 91107 84445 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పంటల బీమా.. రైతన్న ధీమా!



కేశవరాయునిపురంలో నేలమట్టమైన అరటి(ఫైల్)

- ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

లావేరు:

ఆరుగాలం శ్రమించి సాగు చేస్తే పంటలు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను కుంగదీస్తున్నాయి. ఇలాంటి సమయంలో అన్నదాతలకు ఆసరాగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే సాగు పెట్టుబడుల కోసం రైతు భరోసా పథకం, గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేయడం కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి తాజాగా రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. గత పాలకులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో రైతులే పంటల బీమా కోసం ప్రీమియం కట్టించుకునేవారు. ఫలితంగా రుణాలు తీసుకోవడానికి వీలుకాని రైతులకు పంటలు బీమా కట్టే అవకాశం ఉండేది కాదు. దీంతో వారంతా ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాగా నష్టపోయేవారు. వీరిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. రైతుల తరఫున స్వయంగా బీమా ప్రీమియం చెల్లిస్తూ అండగా నిలుస్తోంది. అయితే ఉచిత పంటల బీమా లబ్ధి పొందాలంటే రైతులు పంటను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

పరిహారం వచ్చింది..



అరటి పంట వేసి ఈ-క్రాప్‌లో నమోదు చేయించాను. వర్షాలు, గాలులు వల్ల పంట నేలమట్టమైంది. విషయాన్ని ఆర్‌బీకే అగ్రికల్చర్ వీఏఏకు తెలియజేయగా అరటి పంటకు బీమా పరిహారం మంజూరైంది.
– పల్లంటి రమణ, రైతు, పిడుగుపాలెం, లావేరు మండలం

బీమా పథకంతో భరోసా..



ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు పోయి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులందరికీ ఈ-క్రాప్ ఆధారంగా ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేయడం ఆనందంగా ఉంది.
– రొక్కం బాలకృష్ణ, లావేరు మండలం

సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత పంటలు బీమా పథకం వర్తించాలంటే ప్రతి రైతు పంటలు వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు పోతే బీమా పథకం ఆసరాగా నిలుస్తుంది.
– డి.విజయబాస్కర్, మండల వ్యవసాయాధికారి, లావేరు

ఆధునిక గృహ నిర్మాణాలకు 'అర్క ప్లై ఉడ్'



షోరూం ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు ప్రజల అధునాతన గృహ నిర్మాణాలకు అర్క ప్లై ఉడ్ అండ్ హార్డ్‌వేర్ షాపు అందుబాటులోకి రావడం శుభపరిణామమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడు రోడ్డులో అర్క ప్లై ఉడ్ అండ్ హార్డ్‌వేర్ షాపును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యాపారంతో పాటు సేవా దృక్పథం కూడా అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో షాపు యజమాని ఊన్న కామేశ్వరరావు, ఎస్.ఈశ్వరరావు, రాజ్‌కుమార్ అగర్వాల్, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ భవనాల ప్రారంభం నేడు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన భవనాలు

గార: మండల కేంద్రం గారలోని సంతతోటలో తహశీల్దార్, మండల ప్రజాపరిషత్ కార్యాలయ నూతన భవనాలను సోమవారం ఉదయం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ గొండు రఘురాం, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 90 లక్షలతో ప్రజాపరిషత్ భవనం, రూ.1.20 కోట్లతో తహశీల్దార్ కార్యాలయం నిర్మించినట్లు పేర్కొన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులంతా పాల్గొనాలని కోరారు.

ఇంటింటికీ కుళాయి నీరు

జి.సిగడాం :

జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని సేతుభీమవరం సర్పంచ్ తొత్తడి రామారావు అన్నారు. ఆదివారం గంగన్నదొరపాలెంలో ఇంటింటికీ కుళాయిల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె.సుజాత, కుదిరెళ్ల గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగన్ తదితరులు పాల్గొన్నారు.



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రామారావు

సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయి



జెడ్పీ సీఈఓ వెంకటరామన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఏదైనా వృత్తిలో పనిచేస్తూ ఉన్నతమైన పదవులు చేపడితే ముందుగా చేసిన సేవలే ఆ వ్యక్తికి గుర్తింపును తీసుకొస్తాయని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్ అన్నారు. శ్రీకాకుళం ఎంపీడీఓగా పనిచేసిన ఆయన పదోన్నతిపై జెడ్పీ సీఈఓగా నియమితులైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది ఆదివారం సీఈఓను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1కు ఎంపికయ్యాక ఎంపీడీఓగా 22 ఏళ్లు వివిధ హోదాల్లో పనిచేశానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ఎంపీడీఓలకు పదోన్నతులు వచ్చాయన్నారు. తనకు సీఈఓగా పదోన్నతి రావడం వెనుక ఓపిక, సహనం ఎంతో సహకరించాయన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులు అజయ్‌బాబు, కోటేశ్వరరావు, తిరుమలరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు అంబటి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ చిట్టి జనార్దనరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు పున్నాంలో ఎమ్మెల్యే పర్యటన

జి.సిగడాం: పున్నాంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రారంభిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వెంకటరమణ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని, పార్టీ కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉద్దానం ప్రాంత అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస: మండలంలోని ఉద్దానం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని, ఇప్పటికే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలంలోని నీలావతి గ్రామంలో ప్రజా గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో దాతల సహకారం, ప్రజల ఇచ్చిన విరాళాలతో సుమారు రూ.20 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ప్రాంతానికి చెందిన యువకులు విద్యాధికులు, ఉపాధ్యాయులు ఈ వేదికను 2002లో ఏర్పాటు చేశారు. ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక అధ్యక్షుడు ఇశాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా, మీ వాడిగా ఈ ప్రాంత అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు, పాఠశాలల్లో నాడు-నేడు కింద మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి నిర్మూలనకు కాశీబుగ్గలో 200 పడకల కిడ్నీ పరిశోధన ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలోగా ఆస్పత్రి నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు శుద్ధ జలాన్ని అందించడానికి రూ.700 కోట్లతో భారీ మంచి నీటి ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, ఇది కూడా త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఉద్దానం ప్రాంతంలో ప్రభుత్వం కూడా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తుందని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా గ్రంథాలయ ప్రహరీ కోసం రూ.5లక్షలు నిధులు ఇస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యుడు తెప్పల ఆనంద్, అనకాపల్లి ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, మడే రమేష్, మట్ట ఖగేశ్వరరావు, నల్ల లక్ష్మణరావు, సర్పంచ్ సాౖర పద్మా వతి, బమ్మిడి సుబ్బారావు, పుక్కళ్ల చిరంజీవి, తెప్పల కృష్ణమూర్తి, మద్దిల మల్లేశ్వరరావు, యు.వి.వి ప్రధాన కార్యదర్శి కోరాడ లింగమూర్తి, కోశాధికారి వై.కామేశ్వరరావు, గ్రంథాలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, పోతనపల్లి గీతమ్మ, బి.ఓంకార్ పాల్గొన్నారు.

'బద్రి'కి సన్మానం



బద్రి కూర్మారావును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావుకు ఆదివారం తిరుపతిలో సన్మానం జరిగింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి రచించిన ద్వాదశ పుస్తకాలు ఆవిష్కరణ సభలో బద్రి కూర్మారావు పాల్గొన్నారు. పితృదేవుడు పుస్తకంలో బద్రి రచన చోటు చేసుకుంది. జానపద కళలు, సాహిత్యానికి కృషి చేసినందుకు బద్రి ఈ సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యయనశాఖ అధ్యక్షుడు ఆచార్య రాజేశ్వరమ్మ, పూర్వ అధ్యక్షుడు ఆచార్య మేడేపల్లి రవికుమార్, ఆధ్యాత్మిక గ్రంథ రచయిత డాక్టర్ సముద్రాల లక్ష్మీనరసయ్య, రెండు రాష్ట్రాలకు చెందిన కవులు, కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత



చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న దృశ్యం

జి.సిగడాం: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత అలవాటు చేయాలని జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఉమామహేశ్వర రావు రెడ్డి, సత్యసాయి ఆనంద నిలయం కన్వీనర్ చిప్పాడ లోకేష్ అన్నారు. ఆదివారం జి.సిగడాంలోని సత్యసాయి విద్యామందిర్‌లో బాలవికాస్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలిది శ్యామ్‌ప్రసాద్, అల్లాడ విశ్వేశ్వరరావు, దున్నా నీలిమ, దున్నా సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణం



రోడ్డు వేసిన దృశ్యం

లావేరు: మురపాకలోని వెంకయ్యచెరువు వద్ద శ్మశాన వాటికలకు ఇన్నాళ్లూ సరైన రోడ్డు సదుపాయం లేదు. మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్య తెలుసుకున్న మురపాక సర్పంచ్ పెయ్యల నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు తేనెల మంగయ్యనాయుడు, పెయ్యల లక్ష్మణరావు ఆదివారం రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదలకు నిత్య వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్, సూర్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరుపేదలకు ప్రతిరోజూ ఉచితంగా వైద్య సేవలు అందించడం శుభపరిణామమని కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ సూర్యం అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో కళింగ భవన్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును డాక్టర్లు దానేటి శ్రీధర్, అన్నెపు శివప్రసాద్, తమ్మినేని వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యం మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ బగాది శ్రీరామ్మూర్తి, పూర్వ అధ్యక్షుడు భట్లు, గౌరవాధ్యక్షుడు బుడుమూరు శ్రీరామ్మూర్తి, గురుగుబెల్లి దామోదర్, పైడి సాంబమూర్తి, వై.వి.ఆర్, పొన్నాడ ప్రభాకర్, దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రణస్థలం:

ప్రతి ఒక్కరూ నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 102 మంది కళ్లను పరీక్షించగా 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, సేవా ఫౌండేషన్ సభ్యులు టేకి బ్రహ్మాజీ, రాయపురెడ్డి శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడు, పసుపురెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



నిద్దాంలో బోరు పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి

జి.సిగడాం:

గ్రామాభివృద్ధికి అందరూ కృషి చేయాలని వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి పిలుపునిచ్చారు. ఆదివారం నిద్దాం గ్రామంలో జరుగుతున్న తాగునీటి బోరు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలఖండ్యాం జంక్షన్ నుంచి జి.సిగడాం రైల్వేస్టేషన్ వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్యేకు అందించామన్నారు. కార్యక్రమంలో జి.సిగడాం సహకార సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, డాక్టర్ మీసాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాతారావు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా స్థాయిలో జరిగే ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రోస్టర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారి తాతారావు కోరారు. జిల్లా బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పేకేటి రామారావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ల ఆన్‌లైన్ హాజరుకు సంబంధించిన సాంకేతిక సమస్యలను సరిచేయాలని విన్నవించారు. జిల్లా అధ్యక్షులు పి.రామారావు, కార్యదర్శి పడాల ప్రతాప్‌కుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్ట శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న సర్పంచ్ నాగరాజు

జి.సిగడాం: ఈ-క్రాప్‌లో భాగంగా పంటల నమోదు తప్పనిసరిగా చేయాలని వాండ్రంగి పంచాయతీ సర్పంచ్ సాకేటి నాగరాజు అన్నారు. ఆదివారం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమక్షంలో ఈ-క్రాప్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరరావు, వీఆర్‌ఓ మొరక రమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ అరసవిల్లి దివ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నల్లి లోకేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ బల్లా సురేష్ పాల్గొన్నారు.

కర్ణాటక సంగీత పితామహుడు పురంధరదాసు



ప్రవచనం చెబుతున్న మందుల మోహనరావు

శ్రీకాకులం అర్బన్:

కర్ణాటక సంగీత పితామహుడిగా, వాగ్గేయ కారుడిగా పురంధరదాసు పేరుపొందారని ఉపనిషన్మందిర ప్రవచనకర్త డాక్టర్ మందుల మోహనరావు అన్నారు. శ్రీకాకుళం ఉపనిషన్మందిరంలో ఆదివారం పురంధరదాసు కీర్తనలు, భావ వివరణపై ప్రవచనం చెప్పారు. పురంధరదాసు పాండురంగడు, వెంకటేశ్వరస్వామిపై కన్నడ భాషలో 4లక్షల 75వేల కీర్తనలు రాశారని, ఇవి బహుళ ప్రాచుర్యం పొందాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సనపల నారాయణమూర్తి, పి.పతంజలిశాస్త్రి, గుమ్మా నగేష్, వి.కామేశ్వరరావు, భట్లు, జి.విశ్వేశ్వరరావు, మందుల నారాయణమూర్తి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గవర్నర్‌తో హరియాణ గవర్నర్ భేటీ



సాక్షి, అమరావతి/మంగళగిరి/గుంటూరు మెడికల్: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం భేటీ అయ్యారు. విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్న బండారు దత్తాత్రేయకు రాజ్‌భవన్ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు గవర్నర్‌లు సమకాలీన రాజకీయ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయను విశ్వభూషణ్ హరిచందన్ సత్కరించారు.

51 అడుగుల శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన దత్తాత్రేయ

గుంటూరు జిల్లా మంగళగిరిలోని గంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం) వద్ద దాతలు మాదల వెంకటేశ్వరరావు, గోపీకృష్ణ, వెంకటకృష్ణ దంపతులు నిర్మించిన 51 అడుగుల పరమ శివుడి విగ్రహాన్ని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం ఆవిష్కరించారు. ఆయన శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని, గంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు రంగరాజు కుటుంబానికి పరామర్శ

గుంటూరు రైలుపేటలోని బీజేపీ నేత జూపూడి రంగరాజు నివాసానికి బండారు దత్తాత్రేయ ఆదివారం వచ్చారు. రంగరాజు తల్లి హైమావతిని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దత్తాత్రేయను జూపూడి కుటుంబ సభ్యులు యజ్ఞదత్తు, వనమా పూర్ణచంద్రరావు, మాజేటి ముత్యాలు, పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మీడియాతో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రోత్సహించాలని సూచించారు.

6 జిల్లాల్లో జగనన్న భూరక్ష సర్వే ఫోర్స్

2,225 ప్రత్యేక బృందాల ఏర్పాటు

- యుద్ధప్రాతిపదికన రీ సర్వేకు ఏర్పాట్లు
- ప్రతి బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్‌ఏ



సాక్షి, అమరావతి: భూముల రీసర్వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం జగనన్న భూరక్ష సర్వే ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఆరు జిల్లాల్లో 2,225 బృందాలను ఏర్పాటు చేసింది. అల్లూరి సీతారామరాజు, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఈ జిల్లాల పరిధిలో భూమి ఎక్కువ ఉంది. సర్వేకు ఎక్కువ మంది సిబ్బంది అవసరం ఉండడంతో ఈ బృందాలను నియమించారు. అవసరం మేరకు ఈ జిల్లాల్లోని కొందరిని డిప్యూటేషన్‌పై పక్క జిల్లాల బృందాల్లో నియమించారు. ప్రతి బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్‌ఏ ఉంటారు. ఈ బృందం ప్రతిరోజూ 20 నుంచి 30 ఎకరాల్లో క్షేత్ర స్థాయి సర్వే చేయాలి.

రోజుకు 50 వేల ఎకరాల సర్వే

ఈ బృందాల ద్వారానే రోజుకు 50 వేల ఎకరాల సర్వేకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటివరకు ఏ జిల్లాల పరిధిలోని ఉద్యోగులతో ఆ జిల్లాల్లోనే సర్వే చేయించారు. సర్వే జరిగే గ్రామంలో 20 నుంచి 30 మంది సర్వేయర్లు, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్‌ఏతో కూడిన బృందాన్ని వినియోగించారు. గ్రామంలో క్షేత్ర స్థాయి సర్వే పూర్తయ్యాక మరో గ్రామానికి ఈ బృందాలను పంపుతున్నారు. పక్క మండలాల్లోని సర్వేయర్లను కూడా వినియోగిస్తున్నారు. ఈ బృందాలు కొన్ని నెలలుగా అవిశ్రాంతంగా రీసర్వేలో నిమగ్నమయ్యాయి. ప్రధానంగా

గ్రామ సర్వేయర్లే కీలకం

గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా 11,118 గ్రామ సర్వేయర్లను వైఎస్ జగన్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. రీసర్వేలో వీరే అత్యంత కీలకంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారు లేకపోతే రీసర్వే పట్టాలెక్కడం కూడా సాధ్యమయ్యే పని కాదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. గ్రామానికి ఒక సర్వేయర్ ఉండాలని ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో వీరిని నియమించింది. ఈ గ్రామ సర్వేయర్లే వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకానికి వెన్నెముకలా నిలబడ్డారు. వారితోనే వేల బృందాలను నియమించి రీసర్వే చేయిస్తున్నారు.

గ్రీన్.. టౌన్





నాగ వెంకటరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ప్రాణ వాయువును ప్రసాదించే పచ్చని చెట్లను మానవాళి పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను కరోనా మహమ్మారి మరోసారి చాటి చెప్పింది. ప్రపంచమంతా విపత్తుతో అల్లాడిన వేళ వన దేవతలే ఊపిరి పోశాయి మరి! కాంక్రీట్ కీకారణ్యంలో తీరిక లేని జీవితం గడిపే పట్టణ వాసులతో పోలిస్తే పచ్చటి చెట్ల నీడన ఉండే పల్లెవాసులే ఆరోగ్యంగా జీవిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా సౌకర్యాల కల్పనతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జగనన్న హరిత నగరాల ద్వారా పట్టణాల్లో మొక్కల పెంపకాన్ని పక్కా ప్రణాళికతో చేపట్టాలని పచ్చదనం, సుందరీకరణ సంస్థ (ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్)కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 45 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో 224 కి.మీ. మేర రోడ్డు డివైడర్ల మధ్య 44,804 మొక్కలు నాటాలని కార్పొరేషన్ నిర్ణయించింది. 2.24 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో పొదల తరహా మొక్కలు, 1,276 కిలోమీటర్ల విస్తీర్ణంలో 2.54 లక్షల చెట్లను అవెన్యూ ప్లాంటేషన్ చేయాలనేది ప్రణాళిక.

పట్టణాలు.. పత్ర హరితం

రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థలు, నగర పంచాయతీలు 123 ఉండగా వీటి విస్తీర్ణం 5,500 చదరపు కిలోమీటర్లు ఉంటుంది. ఒక చదరపు కిలోమీటరుకు 247.1 ఎకరాల చొప్పున మొత్తం వీటి విస్తీర్ణం 13,59,050 ఎకరాలు ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం లక్ష అంతకు మించి జనాభా ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు 33 ఉన్నాయి. ఇవన్నీ హరిత హారాన్ని సంతరించుకోనున్నాయి.

ఇక్కడ చండీగఢ్.. అక్కడ సింగపూర్

ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన చండీగఢ్ జాతీయ స్థాయిలో పచ్చదనంలో మొదటి స్థానంలో ఉంది. అక్కడ ఒక వ్యక్తికి నీడనిచ్చే ప్రాంతం 47–48 చదరపు మీటర్ల వరకు ఉంది. అదే అంతర్జాతీయ స్థాయిలో సింగపూర్ మొదటి స్థానంలో ఉండగా అర్బన్ గ్రీన్ కవర్ 60.2 చదరపు మీటర్లు ఉండటం విశేషం. డ్రోన్‌ల ద్వారా సర్వేతో ఆయాప్రాంతాల్లో పచ్చదనం ఎంతనేది నిర్ధారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ప్రతి పట్టణం పత్ర హరిత నగరం

- ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యమే లక్ష్యం
- జగనన్న హరిత నగరాలతో సాకారం
- లక్షల మొక్కలు నాటేందుకు ఏపీజీ, బీసీ ప్రణాళిక

హరిత శోభిత నగరాలు ఇలా..

నడక, ఆఫీసుకు వెళ్లడం, షాపింగ్, ఇతర పనులపై వెళ్లటాన్ని పరిగణనలోకి తీసుకుంటే మేలుకుని ఉన్న సమయంలో సాధారణంగా మనుషులు 25 నుంచి 30 శాతం సమయం రోడ్లపై గడుపుతారని అంచనా. ఈ నేపథ్యంలో జనాభా ఎక్కువగా ఉన్న నగరాల్లో పచ్చదనం పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళిక అమలు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ఆయా చోట్ల భూమి రకం, సగటు వర్షపాతం, భూగర్భ జలాలు, గాలిలో తేమ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న గ్రీన్ కార్పొరేషన్ 54 రకాల మొక్కలను ఎంపిక చేసింది. వీటి పెంపకం ద్వారా నాలుగేళ్లలో 1.78 కోట్ల చదరపు మీటర్ల మేర నీడ పరుచుకోనుంది. 45 పట్టణాల్లో 2.04 కోట్ల మందికి పైగా ప్రజలకు పచ్చదనం అందనుంది. నగరాల్లో వాయు, శబ్ద కాలుష్య నియంత్రణ, కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించి ఆక్సిజన్ పరిమాణాన్ని పెంచేందుకు మొక్కల పెంపకం దోహదపడుతుంది.

ప్రాణ వాయువు కోసం ప్రాణం విలవిల..

కరోనా మహమ్మారి చెలరేగిన సమయంలో ఆక్సిజన్ కోసం అల్లల్లాడేలా చేసింది. సెకండ్ వేవ్ ప్రారంభ సమయంలో రోజుకు 200 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను సరఫరా చేసిన రాష్ట్ర ప్రభుత్వం అనంతరం తీవ్ర స్థాయికి చేరుకున్న దశలో రోజుకు 700 మెట్రిక్ టన్నుల వరకు అందజేసింది. టన్ను ఆక్సిజన్ కొనుగోలుకు రూ.7,700 వరకు వెచ్చించింది. 132 ఎయిర్ సెపరేషన్ ఆక్సిజన్ ప్లాంట్లను (1,000 ఎల్‌పీఎం) ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాటు చేసింది. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.కోటిన్నర ఖర్చు చేశారు. ఆక్సిజన్ కోసమే రూ.100 కోట్లకు పైగా వ్యయం చేయాల్సి వచ్చిందని డ్రగ్ కంట్రోలింగ్ అథారిటీ విభాగం ఉన్నతాధికారి 'సాక్షి'తో పేర్కొన్నారు. కరోనా అనుభవాల నేపథ్యంలో పట్టణాల్లో పచ్చదనం పెంచాలని గ్రీన్ కార్పొరేషన్‌కు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఆటస్థలాలు, పార్కులు, రోడ్లు, విద్యాలయయాలు, ప్రభుత్వ కార్యాలయయాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మొక్కలు నాటి సంరక్షించేందుకు గ్రీన్ కార్పొరేషన్ కృషి చేస్తోంది. పచ్చదనం పెంచడానికి ప్రతి ఇంటికీ కోరుకున్న మొక్కను సమకూర్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది.

మూడు చోట్ల నర్సరీలు

గ్రీన్ కార్పొరేషన్‌కు సింహాచలం, గన్నవరం సమీపంలోని చినఅవుటుపల్లి, శ్రీకాళహస్తిలో నర్సరీలున్నాయి. వీటిలో ఎంపిక చేసిన 54 రకాల మొక్కలను పెంచి తక్కువ ధరకు ఇంటికే అందించనున్నారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వీడియోలు రూపొందించనున్నారు.

ఊపిరి పీల్చుకుందాం..

ఏదైనా నగరం, పట్టణం విస్తీర్ణంలో పది శాతానికి తక్కువ కాకుండా లంగ్ స్పేస్ ఉండాలని పట్టణ ప్రణాళికా విభాగం మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. పార్కులు, ఆట స్థలాలు, అడవులు, రోడ్లపై చెట్లు నీడనిచ్చే ప్రాంతాన్ని లంగ్ స్పేస్‌గా పరిగణిస్తారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలంటే నిర్దేశిత ఖాళీ స్థలం వదలాలి. తగినంత గాలి, మంచి వాతావరణం ద్వారానే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుంది.

నగరాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తొలుత 45 నగరాల్లో తరువాత దశల వారీగా 123 మున్సిపాలిటీల్లో పట్టణాల్లో ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుంది. నగరాలను జాతీయ స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకెళతాం. – బి.రాజశేఖరరెడ్డి, ఏపీ పచ్చదనం, సుందరీకరణ సంస్థ ఎండీ

పల్లె ప్రజల ఆరోగ్య రహస్యం అదే..



డెబ్బై కిలోలుండే సగటు మనిషికి రోజుకు 320 గ్రాములు (20 వెల్స్ పర్ డే) ప్రాణవాయువు అవసరం. మరో పరిమాణంలో చెప్పాలంటే 450 లీటర్ల ఆక్సిజన్ కావాలి. ఒక పెద్ద చెట్టు పది మందికి, చిన్న చెట్టు అయితే నలుగురికి ఏడాది పాటు ఆక్సిజన్ అందచేస్తుంది. చెట్లు వాతావరణంలో వేడిని తగ్గిస్తాయి. పట్టణ వాతావరణంలో పెరిగే వ్యక్తితో పోలిస్తే సాధారణంగా పల్లెవాసులే ఆరోగ్యంగా ఉంటారనడంలో సందేహం లేదు. – డాక్టర్ ఎం.నాగ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడిసిన్ విభాగం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, విజయవాడ

ఆ ఆలోచనే గొప్పది



పచ్చదనం పెంచాలనే ఆలోచనే గొప్పది. ప్రతి ఒక్కరూ స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతికూల వాతావరణానికి తట్టుకుని చేవ ఎక్కువగా, విరుగుడు స్వభావం తక్కువగా ఉన్న వాటిని పెంచడం అవసరం. వేప, చింత, రావి, పొగడ, కానుగ లాంటి చెట్లకు అధిక కొమ్మలు, రెమ్మలు ఉన్నందున ఆకులు కూడా ఎక్కువే. తద్వారా అవి ఆక్సిజన్‌ను అధికంగా విడుదల చేస్తాయి. 60 నుంచి 100 చదరపు మీటర్ల పరిధిలోని వేపచెట్టు రోజుకు 270 లీటర్ల ఆక్సిజన్ ఇవ్వగలదు. – తుమ్మల శ్రీకుమార్, పర్యావరణవేత్త, ప్రొఫెసర్, లయోల కళాశాల, విజయవాడ

24 నుంచి కుప్పంలో చంద్రబాబు పర్యటన

కుప్పం: టీడీపీ అధినేత చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. కొంగనపల్లి, కొల్లుపల్లి, చెల్దిగానిపల్లి, రామకుప్పం, మోడల్‌కాలనీ, క్రిష్ణదాసనపల్లి, జరుగు, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో చంద్రబాబు పర్యటిస్తారు.

ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్ కుటుంబంతోనే

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి మంగళం: వైఎస్సార్ కుటుంబానికి తాను ఎప్పటికీ విధేయుడినేనని, తన కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు వైఎస్సార్ కుటుంబంతోనే ఉంటానని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. మహాత్మ గాంధీ ఆత్మకథ పునఃముద్రణ పుస్తక ఆవిష్కరణ సభలో తాను యథాతథంగా పలికిన గాంధీ మహాత్ముడి మాటలను కొన్ని పత్రికలు, చానల్స్ వక్రీకరించడం బాధాకరమన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- మహాత్మాగాంధీ ఆత్మకథ పునఃముద్రణ పుస్తకాన్ని శనివారం భారత సర్వోన్నత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా ఆవిష్కరించే సభలో నేను మాట్లాడిన మాటలకు కొంత మంది దురుద్దేశాలు ఆపాదించారు.
- నేను చాలా నిబద్ధత కలిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైనికుడిని. వైఎస్ కుటుంబంతో నాకు 48 ఏళ్ల అనుబంధం. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రమేయం వల్ల నేను తీవ్రవాద రాజకీయాల నుంచి ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి వచ్చా. ఆయన కుటుంబానికి రాజకీయ సేవ చేసుకోవడం కోసమే నేను ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఉన్నాను.
- నా ఊపిరి ఉన్నంత వరకు నా రాజకీయ జీవితం మా నేత జగన్‌తోనే కొనసాగుతుంది. నా నాయకుడి మీద నేను అసహనం చూపిస్తే నాకంటే పాపి మరొకరు ఉండరని తెలుగు ప్రజలకు మనవి చేస్తున్నా.

ఇద్దరు ఏడీల సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్, గతంలో ఇక్కడ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం భీమవరంలో ఏడీగా ఉన్న నారాయణరావును సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చింది. రెండేళ్ల కిందట జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున వీరిని సస్పెండ్ చేశారు.

బీజేపీతోనే ఏపీ అభివృద్ధి సాధ్యం

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్
- రాష్ట్రంలోనూ కమలం పార్టీకి ఒక అవకాశమివ్వాలి
- ఏపీ యువతకు ఉద్యోగాల్లేవు.. ఇది మాఫియా ప్రభుత్వం
- రాబోయే రోజుల్లో సంచలన నిర్ణయాలు : సోము వీర్రాజు



సాక్షి, అమరావతి : 'కుంభకోణాలకు పరిమితం అయ్యే కుటుంబ పార్టీల పాలన వద్దు. ఏపీలోనూ బీజేపీ రావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం. ప్రజలు బీజేపీకి కూడా ఒక అవకాశం ఇవ్వాలి' అని కేంద్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఆదివారం బీజేపీ యువ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గతంలో తెలుగుదేశం, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలన ప్రజలను బాధిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో జవాబుదారీగా ప్రజా రంజక పాలన అందించే బీజేపీ ప్రభుత్వం త్వరలోనే వస్తుందన్నారు. 'వైఎస్ జగన్.. ఎన్నికలకు ముందు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి యువతను నమ్మించి, అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ఉద్యోగాలు ఏవీ? మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లు ఇద్దరూ రాయలసీమ ప్రాంత వాసులే. కానీ ఆ ప్రాంత ప్రజలు ఇంకా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. యువత ఉద్యోగాల కోసం వలస పోతున్నారు' అని మండిపడ్డారు. కేంద్ర మంత్రి ఇంకా ఏమన్నారంటే..

అవినీతిలో రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ


- అవినీతికి సంబంధించి 2018లో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఓ సర్వేలో ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానం, తెలంగాణ రెండో స్థానంలో నిలిచాయి. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు అవినీతిలో మొదటి స్థానం కోసం పోటీ పడుతున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం మాఫియాల ప్రభుత్వం. లిక్కర్ మాఫియా, గంజాయి మాఫియా, ఇసుక మాఫియా, భూ కబ్జా మాఫియా.. వీటిని మాఫ్ కాదు సాఫ్ చేస్తాం. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం భారీ లిక్కర్ కుంభకోణానికి పాల్పడితే కేంద్రం దానిని బయట పెట్టింది. ఏపీ ప్రభుత్వం జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. యువత భవిష్యత్‌తో చెలగాటమాడే గంజాయి మాఫియాను జైలుకు పంపించాలి.
- కేంద్రం ఉత్తరప్రదేశ్ కన్నా ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ ఇళ్లను మంజూరు చేసినా, అవి పేదలకు చేరలేదు. కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ అంటే కాంగ్రెస్ పార్టీకి కాపీ.

అందరూ నివ్వెరపోయే నిర్ణయాలు..

బీజేపీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల్లో తీసుకోబోయే నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తాయని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ఆ నిర్ణయాలు అందరూ నివ్వెరపోయేలా ఉంటాయన్నారు. ఈ సభలో కేంద్ర జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, పార్టీ నేతలు సత్యకుమార్, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు కేంద్ర మంత్రి కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాబూ.. మీకెప్పుడు జ్ఞానోదయం అయింది?

- కులం పేరెత్తితే చెప్పు చూపించాలట!
- తమరు సీఎంగా ఉన్నప్పుడు ఈ మాట చెప్పి ఉండాల్సింది
- ఏ నేతను ఏ కులం వారు తిట్టాలో మీరు ఓ గ్రంథం రాయొచ్చు
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి : కులం పేరెత్తితే చెప్పు చూపించండన్న చంద్రబాబుకు.. ఆ తెలివి ఎప్పుడొచ్చిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. గుంటూరు జిల్లాలో టీడీపీలో ఒక నాయకుడు చేరిన సందర్భంగా శ్రావణ శుక్రవారం రోజు చంద్రబాబు చిలుక పలుకులు పలికారని ఎద్దేవా చేశారు. 'చంద్రబాబు అన్ని కులాలూ తనవే అనుకున్నారట. ఎప్పుడూ కులం గురించి మాట్లాడలేదట. ఆలోచించలేదట. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఆయన ఇంకా చాలా ముందుకు వెళ్లి వైఎస్సార్ సీపీని తిట్టిపోశారు. జనసేన నేతను కాపులతో, తనను కమ్మలతో తిట్టిస్తున్నారంటూ వాపోయారు. ఏ పార్టీ నేతపై ఏ కులానికి చెందిన నాయకుడితో విమర్శలు చేయించాలో చంద్రబాబు ఒక గ్రంథం రాస్తే బావుంటుంది' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఇంకా ఏం చెప్పారంటే..

బాబుకు పూనకం వస్తే ఏమైనా మాట్లాడతారు

- 'తాను సీఎంగా ఉండగా ఎంతో శ్రమించి హైదరాబాద్ నగరానికి కంపెనీల మీద కంపెనీలను రప్పిస్తే ఒక్క కులం వారికే మేలు జరిగిందా?' అని చంద్రబాబు అమాయకంగా ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ రాజధానికి కుప్పలు తెప్పలుగా వచ్చిన పెట్టుబడుల వల్ల ఏ ఏ కులాలకు చెందిన సంపన్నులు, పేదలు లబ్ధి పొందారో ఆర్థిక వేత్తలను అడిగితే సరైన సమాచారం వస్తుంది.
- ఆర్థికాభివృద్ధికి సంబంధించి ఏ పరిణామం సంభవించినా సమాజంలోని అన్ని సామాజిక వర్గాలూ ప్రయోజనం పొందితేనే సమ్మిళిత ప్రగతి అవుతుందని అందరికీ తెలుసు. కుల భేదాలు పోవాలంటే ఏం చేయాలో అన్ని రాజకీయ పక్షాలు కలిసి ఆలోచించాలే గానీ.. చంద్రబాబు మాదిరిగా ఆవేశపడి రంకెలేస్తే ప్రయోజనం ఉండదు.
- 'మిమ్మల్ని ఎవరైనా కులం అడిగితే, చెప్పు చూపించండి' అని పిలుపు ఇచ్చిన చంద్రబాబు.. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఇదే పని చేసి ఉంటే బావుండేది. కుల నిర్మూలనకు మహానుభావుడు బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చూపించిన దారి వదిలేసి.. చంద్రబాబు చెప్పిన ' చెప్పు చూపించే' పనిలో పడితే రాష్ట్రం ఎటు పయనిస్తుందో ఊహించడం కష్టం కాదు.
- ఎంతైనా తనకు ఇష్టమైన ఊరుగా ప్రచారం చేసుకున్న అమరావతికి వచ్చినప్పుడల్లా చంద్రబాబుకు పూనకం వస్తుంది. ఆ పూనకంలో ఆయన ఏమైనా మాట్లాడతారు. వినేవాళ్లుంటే వింత వింత పరిష్కార మార్గాలు చూపిస్తారు.

యువతకు లక్షల ఉద్యోగాలు

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇన్ని జాబ్స్ ఇచ్చారా?
- మంత్రి అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో నిరుద్యోగం ఎక్కువగా ఉందన్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విమర్శల్లో వాస్తవం లేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే నాలుగున్నర లక్షల మంది యువతకు ఉద్యోగాలిచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విశాఖలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ స్థాయిలో ఉద్యోగాలిచ్చారా? అని ప్రశ్నించారు. ప్రజా రంజకంగా పరిపాలిస్తున్న సీఎంపై కేంద్ర మంత్రి విమర్శలు హాస్యాస్పదమన్నారు. జగన్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్న విషయాన్ని కేంద్ర మంత్రి తెలుసుకోకుండా సుజనాచౌదరి టీడీపీ కార్యాలయం నుంచి తెచ్చిన స్క్రిప్ట్‌ను చదవడం బాధాకరమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించేందుకు కేంద్రం సిద్ధపడుతోందని, అందులో మీ కమీషన్ ఎంతో చెప్పాలన్నారు. ప్రత్యేక హోదాను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పోలవరానికి రూ.2,900 కోట్లను ఇప్పటికీ చెల్లించలేదన్నారు. పవన్‌కల్యాణ్ పార్టీ కమ్మ జనసేన కాదని ఎలా అనగలమని ప్రశ్నించారు. సీఎం జగన్ దంపతులు ఎంతో గౌరవంగా చిరంజీవిని సాగనంపారన్న విషయాన్ని పవన్ తెలుసుకోవాలని సూచించారు. పెళ్లిళ్లు, పేరంటాలకు వచ్చి లోకేశ్ రాజకీయాలు చేయడం అవసరమా? అంటూ మంత్రి అమరనాథ్ ధ్వజమెత్తారు.

సంక్షేమాభివృద్ధి పథకాలపై చర్చకు సిద్ధమా?

- కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌కు మంత్రి జోగి రమేష్ సవాల్
- ఏపీ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా?
- తనను నమ్మిన కాపులను చంద్రబాబుకు అమ్మేసేందుకే పవన్ వీకెండ్ నాటకాలు



సాక్షి, అమరావతి: 'దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలు.. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై చర్చకు సిద్ధమా?' అని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాలు, ప్రసార సమాచార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సవాల్ విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. మూడేళ్లలో రెండు లక్షల మందికి రెగ్యులర్ ఉద్యోగాలు, 2.60 లక్షల మందికి వలంటీర్లుగా అవకాశం, 90 వేల మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలిచ్చి.. సీఎం జగన్ యువతకు బాసటగా నిలిచారని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ తరహాలో ఉద్యోగాలిచ్చారా? అని నిలదీశారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

మోసం చేసిన మీరు నీతులు చెబుతారా?

- టీడీపీ కార్యాలయం నుంచి సుజనా చౌదరి తెచ్చిన స్క్రిప్టును కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ చదువుతూ.. సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేశారు. స్వతంత్ర భారతదేశ 75 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో కేవలం మూడేళ్లలోనే రూ.1.65 లక్షల కోట్లను డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ జమ చేశారు.
- సంక్షేమ, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగానే కాకుండా తమ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నారు. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసింది.
- రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది? రెవెన్యూ లోటు భర్తీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటులోనూ కేంద్రం మోసం చేసింది. రాష్ట్ర ప్రజలను వంచించిన బీజేపీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు.

కాల్షీట్లు అమ్ముకున్న జన సేనాని

- చంద్రబాబుకు వీకెండ్ కాల్షీట్లు అమ్ముకున్న జనసేన అధ్యక్షుడు బుర్ర తక్కువ పవన్ కల్యాణ్.. రాజంపేట, తిరుపతి ప్రాంతాల్లో పనికిరాని మాటలు మాట్లాడారు. 2014లో జనసేనను చంద్రబాబుకు తాకట్టు పెట్టింది కాక.. ఇప్పుడు తనను నమ్మిన కొంత మంది కాపు సామాజిక వర్గం వారిని మళ్లీ చంద్రబాబుకు అమ్మేయడానికే వీకెండ్ నాటకాలాడుతున్నారు. వ్యవసాయం, కౌలు రైతుల గురించిన కనీస అవగాహన లేని పవన్.. సేద్యం గురించి మాట్లాడటం విడ్డూరం. 175 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పే దమ్ముందా?
- సీఎం జగన్ రైతులను రారాజులుగా చేస్తున్నారు. జన రంజక పాలన అందిస్తున్నందుకు 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించే దిశగా అడుగులేస్తున్నాం. 2019 ఎన్నికల్లో చంద్రబాబును చెప్పుతో కొట్టి 23 సీట్లకు పరిమితం చేసిన ప్రజలు.. 2024 ఎన్నికల్లో రెండు చెప్పులతో కొట్టి రాజకీయ సన్యాసం తీసుకునేలా చేయడం ఖాయం.

చేతకాకే కాపాడుకోలేకపోయాం

- 'చిరు' ప్రజారాజ్యంపై పవన్ వ్యాఖ్యలు
- సీమ ప్రజల్లో చైతన్యం పెరగాలి
- మోదీపైనే అభిమానం...టీడీపీపై కాదు




తిరుపతి రూరల్: దేశంలో, రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయం ఉండాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీకి కొమ్ము కాయటానికి తాము సిద్ధంగా లేమన్నారు. రెండిటికీ సమదూరం పాటిస్తామన్నారు. నాడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీని చేతకానితనం, కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన కోవర్టుల వల్లే కాపాడుకోలేకపోయామని వ్యాఖ్యానించారు. తన అన్న పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినా, తాను మాత్రం అటువైపు వెళ్లలేదన్నారు. ప్రధాని మోదీ మీద అభిమానంతోనే 2014లో టీడీపీకి మద్దతు తెలిపామని, అంతేకానీ ఆ పార్టీపై ప్రేమతో కాదన్నారు. గౌరవం ఇవ్వని పార్టీలకు ఎప్పుడూ దూరంగా ఉంటామన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరని, శత్రువులతో కలిసిపోవటమే రాజకీయం అన్నారు. తాను దత్తపుత్రుడు అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రా థామస్ అని వ్యాఖ్యానించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన 'జనవాణి–జనసేన భరోసా' కార్యక్రమంలో 415 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ కోస్తాంధ్రలో దళితులకు సమస్య వస్తే సంఘటితంగా పోరాడతారని, సీమలో ఆ పరిస్థితుల్లేవన్నారు. ఒకటి రెండు కులాల చేతుల్లోనే అధికారం వల్ల అసమానతలు పెరుగుతున్నాయన్నారు.

మునుగోడులో జనసేనకు వందో, వెయ్యో ఓట్లు

తెలంగాణలోని మునుగోడు ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టాలని అడుగుతున్నారని, అక్కడ పోటీచేస్తే జనసేనకు వందో, వెయ్యో, రెండువేలో ఓట్లు రావొచ్చు.. దానివల్ల సాధించేదేమీ లేదు.. అని పవన్ వ్యాఖ్యానించారు.

సన్నిధి



ధమ్మ పథం

మైత్రీ ధనం

శ్రావస్తి నగరంలో సునందుడు అనే యువకుడు ఉన్నాడు. బాగా ధనవంతుడు. అందగాడు. తనకు తగిన కన్య కోసం వెతుకుతున్నాడు. అక్కడికి సమీపంలోని ఒక గ్రామంలో మిత్రగంధ అనే యువతి తనకు తగినది అని తెలుసుకున్నాడు. ముందే కబురు పెట్టి పెళ్ళిచూపులకు వెళ్ళాడు. అన్నీ బాగానే కుదిరాయి. ఇరువైపుల తల్లిదండ్రులకు అంగీకారం కుదిరింది. అప్పుడు మిత్రగంధ సునందునితో ''మీకు మంచి స్నేహితులు ఉన్నారా? ఎంతమంది ఉన్నారు?'' అని అడిగింది.

''నాకు మంచి మిత్రులు ఎవరూ లేరు.'' అన్నాడు.

''అయితే నేను మీతో వివాహానికి అంగీకరించలేను. మీరు వెళ్ళవచ్చు. మంచి వారితో స్నేహం చేసి ''నాకోసం సత్యాగానికైనా మరువని నలుగురు మిత్రులు ఉన్నారు అని అనుకున్నాక రండి, అప్పుడు వివాహమాడతాను'' అంది. సునందుడు శ్రావస్తికి తిరిగి వచ్చాడు. ఆ తరువాత కొందరితో స్నేహం చేశాడు. స్నేహం లోని మాధుర్యాన్ని చవిచూశాడు. ఈసారి మిత్రుల్ని తీసుకుని పెళ్ళిచూపులకు వెళ్ళాడు. మిత్రగంధ వివాహానికి అంగీకరించింది. వారి వివాహం జరిగింది.

అందరూ అందం, ఐశ్వర్యం, వంశం చూస్తారు. కానీ మిత్రగంధ ''మైత్రీధనాన్ని చూసింది. ఇదేమి చోద్యం అని అందరూ విచిత్రంగా చెప్పుకోసాగారు.

మిత్రగంధ బుద్ధుని ఉపాసిక. ఈ విషయం బౌద్ధ సంఘంలో కూడ చర్చకు వచ్చింది. చివరికి ఈ విషయం బుద్ధుని దాకా పోయింది.

''ఔను. మైత్రీధనానికి మించినదేదీ ఈ ప్రపంచంలో లేదు.'' అని ఈ కథ చెప్పాడు.

పూర్వం అచిరావతీ నదీతీరంలో ఒక మహారణ్యం ఉండేది. ఆ అరణ్యం మధ్యలో ఇక పెద్ద తటాకం. ఆ తటాకానికి దక్షిణ దిక్కున ఉన్న అతిపెద్ద కడిమి చెట్టుపై ఒక మగ గ్రద్ధ, పడమరనున్న మర్రి చెట్టుపై ఆడగ్రద్ధ నివసిస్తున్నాయి. ఉత్తరదిక్కున ఉన్న గుహలో సింహం, తూర్పు దిక్కునున్న మోదుగచెట్టుపై నీటి గ్రద్ధ (ఉక్కుసం), తటాకం మధ్యలో ఉన్న దిబ్బపై ఒక పెద్ద తాబేలూ నివసిస్తున్నాయి. ఒకరోజున మగగ్రద్ధ ఆడగ్రద్ధతో తనను వివాహామాడమని చెప్పింది. '' నీకు మంచి మిత్రులెవరు?'' అని అడిగింది ఆడగ్రద్ధ. లేరని చెప్పింది మగ గ్రద్ధ. ''ఈ తటాకం చుట్టూ సింహం ఉంది. నీటి గ్రద్ధ ఉంది. తాబేలు ఉంది. ముందు వాటితో స్నేహం నెరవు. ఆ తరువాతే మన పెళ్ళి..'' అని తేల్చి చెప్పింది. మగ గ్రద్ధ అలాగే చేసింది. ఆ తరువాత మిత్రుల సమక్షంలో వాటి వివాహం జరిగింది.

కొన్నాళ్ళకు గ్రద్ధ జంటకు రెండు పిల్లలు పుట్టాయి.

ఒకరోజున కొందరు వేటగాళ్ల అడవికి వచ్చారు. సాయంత్రం వరకూ వారికి ఒక్క వేట కూడా దొరకలేదు. చీకటి పడుతోంది. ఆకలివేస్తోంది. ''కనీసం తటాకంలో చేపలనైనా పట్టి తిందాం'' అనుకుని అక్కడికి వచ్చారు. చేపలూ దొరకలేదు. ఇంతలో వారికి కదంబ వృక్షం పైనుండి గ్రద్ధ పిల్లల అరుపులు వినిపించాయి.

''ఈ పిల్లలు ఎగరలేవు. మనం వీటిని పట్టి కాల్చుకు తిందాం. కొద్దిగా ఆకలి తీరుతుంది. నిద్రపడుతుంది'' అనుకున్నారు. అంతలో ఒకడు చెట్టుకింద మంట చేశాడు. మరొకడు ఎండు ఆకులతో దివిటీ కట్టాడు. దివిటీ వెలిగించి ఆ వెలుగుతో చెట్టు ఎక్కే ప్రయత్నం మొదలుపెట్టాడు.

ప్రమాదాన్ని పసిగట్టిన ఆడగ్రద్ధ ''మన పిల్లలకు ఆపద వచ్చిపడింది. ఈ సమయంలో ఆదుకునేది మీ మిత్రులే. ముందుగా వెళ్ళి ఈ విషయం నీటి డేగకు చెప్పిరా'' అని మగ గ్రద్ధకు చెప్పింది.

''మిత్రమా! ఆపదలో అక్కరకు వచ్చేవాడే నిజమైన మిత్రుడు.. పద'' అంటూ వెంటనే బయలుదేరాడు. క్షణంలో నీటిలో మునిగి పొట్ట నిండా నీరు తాగి కబంద వృక్షం మీదికి ఎగబాకుతున్న వేటగాని చేతిలో ఉన్న దివిటీ మీద నోటిలోంచి నీరంతా చిలకరించాడు. దివిటీ ఆరిపోయింది. చీకటి కమ్మింది. వాడు చెట్టు దిగి వచ్చి దివిటీ వెలిగించుకుని మరలా చెట్టు ఎక్కబోయాడు. నీటి డేగ మరలా నీరు చిలకరించింది.

అలా అర్ధరాత్రి వరకూ జరుగుతూనే ఉంది. ఈ లోపు తటాకం మధ్యలో ఉన్న తాబేలు దగ్గరకు వెళ్ళి ప్రమాదాన్ని గురించి చెప్పింది మగగ్రద్ధ.

''మిత్రుని కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం. పద'' అంటూ కొలను లోపలికి పోయింది. బురద నీరు మింగి, బురదను వళ్ళంతా పులుముకుని వచ్చింది. చెట్టు కింద వేసిన మంటపై బురదను చిందించి పోసింది. మంట ఆరిపోయింది.

''ఈ తాబేలును పట్టి చంపుకు తినాలి'' అంటూ ఆ చీకట్లో తాబేలు వెంటపడ్డారు. వెళ్ళి తటాకంలో పడ్డారు. మెల్లగా లేచి, ఒడ్డుకు వచ్చారు.

''మనం వీటిని వదలకూడదు. తెల్లవార వస్తోంది. మనక వెలుతురు రాగానే గ్రద్ధ పిల్లల్ని, గ్రద్ధల్ని వేటాడాలి. వలవేసి తాబేలునూ పట్టాలి. అని చెట్టు కిందే కూర్చున్నారు.

ఆడగ్రద్ధ సలహాతో మగగ్రద్ధ ఉత్తరం దిక్కున గుహలో ఉన్న సింహం దగ్గరకు వెళ్ళి విషయం చెప్పింది.

'' మిత్రమా! మంచి మిత్రుల్ని కాపాడుకోవడం ఒక మంచి మిత్రుడిగా నా ధర్మం. పద.. పద'' అంటూ ఒక్క ఉదుటున దూకి వచ్చింది. కదంబ వృక్షం దగ్గరకు వచ్చి సింహనాదం చేసింది.

వేటగాళ్ళంతా కాలికి బుద్ధి చెప్పారు.

బుద్ధుడీ కథ చెప్పి ఆపదలో ప్రాణాలకు తెగించి మిత్రుల్ని కాపాడేది మిత్రులే!'' అని మైత్రి గురించి ప్రబోధించాడు.

మైత్రీధనం ఎంత గొప్పదో వారికి అర్థమైంది!

– డా. బొర్రా గోవర్ధన్

ఇస్లాం వెలుగు

ఉదాసీనత వీడాలి



సమాజ సంస్కరణ, సత్సమాజ నిర్మాణం, మానవాళి ఇహపర సాఫల్యం... దీనికోసమే దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి కాలంలో, ఆ తరువాతి ఖులఫాయె రాషిదీన్ ల కాలంలో దైవ విశ్వాసులు ధర్మం కోసం, న్యాయం కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషిచేశారు. సమాజంలో ఎక్కడ ఏ కొద్ది చెడు కనిపించినా దాన్ని అంతం చేసేవరకు ప్రశాంతంగా నిద్రపోయేవారుకాదు. ప్రజల్లో పాప భీతిని, దైవభీతిని నూరిపోస్తూ, దుర్మార్గాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. దీని ఫలితంగా ఆనాడు సమాజంలో ఎల్లెడలా నీతి, న్యాయం, శాంతి, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. ధర్మ పరాయణత, బాధ్యతాభావం, జవాబుదారీతనం, పరస్పర గౌరవాభిమానాలు సర్వత్రా విస్తరించాయి. నిజంగానే అదొక స్వర్ణయుగం, ప్రపంచమంతా కీర్తించిన కాంతియుగం. కాని ఆ యుగం అంతరించింది. ఆ కాంతి, ఆ శాంతి కనుమరుగై పోయాయి. ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా అరాచకమే రాజ్యమేలుతాఉంది. అవినీతి, అక్రమాలు, అన్యాయం, అశ్లీలం, మత్తుపదార్థాల సేవనం, హత్యలు, అత్యాచారాలు సర్వ సామన్యమై పోయాయి. సమాజం అన్ని విధాలా భ్రష్టు పట్టిపోయింది. దీన్ని నిరోధించాల్సిన వారు సైతం చెడుల్లో కూరుకుపోయి ఉన్నారు. కొందరైతే అసలు బాధ్యతను విస్మరించి కోడిగుడ్డుపై ఈకలు పీకే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ దుస్థితి మారాలంటే మనుషుల్లో పరివర్తన రావాలి. రంధ్రాన్వేషణలు మానుకోవాలి. ఉదాసీనత వీడాలి. 'మనకెందుకులే' అన్న వైఖరి మారాలి. చెడులకు వ్యతిరేకంగా గొంతువిప్పాలి. కలసికట్టుగా నడుం బిగించాలి. చెడులు అంతమయ్యే వరకూ అలుపెరుగని పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి. దైవం మనపై మోపిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చడానికి ప్రయత్నించాలి. అప్పుడు మాత్రమే సమాజ సంస్కరణ సాధ్యమవుతుంది. ఇహపర సాఫల్యం సిద్ధిస్తుంది.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



మంచి మాట

మన ఆలోచనలే మన జ్ఞానం

పుట్టుక, మరణాల మధ్య జీవితం చైతన్యవంతంగా కొనసాగుతుంది. ఈ జీవితంలో మనస్సు ద్వారా అనేక అనేక ఆలోచనలతో జీవితానికి సంబంధించి కీలకమైన సమాచారం వస్తుంది. ఈ ఆలోచనలన్నీ మనిషి శారీరక మానసిక కర్మలను బట్టి వస్తుంటాయి. శరీరంలో శక్తి తక్కువగా ఉంటే భౌతికపరమైన ఆలోచనలు, శక్తిస్థాయిలు పెరిగే కొద్దీ మార్పు చెంది ఆధ్యాత్మికత గురించి, ఆత్మను గురించీ ఆలోచనలు వస్తుంటాయి.

మనిషికి తమోగుణంతో శరీరానికి సంబంధించిన ఆలోచనలు వస్తుంటాయి. యవ్వనంలో ఇంద్రియాలు ఉద్రేకం ఎక్కువగా ఉండి రజోగుణంకు సంబంధించిన ఆలోచనలు వస్తుంటాయి.

వయసు మళ్లి వానప్రస్థంలో ప్రవేశించగానే ప్రేమ, దయ, జాలికి సంబంధించిన సత్వగుణ ఆలోచనలు వస్తుంటాయి. జ్ఞానపరంగా ఎదిగిన వారికి అత్యుత్తమమైన ఆలోచనలు వస్తాయి.

మనుషులని తన మనసే నడిపిస్తుంది అసలు ఈ మనసు ఎక్కడ ఉంది, దానిని గుర్తించడం ఎలా అంటే గత జన్మల కర్మల అనుభవాల ప్రతిరూపమే మనసు. దీని యొక్క ప్రభావం సూక్ష్మ శరీరం పై పడుతుంది. మనసులో వచ్చే ఆలోచనలు ప్రతిరూపమే మానవ జీవితం.

మనిషి కుటుంబం, సంఘం, సమాజంలో వివిధ రకాల వ్యక్తుల మధ్య జీవిస్తున్నప్పుడు, కొందరు పాతవారు దూరమవుతారు. వారి ఆలోచనల ప్రభావం కొంత ఉంటుంది. కొందరు కొత్తవారు దగ్గరవుతారు వీరు వీరి ఆలోచనలని జొప్పించడానికి సిద్ధంగా ఉంటారు. వీరి ద్వారా గాయాలు, ఘర్షణలు, సంఘర్షణలు, వ్యతిరేకతలు, అనుకూలతలు, మానసిక ఒత్తిడుల రూపంలో మనసులోకి ప్రవేశిస్తాయి. అప్పుడు ప్రతి వ్యక్తి ఆలోచనలు మాటలు ద్వంద్వంతో కూడి ఉంటాయి. ద్వంద్వం అంటే రెండుగా ఉన్నది. ఒకటి బయటికి వ్యక్తమౌతుంది. మరొకటి లోపల దాగి ఉంటుంది. బయటపడ్డ దాని గురించి ఆలోచిస్తే లోపల దాగి ఉన్న దాన్ని గుర్తించలేము. ఎప్పుడైతే బయట పడ్డ దాని గురించి ఆలోచిస్తామో అప్పుడు పక్షపాతంగా, ఏకపక్షంగా, పరిమితంగా ఆలోచిస్తున్నట్లే.

ఎప్పుడైతే మానవుడు లోపల దాగి ఉన్న దాని గురించి ఆలోచించడం మొదలు పెడతాడో... పరిమితంగా ఆలోచించడం నుండి అపరిమితంగా ఆలోచించడం మొదలవుతుందో అదే అప్పుడే అజ్ఞానం నుంచి బయట పడి జ్ఞానం పొందుతాడు.

అనవసర విషయాలపై అతిగా ఆలోచిస్తే శారీరక శ్రమ చేసిన దాని కంటే రెట్టింపు శక్తిని కోల్పోతున్నాడు. కొందరు ఎలాంటి శారీరక శ్రమ లేని పనులు చేస్తున్న సాయంకాలానికి అలసిపోతారు.

కారులోనో, బస్సులోనో, ప్రయాణం చేస్తున్నప్పుడు ఎలాంటి శారీరక శ్రమలేకున్నా అలసి పోతున్నారు అనవసరంగా అతిగా మనసు ఆలోచించటమే అందుకు కారణం..

మనస్సు ఆలోచించకుండా ఉన్నప్పుడు శూన్య స్థితికి చేరుతుంది.

బాహ్య ప్రపంచంలో ఏది జరిగినా ఎలా జరిగినా అనుకూలతలకు, ప్రతికూలతలకు మనస్సు స్పందించకూడదు. ఇదే ఆధ్యాత్మిక మార్గం.

అజ్ఞాని అంతరంగాన్ని విస్మరించి ప్రాపంచిక విషయాలపై ఆరాటపడుతూ ప్రపంచం నుంచి నాకేంటి అనే భావనను అతిగా పెంచుకొని ప్రపంచాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలనే భావనతో అసంతృప్తి చెంది ప్రాపంచిక విషయాల మోజులో సంబంధాలు ఏర్పరుచుకున్నాడో అప్పుడు పరిమితంగా ఆలోచిస్తాడు.

జ్ఞానికి విశ్వం గురించి దైవం గురించి స్పష్టమైన అవగాహన ఉండాలి, దైవం వైపు మళ్ళి బంధాలను విడనాడి ఏకత్వం వైపు మళ్లాలి. ఏ వ్యక్తి ఏకత్వం వైపు మళ్ళి తన మనసును సరి చేసుకుని సంపూర్ణతను పొందుతూ దైవం వైపుగా ప్రయాణం చేస్తాడో అతను జ్ఞానిగా మరి ముక్తి లేదా మోక్షం పొందే అవకాశం ఉంది.

– భువనగిరి కిషన్ యోగి

గురువాణి

పంచెకట్టు కట్టి పై కండువాతో నడిచొస్తుంటే...



ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క వస్త్రధారణ ఉంటుంది. దాన్ని చూడగానే అది ఫలానా ప్రాంతపు సంప్రదాయం అని ఠక్కున గుర్తుపట్టేస్తాం. అది ఏ ప్రాంతానిదయినా అభినందించవలసిందే. దానిపై అక్కడి వాళ్ళకు మక్కువ ఎక్కువగా ఉంటుంది. అయితే అదే సమయంలో ఇతరుల ఆచార వ్యవహారాలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉంది. తమ ప్రాంతంలోని ఆచార వ్యవహారాలను, అలవాట్లను, కట్టుబొట్టూను... వీటిని జ్ఞాపకం ఉంచుకోవడం, గౌరవించడం, అనుసరించడం... ఇది మాది ...అని చెప్పుకొని పొంగిపోవడం... ఉండవలసిన లక్షణం.

తెలుగువాడు ఎలా ఉంటాడు...అన్నదానికి... అల్లూరి వేంకట నరసింహరాజు గారనే ఒక కవి ఏమంటున్నాడంటే....'' పంచెకట్టు కట్టి పైమీది కండువా వేసికొనిన తెలుగువేషమగును, అటుల సుందరము, శృతిపేయమైనట్టి భాషయన్న తెలుగు భాషయగును'' అని వర్ణించాడు. పంచెకట్టు తెలుగువాడి వస్త్రధారణ. అది కూడా...కుచ్చిళ్ళు వచ్చేటట్లుగా దాని అంచు నిలువుగా నిలబడేటట్లుగా ఎడం పక్కకు పెట్టుకొని ..ఒక్కోసారి ఇంకా అందంగా కనబడడానికి అర్ధవృత్తాకారంలో కట్టుకొని, వెనక ప్రత్యేకించి కుచ్చిళ్ళతో గోచీపోసి కట్టుకుని ..అటువంటి అలంకరణతో నడుస్తుంటే ఆ వస్త్రధారణ అందమే వేరు... ఇంతకంటే అందమైన మరొక వస్త్రధారణ ఉంటుందా..అనే అనుమానం కూడా కలుగుతుంది.

ఇక పంచెకట్టుతోపాటూ పైన ఉత్తరీయం.. కండువా. కనీసంలో కనీసం ఒక తువ్వాలు... అది లేనిదే తెలుగువాడు ఒకప్పుడు బయట అడుగుపెట్టేవాడు కాదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, సంప్రదాయ కుటుంబాల్లో, శుభాశుభాల్లో ఈ వేషధారణ తప్పనిసరిగా కనిపిస్తున్నది. నవతరం కూడా ఈ సంప్రదాయాలను గౌరవిస్తున్నది.

ఈ రెంటికీ అదనంగా భాష.. తెలుగు ఎంత మధురమైన భాషంటే... దానిని చెవులతో జుర్రుకోవచ్చు.. అనేంత మధురంగా ఉంటుంది. ఈ భాష రానివాడు కూడా దానిని వింటూ మైమరిచిపోతాడు. ఇది ప్రతి తెలుగువారూ తమది అని గొప్పగా చెప్పుకొని పరవశించే సంస్కృతి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వేదం కూడా ప్రత్యేకించి ఈ రకమైన వస్త్రధారణ చాలా గొప్పది.. అంటుంది. స్వాధ్యాయచ... వేదం చదువుకోవాలన్నా, హోమం చేయాలన్నా, దానం చేయాలన్నా, భోజనం చేయాలన్నా, ఆచమనం చేయాలన్నా...ఈ అయిదింటికీ పంచెకట్టే కట్టుకోవాలి. ''విగచ్ఛః అనుత్తరీయశ్చ నగ్నస్య అవస్త్రేయచ'' అంటుంది. అంటే వెనుక గోచీ పోసి కట్టుకోకపోతే, ఉత్తరీయం వేసుకొని ఉండకపోతే వాడు నగ్నంగా ఉన్నవాడితో సమానం అంటుంది.

తెరమీద రకరకాల వేషాలతో నవయవ్వనులుగా కనిపించినా.. బహిరంగంగా సభలకు వచ్చేటప్పుడు ఎటువంటి భేషజాలకు పోకుండా నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వర రావు, ఎస్.వి. రంగారావుగార్లలాంటి వారు, అలాగే ప్రభుత్వంలోని అత్యంత ఉన్నతస్థానాల్లో ఉన్న అధికారులు కూడా కొన్నిరకాల సభలకు, సమావేశాలకు పంచెకట్టుతోనే వచ్చేవారు. వారలా కనిపిస్తుంటే పంచెకట్టులో వెలిగిపోతుండేవారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు అందంగా గోచీపోసి అంచులు ఆకర్షణీయంగా కనబడేట్టుకట్టి.. అలా వేదికల మీద, జనం మధ్యన నడిచిపోతుంటే అందరి దృష్టి వారిమీదే. వీళ్ళు పై ఉత్తరీయాన్ని కూడా తలపాగా లాగా ఎంత వేగంగా తలకు చుట్టినా అది అంత అదనపు ఆకర్షణగా నిలిచేది.

అంత గొప్ప కట్టుబొట్టూ ఉన్నచోట పుట్టే అదృష్టం, అంత మధురమైన తెలుగు భాషను నోరారా మాట్లాడుకొనే అవకాశం ఇచ్చిన పరమేశ్వరుడికి కృతజ్ఞత చెప్పుకోకుండా ఎలా ఉండగలం!!! మనదైన సంస్కృతిని కొత్త తరం అందిపుచ్చుకొని మరింత వ్యాప్తిలోకి తీసుకురావాలి.

సువార్త

మంచి కాపరి మనకుండగా...



యెహోవా నా కాపరి. నాకు లేమి కలుగదు (కీర్తన 23:1). ఆది నుండి సర్వశక్తుడైన దేవుడు మానవునితో సంబంధాన్ని, సహవాసాన్ని కలిగియుండాలని ఆశిస్తున్నాడు. దేవుని సహవాసంలో దొరికే ఆనందం, సంతృప్తి లోకంలో మరెక్కడా దొరకవు. దేవునితో వ్యక్తిగత సంబంధం ఉన్నవాడు ప్రపంచానికి దీవెనకరంగా జీవించగలడు. దావీదు దేవునితో తనకున్న వ్యక్తిగత సంబంధపు ఔన్నత్యాన్ని, సహవాసపు మాధుర్యాన్ని తరచుగా తాను రాసిన కీర్తనలలో ప్రస్తావించాడు. దేవుడు నా బలము, నాకు వెలుగు, నాకు రక్షణ, నా శృంగము, శైలం, నా కోట, నా సహాయకుడు అను మాటలు ఆ మహోన్నత అనుభవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి. దేవునితో అనిర్వచనీయమైన సహవాసాన్ని కలిగినవాడు గనుకనే నా హృదయానుసారుడు అని దేవుని చేత పిలువబడ్డాడు.

మనమంతా గొర్రెలవలే మనకిష్టమైన త్రోవల్లో తప్పిపోయి చెదరిపోయినప్పుడు ప్రేమగల క్రీస్తు మనలను వెతుకుతూ వచ్చి తన భుజాలమీద మనలను మోసి సురక్షిత ప్రాంతంలో మనలను స్థిరపరచి నిత్యజీవాన్ని ప్రసాదించాడు. నిజమైన కాపరి లక్షణాలను యేసు ప్రభువు నిర్వచించాడు, ఋజువుచేశాడు. జీవంగల దేవుని పాదాలను హత్తుకోకపోతే నిర్జీవాన్ని కోరుకొన్నట్టే కదా! (కీర్తన 49:14). రక్షణలేనివారు పాతాళంలో ఓ మందగా యాతన అనుభవిస్తారు. క్షయత వారిని కమ్ముకుంటుంది. జీవాధిపతియైన క్రీస్తు కాపరిగా ఉండాలో లేక శాశ్వత మరణం కాపరిగా ఉండాలో తేల్చుకోవాల్సింది మనమే. మనిషి నిర్ణయమే అతని గమ్యాన్ని నిర్దేశిస్తుంది.

దేవుడు మనకు కాపరిగా ఉంటే సమృద్ధి, విశ్రాంతి, ఆత్మీయ నడిపింపు, ధైర్యము, ఆదరణ, పరిశుద్ధాత్మ అభిషేకం, కృపాక్షేమం, నిత్యరాజ్య ప్రాప్తి మనకు లభిస్తాయి. గాఢాంధకార లోయలో ఒకవేళ నడవాల్సి వచ్చినా ప్రభువు మనలను విడువడు. తన రెక్కల చాటున మనలను భద్రపరుస్తాడు. చిరకాలము ఆయనతో నివసించే పరమభాగ్యం మన సొంతమవుతుంది. మహోన్నతుని తృణీకరించడమంటే వీటన్నిటినీ వదులుకున్నట్టే.

యేసుక్రీస్తు మందను విడనాడే కాపరి కాదు. తాను ప్రేమించిన మంద కోసం ప్రాణం పెట్టిన కాపరి. నీ దేవుడు నీకు ఏమిచ్చాడు అని ఎవరైనా ప్రశ్నిస్తే 'నా దేవుడు నా కోసం తన ప్రాణాన్నే అర్పించాడు' అని సగర్వంగా గొంతెత్తి చెప్పగలిగే పరమ భాగ్యం మనకు అనుగ్రహించబడింది. క్రీస్తు ప్రభువు మనందరికోసం తన సర్వస్వాన్ని ధారపోసాడు. మన రక్షణార్థం, మన సౌభాగ్యం కోసం దేవుడు సిలువలో తన విలువైన ప్రాణాన్ని త్యాగం చేయడం ద్వారా మనలను కూడా విలువ కలిగినవారుగా మార్చాడు. క్రైస్తవ ప్రపంచానికి సుపరిచితమైన పాట ఉంది. ''మంచి కాపరి మనకుండగా భయమేల ఓ సంఘమా! గొప్ప కాపరి మనకుండగా దిగులేల ఓ సంఘమా! ఆమేన్!

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్



మెద్వెదేవ్‌కు చుక్కెదురు

సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ మెద్వెదేవ్ (రష్యా) పోరాటం ముగిసింది. సెమీఫైనల్లో ఏడో ర్యాంకర్ సిట్సిపాస్ (గ్రీస్) 7–6 (8/6), 3–6, 6–3తో టాప్ సీడ్ మెద్వెదేవ్‌ను ఓడించి తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరాడు. టైటిల్ కోసం ప్రపంచ 152వ ర్యాంకర్ బోర్నా చోరిచ్ (క్రొయేషియా)తో సిట్సిపాస్ ఆడతాడు. రెండో సెమీఫైనల్లో చోరిచ్ 6–3, 6–4తో తొమ్మిదో ర్యాంకర్ కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు.

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ బిగ్‌బాష్ లీగ్‌లో....

ఆస్ట్రేలియా డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ తొమ్మిదేళ్ల తర్వాత స్వదేశంలో జరిగే టి20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్‌లో ఆడనున్నాడు. అతను సిడ్నీ థండర్ జట్టుతో రెండేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ సందర్భంగా బాల్ ట్యాంపరింగ్ వివాదంలో 2018లో తనపై విధించిన జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తి వేయాలని క్రికెట్ ఆస్ట్రేలియాను వార్నర్ కోరాడు. వార్నర్ చివరిసారి 2013లో బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ జట్టు తరఫున ఆడాడు.



స్పోర్ట్స్ రీల్

ప్రజ్ఞానంద పరాజయం



మయామి: ఎఫ్‌టీఎక్స్ క్రిప్టో కప్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా రెండో ఓటమి చవిచూశాడు. పోలాండ్ గ్రాండ్‌మాస్టర్ జాన్ క్రిస్టాఫ్ డూడాతో జరిగిన ఆరో రౌండ్ మ్యాచ్‌లో 17 ఏళ్ల ప్రజ్ఞానంద 2–4తో ఓడిపోయాడు. నిర్ణీత నాలుగు ర్యాపిడ్ గేమ్‌ల తర్వాత ఇద్దరూ 2–2తో సమంగా నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు రెండు బ్లిట్జ్ గేమ్‌లను నిర్వహించగా... రెండింటిలోనూ డూడా గెలుపొందాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఆరో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 13 పాయింట్లతో రెండో స్థానంలో, ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ (నార్వే) 15 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నారు. చివరిదైన ఏడో రౌండ్‌లో కార్ల్‌సన్‌తో ప్రజ్ఞానంద ఆడతాడు.

కాంస్యం కోసం భారత్ పోరు



టెహ్రాన్: ఆసియా అండర్–18 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కాంస్య పతకం కోసం పోరాడనుంది. ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత్ 15–25, 19–25, 18–25తో ఆతిథ్య ఇరాన్ జట్టు చేతిలో ఓడిపోయింది. నేడు కాంస్యం కోసం జరిగే మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. తొలి సెమీఫైనల్లో జపాన్ 37–39, 25–22, 25–21, 25–14తో కొరియాను ఓడించి నేడు ఇరాన్‌తో ఫైనల్ పోరుకు సిద్ధమైంది.

తెలుగు యోధాస్ గెలుపు

పుణే: అల్టిమేట్ ఖో–ఖో లీగ్‌లో భాగంగా రాజస్తాన్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలుగు యోధాస్ 83–45తో నెగ్గింది. ఈ టోర్నీలో తెలుగు యోధాస్‌కిది మూడో విజయం. అటాకర్ సచిన్, డిఫెండింగ్ అరుణ్ తమ ప్రదర్శనతో తెలుగు యోధాస్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం తెలుగు యోధాస్ 9 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

షటిల్ సమరం...

థామస్ కప్‌లో చారిత్రక విజయం... కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాల పంట... ఈ రెండు గొప్ప ప్రదర్శనల తర్వాత భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో ప్రతిష్టాత్మక పోరుకు సిద్ధమయ్యారు. నేటి నుంచి జపాన్ రాజధాని టోక్యోలో మొదలయ్యే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో కలిపి మొత్తం 26 మంది భారత క్రీడాకారులు సత్తా చాటుకునేందుకు సై అంటున్నారు. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో అత్యధికంగా ఐదు పతకాలు గెలిచిన భారతీయ ప్లేయర్‌గా ఘనత వహించిన స్టార్ షట్లర్ పీవీ సింధు గాయం కారణంగా తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడం లేదు. 2011 నుంచి జరిగిన ప్రతి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కనీసం ఒక్క పతకమైనా లభిస్తోంది.



- నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- లక్ష్య సేన్, శ్రీకాంత్‌లపైనే దృష్టి
- డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీపైనా ఆశలు

ఉదయం గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, డీడీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

టోక్యో: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ వేదికపై గత పదిహేనేళ్లుగా నిలకడగా రాణిస్తూ... 'బ్యాడ్మింటన్ పవర్‌హౌస్'గా భావించే చైనా, ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్, కొరియా, జపాన్ దేశాలకు దీటుగా ఎదిగిన భారత క్రీడాకారులు మరో సమరానికి సిద్ధమయ్యారు. తొలిసారి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న జపాన్ గడ్డపై భారత ఆటగాళ్లు పతకాలు సాధించాలని పట్టుదలతో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు మినహా మిగతా అగ్రశ్రేణి క్రీడాకారులు భారత్ తరఫున బరిలో ఉన్నారు. గత ఏడాది స్పెయిన్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ రజతం, లక్ష్య సేన్ కాంస్యం సాధించి సంచలనం సృష్టించగా... కేరళ ప్లేయర్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్ చేరాడు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన సాయిప్రణీత్‌తోపాటు ఈసారి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్‌లపై భారత్ ఆశలు పెట్టుకుంది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో 20వ ర్యాంకర్ సాయిప్రణీత్... 39వ ర్యాంకర్ ఎన్‌హట్ ఎన్గుయెన్ (ఐర్లాండ్)తో 13వ ర్యాంకర్ కిడాంబి శ్రీకాంత్... 19వ ర్యాంకర్ విటింగస్ (డెన్మార్క్)తో 10వ ర్యాంకర్ లక్ష్య సేన్... 94వ ర్యాంకర్ లుకా వ్రాబెర్ (ఆస్ట్రియా)తో 18వ ర్యాంకర్ ప్రణయ్ తలపడనున్నారు. సాయిప్రణీత్ 'డ్రా' పై భాగంలో... శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్ ముగ్గురూ 'డ్రా' కింది భాగంలో ఉన్నారు. దాంతో శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రణయ్‌లలో ఒక్కరు మాత్రమే సెమీఫైనల్ చేరుకోగలరు. ఈ ముగ్గురికీ క్లిష్టమైన 'డ్రా'నే ఎదురైంది. పతకాలు సాధించాలంటే వీరందరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించి లక్ష్య సేన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. చౌ తియెన్ చెన్‌తో ఆడిన నాలుగుసార్లూ సాయిప్రణీత్ ఓడిపోవడం... కొన్నాళ్లుగా ఫామ్‌లో లేకపోవడంతో సాయిప్రణీత్ తొలి రౌండ్ అడ్డంకి దాటడం అనుమానమే. డిఫెండింగ్ చాంపియన్ లోకీన్ యు (సింగపూర్), మాజీ చాంపియన్స్ కెంటో మొమోటా (జపాన్), అక్సెల్‌సన్ (డెన్మార్క్), జిన్‌టింగ్ (ఇండోనేసియా), లీ జి జియా (మలేసియా) టైటిల్ ఫేవరెట్స్‌గా ఉన్నారు.

12 ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్‌కు లభించిన మొత్తం పతకాలు. ఇందులో ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, ఏడు కాంస్యాలు ఉన్నాయి.

సైనా మెరిసేనా...

మహిళల సింగిల్స్‌లో ఈసారి భారత్ నుంచి ఇద్దరే బరిలో ఉన్నారు. గాయం కారణంగా పీవీ సింధు వైదొలగగా... సైనా నెహ్వాల్, మాళవిక బన్సోడ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. నేడు జరిగే తొలి రౌండ్‌లో లినె క్రిస్టోఫెర్సన్ (డెన్మార్క్)తో మాళవిక... మంగళవారం జరిగే తొలి రౌండ్‌లో చెయుంగ్ ఎన్గాన్ యి (వియత్నాం)తో సైనా ఆడతారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 12వసారి ఆడుతున్న సైనా 2015లో రజతం, 2017లో కాంస్యం గెలిచింది. అయితే ఈ ఏడాది సైనా గొప్ప ఫామ్‌లో లేదు. ఈ సీజన్‌లో ఆమె తొమ్మిది టోర్నీలలో ఆడితే ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ అకానె యామగుచి (జపాన్), రెండో సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ), మూడుసార్లు చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్), ఆన్ సె యంగ్ (కొరియా), చెన్ యు ఫె, హి బింగ్ జియావో (చైనా) టైటిల్ ఫేవరెట్స్‌గా కనిపిస్తున్నారు.

ఆ ఇద్దరిపైనే...

పురుషుల డబుల్స్‌లో భారత్‌కు ఇప్పటివరకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం రాలేదు. అంతా సవ్యంగా సాగితే ఈసారి సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం ఆ లోటు తీర్చే అవకాశముంది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన సాత్విక్–చిరాగ్ జోడీకి తొలి రౌండ్‌లో 'బై' లభించింది. ఇక మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు అంతగా పతకావకాశాలు లేవు.

భారత ఆటగాళ్ల వివరాలు

పురుషుల సింగిల్స్: లక్ష్య సేన్, శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్.
మహిళల సింగిల్స్: సైనా నెహ్వాల్, మాళవిక.
పురుషుల డబుల్స్: సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి, సుమీత్ రెడ్డి–మనూ అత్రి, అర్జున్–ధ్రువ్ కపిల, కృష్ణప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్.
మహిళల డబుల్స్: సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప, దండు పూజ–సంజన, పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, అశ్విని భట్–శిఖా.
మిక్స్‌డ్ డబుల్స్: ఇషాన్–తనీషా క్రాస్టో, వెంకట్ గౌరవ్ ప్రసాద్–జూహీ దేవాంగన్.

మన పతక విజేతలు..

1983: ప్రకాశ్ పదుకోన్ (పురుషుల సింగిల్స్‌లో కాంస్యం); 2011: గుత్తా జ్వాల–అశ్విని పొన్నప్ప (మహిళల డబుల్స్‌లో కాంస్యం); 2013: సింధు (మహిళల సింగిల్స్‌లో కాంస్యం); 2014: సింధు (మహిళల సింగిల్స్‌లో కాంస్యం); 2015: సైనా (మహిళల సింగిల్స్‌లో రజతం); 2017: సింధు (మహిళల సింగిల్స్‌లో రజతం); 2017: సైనా (మహిళల సింగిల్స్‌లో కాంస్యం); 2018: సింధు (మహిళల సింగిల్స్‌లో రజతం); 2019: సింధు (మహిళల సింగిల్స్‌లో స్వర్ణం); 2019: సాయిప్రణీత్ (పురుషుల సింగిల్స్‌లో కాంస్యం); 2021: శ్రీకాంత్ (పురుషుల సింగిల్స్‌లో రజతం); 2021: లక్ష్య సేన్ (పురుషుల సింగిల్స్‌లో కాంస్యం).



క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

- నేడు జింబాబ్వేతో మూడో వన్డే
- మధ్యాహ్నం గం. 12:45 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

హరారే: ఇప్పటికే 2–0తో సిరీస్ సొంతం చేసుకున్న భారత క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ లక్ష్యంగా నేడు జరిగే చివరిదైన మూడో వన్డేలో జింబాబ్వేతో తలపడనుంది. ప్రధాన బౌలర్ల గైర్హాజరీలో దీపక్ చహర్, సిరాజ్, శార్దుల్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ, అక్షర్ పటేల్ రాణించి జింబాబ్వేను కట్టడి చేశారు. బ్యాటింగ్‌లో శుబ్‌మన్ గిల్, శిఖర్ ధావన్ ఆకట్టుకోగా... తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో రాణించి ఫామ్‌లోకి రావాలని భావిస్తున్నారు. రెండు వన్డేల్లో టాస్ గెలిచి జింబాబ్వేను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన కెప్టెన్ రాహుల్ ఈసారి టాస్ గెలిస్తే భారత బ్యాటర్లకు బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశముంది. ఇప్పటికే సిరీస్ ఫలితం తేలిపోవడంతో ఆఖరి వన్డేలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్‌కు తొలిసారి అవకాశం ఇస్తుందో లేదో చూడాలి. మరోవైపు జింబాబ్వే జట్టు అన్ని విభాగాల్లో నిరాశాజనక ప్రదర్శన కనబరుస్తోంది. సొంతగడ్డపై భారత జట్టుపై 2010లో చివరిసారి వన్డేలో గెలిచిన జింబాబ్వే మళ్లీ గెలుపు రుచి చూడాలంటే అద్భుతమే చేయాల్సి ఉంటుంది.

డబుల్ ట్రీట్

సినిమా



మెగాస్టార్ చిరంజీవి నేడు తన బర్త్‌డే (ఆగస్ట్ 22)ని పురస్కరించుకుని అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'గాడ్ ఫాదర్' టీజర్‌ని విడుదల చేసి, రిలీజ్ డేట్ ప్రకటించగా, 'భోళా శంకర్' విడుదల తేదీని కూడా ఫిక్స్ చేశారు. అలా బర్త్ డే సందర్భంగా చిరంజీవి తన అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చారు.

ఏప్రిల్‌లో భోళా శంకరుడు

చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భోళా శంకర్'. తమన్నా ముఖ్య పాత్రలో, చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. 2023 ఏప్రిల్ 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా 'భోళా శంకర్'లోని చిరంజీవి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ''యాక్షన్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. 40 శాతం షూటింగ్ పూర్తయింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డూడ్లే, లైన్ ప్రొడక్షన్: మెహర్ క్రియేషన్స్.



● గాడ్ ఫాదర్‌లో...

వన్ అండ్ ఓన్లీ గాడ్ ఫాదర్

'ఇరవై ఏళ్లు ఎక్కడికి వెళ్లాడో ఎవరికీ తెలీదు. సడన్‌గా తిరిగొచ్చి ఆరేళ్లలో జనంలో చాలా మంచి పాపులారిటీ సంపాదించుకున్నాడు' అనే డైలాగ్‌తో 'గాడ్ ఫాదర్' టీజర్ రిలీజైంది. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ని తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేసి, అక్టోబర్ 5న సినిమాని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. 'ఇక్కడికి ఎవరొచ్చినా రాకపోయినా నేను పట్టించుకోను.. కానీ అతను మాత్రం రాకూడదు', 'డు యు నో హూ హీ ఈజ్? హీ ఈజ్ ది బాస్ ఆఫ్ ది బాసెస్.. అవర్ వన్ అండ్ ఓన్లీ గాడ్ ఫాదర్' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. టీజర్‌లో చిరంజీవి, సల్మాన్ జీపులో రావడం హైలైట్‌గా నిలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: నీరవ్ షా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాకాడ అప్పారావు.

● భోళా శంకర్‌లో...



సూర్య సరసన?

● దిశా పటానీ

దిశా పటానీకి కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందని చెన్నై టాక్. పైగా అది బంపర్ ఆఫర్‌కి సంబంధించిన కబురు. మరి.. సూర్య సరసన చాన్స్ అంటే మంచి ఆఫరే కదా. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో కథానాయికగా దిశా పటానీని అడిగారట. ముందు పూజా హెగ్డేని కథానాయికగా అనుకున్నారనే వార్త వచ్చింది. అయితే తాజాగా దిశా పేరు వినిపిస్తోంది. కాగా 'లోఫర్' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైన దిశా ఆ తర్వాత హిందీ చిత్రాలకే పరిమితం అయ్యారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న 'ప్రాజెక్ట్ కె'లో నటిస్తున్నారు. ఇప్పుడు సూర్య సినిమా చాన్స్ నిజమైతే తమిళంలో దిశాకి ఇది తొలి చిత్రం అవుతుంది.

ఎమోషన్.. యాక్షన్

పవర్‌ఫుల్ ఇంటర్‌పోల్ ఆఫీసర్ విక్రమ్‌గా నాగార్జున నటించిన చిత్రం 'ది ఘోస్ట్'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించారు. ఇందులో సోనాల్ చౌహాన్, గుల్ పనాగ్, అనిఖా సురేంద్రన్ కీలక పాత్రల్లో నటించారు. కాగా ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, నాగార్జున–సోనాల్‌ల కొత్త పోస్టర్‌ని ఆదివారం విడుదల చేసింది చిత్రబృందం. ''ఇప్పటివరకు విడుదల చేసిన రెండు ప్రోమోలు ది కిల్లింగ్ మెషిన్, తమహగనే ప్రేక్షకులని అబ్బురపరిచాయి. దాంతో ట్రైలర్‌పై అంచనాలు పెరిగాయి. ట్రైలర్‌లో మరింత ఎగ్జయిటింగ్ యాక్షన్‌ని చూపించనున్నాం. ఎమోషన్స్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం అందర్నీ ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు చల్లగుళ్ల.



● నాగార్జున, సోనాల్ చౌహాన్

ఓ సామాన్యుడి ధైర్యం



● రామ్, నరేష్, ప్రసన్నకుమార్

సీహెచ్ నరేష్ హీరోగా రామ్ బొత్స దర్శకత్వంలో 'సామాన్యుడి ధైర్యం' అనే సినిమా షురూ అయింది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రమణ కొఠారు కీలక పాత్రలో నటిస్తూ, నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ క్లాప్ ఇవ్వగా, ప్రముఖ పాత్రికేయులు వినాయకరావు, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. రమణ కొటారి మాట్లాడుతూ– ''రామ్ బొత్స చెప్పిన కథ నచ్చి 'సామాన్యుడి ధైర్యం'తో ఇండస్ట్రీలో అడుగుపెట్టాను'' అన్నారు. ''సామాన్యుడి ధైర్యం ఎలా ఉంటుందో మా సినిమాలో చూపించబోతున్నాం. ఇందులో యాక్షన్, హాస్యం, సామాజిక అంశాలు ఉంటాయి'' అన్నారు రామ్ బొత్స. ఈ చిత్రానికి కెమెరా: భాస్కర్ దోర్నాల, సంగీతం: సాకేత్ వేగి.



● రిషికా, విశ్వ కార్తికేయ, దామోదర ప్రసాద్

తొమ్మిదో గంట ఆరంభం

విశ్వ కార్తికేయ, రిషికా కపూర్ జంటగా ఆనంద్ కొలగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నైన్త్ అవర్'. రాజు గుడిగుంట్ల నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత బెక్కం వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత ఏయం రత్నం టైటిల్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఆనంద్ కొలగాని మాట్లాడుతూ– ''వినూత్నమైన అడ్వెంచర్, యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది. సెప్టెంబర్ 6న మొదటి షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ''ఈ చిత్రకథ వైవిధ్యంగా ఉంటుంది'' అన్నారు రాజు గుడిగుంట్ల. ''హీరోగా అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు విశ్వ కార్తికేయ. ''ఈ సినిమా ద్వారా తెలుగుకి పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు రిషికా కపూర్. నిర్మాతలు అచ్చిరెడ్డి, ప్రసన్న కుమార్, డీయస్ రావు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చెంచు .జె, సంగీతం: శశాంక్ ఆలమూరు, మహా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నాదెండ్ల సురేష్ బాబు, సీఈఓ: ఎ. లక్ష్మీ ప్రియాంక.

బాపట్ల ఎంపీ బయోపిక్ షురూ

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ జీవితం వెండితెరపైకి వస్తోంది. నానాజీ మిరియాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అగస్త్య, నక్షత్ర జంటగా నటిస్తున్నారు. నందిగం వెంకట్ నిర్మాత. తొలి సీన్‌కి ఎంపీ నందిగం సురేష్ క్లాప్ ఇవ్వగా, నందిగం వెంకట్ కుమారులు దేవన్, ప్రిన్స్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నానాజీ మాట్లాడుతూ– ''సామాన్య దళిత కుటుంబంలో పుట్టి, అరిటాకులు కోసుకొని బతికే ఒక సామాన్య వ్యక్తి తన నిజాయితీని నమ్ముకొని బలమైన నాయకుడిగా ఎలా ఎదిగాడు? అనేదే ఈ చిత్రకథ. ఇది ఎవరినీ ఉద్దేశించి తీస్తున్న సినిమా కాదు'' అన్నారు. నందిగం వెంకట్ మాట్లాడుతూ– ''నా తమ్ముడు (నందిగం సురేష్) ప్రయాణమే ఈ చిత్రం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారి సపోర్ట్‌తో ఎంపీ ఎలా అయ్యాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, సంగీతం: అనూప్ రూబెన్స్.



● నందిగం సురేష్, అగస్త్య

మిస్టరీ నేపథ్యంలో...

నివాస్ శిష్ణు, సారా ఆచార్ జంటగా శివ శ్రీ మీగడ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రహస్య'. గౌతమి .ఎస్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. నివాస్ శిష్ణు మాట్లాడుతూ– ''ఈ సినిమాతో హీరోగా పరిచయం కావడం హ్యాపీ. ఇందులో విశ్వతేజ అనే ఎన్‌ఐఏ అధికారిగా నటిస్తున్నాను. థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో డిఫరెంట్ కోణాలను టచ్ చేస్తూ సస్పెన్స్ మిస్టరీని ప్రేక్షకుల ముందు ఉంచబోతున్నాం. చరణ్ అర్జున్ చక్కని సంగీతం ఇచ్చాడు'' అన్నారు. నిర్మాత సాయి వెంకట్, 'మీలో ఒకడు' హీరో కుప్పిలి శ్రీనివాస్, 'ఏయ్ బుజ్జి నీకు నేనే' హీరో సతీష్ మాట్లాడారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేష్ సీహెచ్, సంగీతం: చరణ్ అర్జున్, నేపథ్య సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జి. సెల్వ కుమార్.



● నివాస్

బాయ్‌ఫ్రెండ్ డేట్ ఫిక్స్

విశ్వంత్ దుద్దుంపూడి, మాళవికా సతీషన్ జంటగా సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'. వేణుమాధవ్ పెద్ది, కె. నిరంజన్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 30న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమా పై ఆసక్తి పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది. మధునందన్, సుదర్శన్, హర్షవర్ధన్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: బాల సరస్వతి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశ్రిన్ రెడ్డి.



● మాళవిక, విశ్వంత్

ఫ్యామిలీ థ్రిల్లర్



● రామ్ అగ్నివేష్, 'దిల్' రాజు, రుషిక

రామ్ అగ్నివేష్, రేఖ నిరోషా జంటగా వీవీ రుషిక దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇష్టు'. డాక్టర్ గౌతమ్ నాయుడు సమర్పణలో హనుమంతురావు నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 16న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని 'దిల్' రాజు విడుదల చేశారు. రుషిక మాట్లాడుతూ– ''సిద్ధం మనోహర్ ఇచ్చిన కథ నచ్చి, ఈ చిత్రానికి దర్శకత్వం వహించాను. ఈ ఫ్యామిలీ థ్రిల్లర్‌ని ఐదు భాషల్లో విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''మా చిత్రం గొప్ప విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు హనుమంతురావు నాయుడు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు బసిరెడ్డి, నిర్మాతలు బెక్కం వేణుగోపాల్, దామోదర ప్రసాద్, సినిమాటోగ్రాఫర్ నవీన్ తొడిగి తదితరులు మాట్లాడారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ గుత్తుల, సంగీతం: వికాస్ బాడిస.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	652	59,646
నిఫ్టీ ▽	198	17,758

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,705	▽	260
డోజోన్స్	33,707	▽	292
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,550	△	9
డాక్స్	13,545	▽	153
షాంఘై	3,258	▽	19
నికాయ్	28,930	▽	12

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

రాబడి కోసం కొత్త మార్గం..!

- ఇన్‌వాయిస్‌పై పెట్టుబడులు
- సినిమా ఓటీటీ ఆదాయంపైనా ఇన్వెస్ట్‌మెంట్
- రాబడి ఎక్కువ.. రిస్క్ కూడా ఎక్కువే
- అధ్యయనం తర్వాత ముందుకు వెళ్లొచ్చు



కొందరు ఇన్వెస్టర్లు కొత్త పెట్టుబడి సాధనాల కోసం తరచూ అన్వేషిస్తుంటారు. పెట్టుబడుల్లో ఎక్కువ వైవిధ్యం కోరుకుంటారు. కొందరికి రాబడే ప్రామాణికం. రిస్క్ ఉన్నా ఫర్వాలేదు ఎక్కువ రాబడి కావాలన్నది వారి విధానం. ముఖ్యంగా నేటి తరం యువ ఇన్వెస్టర్లు స్థిరమైన ఆదాయం కోసం డెట్‌కు ప్రత్యామ్నాయ సాధనాల కోసం చూస్తున్నారు. సంప్రదాయ డెట్ సాధనాలతో పోలిస్తే వారికి ఎక్కువ రాబడి కావాలి. ఈక్విటీ మార్కెట్లలో మాదిరిగా అస్థిరతలు ఉండకూడదు. ఎలానూ ఈక్విటీల్లో కొంత ఇన్వెస్ట్ చేస్తారు. కనుక ప్రత్యామ్నాయాలు కోరుకునే వారు పెరిగిపోతున్నారు. ఈ తరహా ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చిన సాధనమే 'ఇన్‌వాయిస్ ఇన్వెస్టింగ్'. ఇది ఎలా పనిచేస్తుంది? రాబడులు ఏ మేరకు ఉంటాయి? తదితర వివరాలను అందించే ప్రాఫిట్ ప్లస్ కథనం ఇది..

ఇన్‌వాయిస్ ఫైనాన్స్ / డిస్కౌంటింగ్ అంటే...



ఇన్‌వాయిస్ ఫైనాన్స్, డిస్కౌంటింగ్‌ను సులభంగా అర్థం చేసుకుందాం. ఒక పేపర్ తయారీ కంపెనీ ఉంది. రూ.లక్ష విలువ చేసే పేపర్‌ను నోట్‌బుక్ తయారీ కంపెనీకి విక్రయించింది. ఒప్పందం ప్రకారం 90 రోజుల తర్వాత రూ.లక్షను నోట్ బుక్ తయారీ కంపెనీ చెల్లిస్తే చాలు. కానీ, అంత కంటే ముందే నిధుల అవసరం పేపర్ కంపెనీకి ఏర్పడింది. దీంతో నోట్‌బుక్ కంపెనీ నుంచి రావాల్సిన రూ.లక్ష ఇన్‌వాయిస్‌ను రూ.90వేలకే ఒక ప్లాట్‌ఫామ్‌లో విక్రయానికి ఉంచింది. దీన్ని ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అంటారు. ఈ డీల్‌లో పేపర్ కంపెనీకి వెంటనే రూ.90వేల క్యాష్ ఫ్లో అందుతుంది. దీన్ని కొనుగోలు చేసిన ఇన్వెస్టర్‌కు 90 రోజులకే రూ.10వేల లాభం వస్తుంది. అలా కాకుండా.. ఇదే పేపర్ తయారీ కంపెనీ నోట్ బుక్ కంపెనీ నుంచి రావాల్సిన రూ.లక్ష ఇన్‌వాయిస్‌ను వెంటనే నగదుగా మార్చుకోవాలని అనుకుంది. డిస్కౌంట్‌కు విక్రయించకుండా, 90 రోజుల కాలానికి 12 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తూ రూ.లక్ష రుణం కోరింది. దీన్ని ఇన్‌వాయిస్ ఫైనాన్సింగ్ అంటారు.

ఎలా పనిచేస్తుంది..?



ఇది స్టార్టప్‌ల కాలం. ఏటేటా వందలాది స్టార్టప్‌లు ఉనికిలోకి వస్తున్నాయి. వీటి విస్తరణకు నిధులు అవసరం ఎంతో ఉంటుంది. అదే సమయంలో అవి నిధుల కోసం ప్రతిసారి ఈక్విటీ జారీ మార్గాన్ని ఎంపిక చేసుకోవడానికి ఇష్టపడవు. ఎందుకంటే ఈక్విటీ విలువ పలుచబడిపోతుంది. దీని వల్ల రాబడులూ పలుచన అవుతాయి. ఇక్కడే రెవెన్యూ బేస్డ్ ఫైనాన్సింగ్ (కంపెనీల ఆదాయాన్ని చూసి రుణాలు ఇవ్వడం) అవసరం ఎదురవుతుంది. ఇది అటు స్టార్టప్‌లకు, ఇటు పెట్టుబడి అందించే వారికీ ప్రయోజనం చేకూరుస్తుంది. కంపెనీలకు తలనొప్పి లేని నిధులు అందుతాయి. జిరాఫ్, బెటర్‌ఇన్వెస్ట్, క్రెడ్‌ఎక్స్ ఇలా పలు సంస్థలు ఇన్వెస్టింగ్ ఫైనాన్సింగ్‌కు సంబంధించి మంచి పెట్టుబడుల అవకాశాలను ఆఫర్ చేస్తుంటాయి. వెంచర్ క్యాపిటల్ (వీసీ), ఏంజెల్ ఇన్వెస్టర్లు ఉన్నారు కదా? అన్న ప్రశ్న ఎదురుకావచ్చు. కానీ, ఇవి ఊరికే పెట్టుబడులు అందించవు. భారీ రాబడులు ఆశిస్తాయి. లేదంటే తాము అందించే పెట్టుబడులకు భారీ వాటా కోరుకుంటుంటాయి. రిస్క్ ఎక్కువగా ఉండే వ్యాపారాలకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి నిధులు లభించడం అసాధ్యం. అందుకనే ఆదాయం చూసి రుణాలు అందించే ఆర్‌బీఎఫ్ మార్కెట్ విస్తరిస్తోంది. ఈ విభాగంలో రిటైల్ ఇన్వెస్టర్లకు 'ఇన్‌వాయిస్ ఫైనాన్స్/ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్' రూపంలో పెట్టుబడుల అవకాశాలు లభిస్తాయి. ఇన్‌వాయిస్‌ల రూపంలో కంపెనీలు తమకు కావాల్సిన నిధులను సమకూర్చుకుంటాయి. ఇన్‌వాయిస్‌లపై కంపెనీలకు నిధులు రావాల్సి ఉన్నప్పుడు.. వాటిని ఇన్వెస్టర్లకు హామీగా ఉంచి/లేదా విక్రయించి కంపెనీలు నిధులు కోరతాయి.

సౌకర్యవంతం...



ఇన్వెస్టర్లు పెరుగుతున్నారు. వారికి భిన్నమైన పెట్టుబడుల అవకాశాలను అందించేందుకు ఎన్నో ఆన్‌లైన్ వేదికలు కూడా ఏర్పాటువుతున్నాయి. అలా వచ్చిందే ఇన్‌వాయిస్ ఇన్వెస్టింగ్. 18 ఏళ్లు నిండి, కేవైసీ పూర్తి చేసిన వారు వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కనీస పెట్టుబడి లక్ష రూపాయిల నుంచి మొదలవుతుంది. కొన్ని ప్లాట్‌ఫామ్‌లు, కొన్ని కేసుల్లో కనీసం రూ.3 లక్షలు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. తమ ప్లాట్‌ఫామ్‌పై నమోదైన ఇన్వెస్టర్లకు ఆయా సంస్థలు పెట్టుబడుల అవకాశాలను తీసుకొస్తుంటాయి. ఇందుకోసం ఇన్వెస్టర్, రుణ గ్రహీత ఇద్దరి నుంచి 'స్ప్రెడ్ (వడ్డీ రేటు మధ్య వ్యత్యాసం) రూపంలో చార్జీలను వసూలు చేస్తాయి. పెట్టుబడుల అవకాశాలను లిస్టింగ్ చేసేందుకు కూడా చార్జీ తీసుకుంటాయి. రుణం కోసం కంపెనీలు ఆఫర్ చేసే ఇన్‌వాయిస్‌లను ఆయా ప్లాట్‌ఫామ్‌లు ముందుగా తనిఖీ చేస్తాయి. అవి నిజమైనవా, కావా అన్నది నిర్ధారించుకుంటాయి. అంతా డీజిటల్‌గా జరిగిపోయే విధానం కావడంతో ఇరువైపుల వారికి సౌకర్యంగా ఉంటుంది. పైగా అందుబాటు ధరలకే నిధులు కంపెనీలకు లభిస్తాయి. ఇన్వెస్టర్లకు కూడా మెరుగైన రాబడులు అందుతాయి. కొత్తవారు, అనుభవం లేని వారు అయితే తెలిసిన ఇన్వెస్టర్‌తో సంయుక్తంగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

పెట్టుబడుల అవకాశాలు



జిరాఫ్ ప్లాట్‌ఫామ్.. ఏడేళ్ల చరిత్ర కలిగిన లాజిస్టిక్స్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ డీల్ ను అందిస్తోంది. కాలవ్యవధి కేవలం 91 రోజులు. దీని ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (ఐఆర్‌ఆర్) 12.25 శాతంగా ఉంది. అంటే రూ.లక్ష ఇన్వెస్ట్ చేస్తే మూడు నెలల్లో రూ.1.03 వేలు లభిస్తాయి. జిరాఫ్ డీల్‌ను లిస్ట్ చేయడానికే పరిమితం కాదు. సదరు పెట్టుబడిని కాల వ్యవధి వరకు పర్యవేక్షిస్తుంటుంది. ఇన్వెస్టర్లకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ఇస్తుంది.

డిఫాల్ట్ అవకాశాలు ఏర్పడితే...

డిఫాల్ట్ (ఎగవేత) అవకాశాలు ఉన్నట్టు భావిస్తే ఇన్వెస్టర్ల తరఫున తనే ఆయా హక్కులను వినియోగించుకుని డీల్స్‌ను క్లోజ్ చేసి, నిధులు రాబడుతుంది. జిరాఫ్ ప్లాట్‌ఫామ్‌పై 30/60 రోజుల కాలవ్యవధితో కూడిన 'ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్' డీల్ కూడా ఉంది. క్రెడ్‌ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో కనీస పెట్టుబడి రూ.3 లక్షలుగా ఉంది. కాల వ్యవధి 30/90 రోజులు. ఇక బెటర్‌ఇన్వెస్ట్ ప్లాట్‌ఫామ్ అయితే ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఆఫర్ చేస్తోంది. సినీ నిర్మాణంలో పెట్టుబడులకు వీలు కల్పిస్తోంది. సినిమా విడుదలైన 60/90 రోజుల తర్వాత నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సినీ నిర్మాణ సంస్థలకు ఆదాయం వస్తుంది. మరి అప్పటి వరకు వాటికి నిధుల అవసరం ఎంతో ఉంటుంది కదా. అందుకుని సినీ నిర్మాణ సంస్థలు ఓటీటీ ద్వారా వచ్చే ఆదాయానికి సంబంధించి ఇన్‌వాయిస్‌లను ఇన్వెస్టర్లకు విక్రయిస్తుంటాయి. ఇక్కడ ఓటీటీ సంస్థలే నేరుగా ఇన్వెస్టర్లకు చెల్లింపులు చేస్తాయి. వీటి వార్షిక రాబడి 12.18 శాతంగా ఉంది. ఆయా అంశాలు అన్నింటిపై నిపుణుల సలహాలు అవసరం.

రిస్కులు ఏమిటంటే..

ఏ పెట్టుబడిలో అయినా రిస్క్ ఉంటుంది. ఈ ఆన్‌లైన్ వేదికలు రాబడి నుంచి పన్ను మేర తగ్గించి ఇన్వెస్టర్లకు చెల్లింపులు చేస్తాయి. ఇక ఇన్వెస్టర్లు తమవైపు నుంచి ఎటువంటి పన్ను చెల్లించక్కర్లేదని అవి చెబుతుంటాయి. కానీ, మిగిలిన ప్లాట్‌ఫామ్‌లకు ఈ విషయంలో స్పష్టత లేదు. కనుక ప్లాట్‌ఫామ్‌లు పన్ను కోత అమలు చేస్తే, ఆ మేరకు టీడీఎస్ అడిగి రిటర్నుల్లో చూపించుకోవడం మంచిది. తక్కువ సందర్భాల్లో పెట్టుబడికి కూడా నష్టం ఏర్పడొచ్చు. కాకపోతే ఆయా పెట్టుబడుల అవకాశాలకు సంబంధించి రిస్కును తాము ముందే విశ్లేషించినట్టు ప్లాట్‌ఫామ్‌లు ఇన్వెస్టర్లకు భరోసానిచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. అదే సమయంలో ఇన్వెస్టర్లకు చెల్లింపులు ఆలస్యం అయినా, ఎగవేతలు ఏర్పడినా, మోసాలు జరిగినా, తప్పుదోవ పట్టించినా బాధ్యత తీసుకోవు. ఇవి కేవలం ఇరువైపుల వర్గాలను కలిపేందుకు, వారికి సేవలు అందించడానికే పరిమితమవుతుంటాయి. దేనికి హామీ ఇవ్వవు. కనుక సంప్రదాయ డెట్ పెట్టుబడి సాధనాలకు ఇవి ప్రత్యామ్నాయం కావు. పీపీఎఫ్‌లో 7%, ఎఫ్‌డీల్లో 6–7% మేర రాబడి వస్తుంది. కానీ, వాటిల్లో హామీ ఉంటుంది. ఇన్‌వాయిస్ ఇన్వెస్టింగ్‌కు ఇటువంటి హామీ ఉండదు. నిధులు ఆశించే సంస్థల పేరు, బ్రాండింగ్ తదితర అంశాల ఆధారంగా రిస్కును కొంత వరకు అర్థం చేసుకోవచ్చు. ఆయా సంస్థలకు సంబంధించి గత చరిత్ర ఆధారంగానూ నిర్ణయం తీసుకోవచ్చు. మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితుల్లో ఊహించని మార్పులు చోటు చేసుకుంటే రిస్క్ ఎదురుకావచ్చు. దీర్ఘకాలానికి ఇన్‌వాయిస్‌లపై రుణాలు తీసుకునే సంస్థల విషయంలో ముందుగానే తగినంత అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే మూడేళ్లకు పైగా కాలంలో ఆయా సంస్థల ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మారిపోయే రిస్క్ ఉంటుంది. మూడు నెలల నుంచి ఏడాదిలోపు ఇన్‌వాయిస్‌లపై రిస్క్ తక్కువగా ఉంటుంది.

ఏసీసీ, అంబుజాకు ఓపెన్ ఆఫర్

- పబ్లిక్ నుంచి 26 శాతం వాటా కొనుగోలు
- ఈ నెల 26– సెప్టెంబర్ 9 మధ్య ఆఫర్
- వచ్చే వారం ప్రకటించనున్న అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ వచ్చే వారం సిమెంట్ రంగ దిగ్గజాల వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించే అవకాశముంది. స్విస్ దిగ్గజం హోల్సిమ్‌కు చెందిన దేశీ లిస్టెడ్ కంపెనీలు అంబుజా సిమెంట్స్, ఏసీసీ లిమిటెడ్‌లో యాజమాన్య వాటా కొనుగోలుకి మే నెలలోనే అదానీ గ్రూప్ ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా రెండు సిమెంట్ దిగ్గజాల వాటాదారుల నుంచి మరో 26 శాతం చొప్పున వాటాలు సొంతం చేసుకునేందుకు ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించనుంది. ఇందుకు రూ. 31,000 కోట్లు వెచ్చించే వీలుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇప్పటికే అదానీ గ్రూప్ ఓపెన్ ఆఫర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంబుజా, ఏసీసీలలో మెజారిటీ వాటా కొనుగోలుకి అదానీ గ్రూప్ రూ. 50,181 కోట్ల విలువైన డీల్ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. మొత్తం 10.5 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయనుంది.

ఆఫర్ ధరలు ఇలా..

ఓపెన్ ఆఫర్ నిర్వాహక సంస్థల తాజా సమాచారం ప్రకారం ఏసీసీ, అంబుజా సిమెంట్ వాటాదారులకు అదానీ గ్రూప్ సంస్థ ఎండీవర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఈ నెల 26 నుంచి ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించనుంది. సెప్టెంబర్ 9న ముగియనున్న ఆఫర్‌లో భాగంగా ఏసీసీ వాటాదారులకు షేరుకి రూ. 2,300, అంబుజా సిమెంట్ వాటాదారులకు షేరుకి రూ. 385 చొప్పున కొనుగోలు చేయనుంది. వెరసి అంబుజా సిమెంట్స్‌కు చెందిన 51.63 కోట్ల షేర్ల కొనుగోలుకి రూ. 19,880 కోట్లవరకూ వెచ్చించనుంది. ఇక ఏసీసీకు చెందిన 4.89 కోట్ల షేర్లను సొంతం చేసుకునేందుకు రూ. 11,260 కోట్లవరకూ ఇన్వెస్ట్ చేయనుంది. అనుబంధ సంస్థల ద్వారా అంబుజాలో 63.19 శాతం, ఏసీసీలో 54.53 శాతం చొప్పున హోల్సిమ్ వాటాలు కలిగి ఉంది. రెండు సంస్థల ప్రస్తుత స్థాపిత సామర్థ్యం వార్షికంగా 7 కోట్ల టన్నులు. దేశవ్యాప్తంగా 23 సిమెంట్ ప్లాంట్లు, 14 గ్రైండింగ్ స్టేషన్లు, 80 రెడీమిక్స్ యూనిట్లను కలిగి ఉన్నాయి.

డెట్ ఫండ్స్‌కు అమ్మకాల సెగ

జూన్ క్వార్టర్‌లో రూ.70,213 కోట్లు ఉపసంహరణ



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లు డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి జూన్ త్రైమాసికంలో రూ.70,213 కోట్లను ఉపసంహరించుకున్నారు. అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెరుగుదల ఇందుకు దారితీసింది. ''సెప్టెంబర్ త్రైమాసికంలో ద్రవ్య పరిస్థితులు ఇంకా కఠినతరం అవుతాయి. దీంతో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు మరికొంత తగ్గొచ్చు''అని ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ తెలిపారు. జూన్ చివరికి డెట్ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు 5 శాతం తగ్గి రూ.12.35 లక్షల కోట్లుగా ఉన్నాయి. మార్చి క్వార్టర్ చివరికి ఇవి రూ.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2021-22 మొదటి త్రైమాసికం నాటికి రూ.14.16 లక్షల కోట్లు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-8-2022	
విశాఖ	435-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	66.00
21-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	408-00
వరంగల్	410-00
రిటైల్ ధర	4.70

స్టాక్స్ వ్యూ

సిటీ యూనియన్ బ్యాంక్ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 176 టార్గెట్: రూ. 222



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో అంచనాలను మించిన పనితీరు చూపింది. విలువ మినహాయించిన(రిటినాఫ్) ఖాతాల నుంచి అధిక రికవరీలు, ట్రెజరీ నష్టాలులేకపోవడం, అంచనాలకంటే తగ్గిన క్రెడిట్ వ్యయాలు(వార్షికంగా 1.6 శాతం) ఇందుకు దోహదం చేశాయి. అయితే స్లిప్పేజీలు(2.9 శాతం) పెరిగినప్పటికీ రికవరీలు, అప్‌గ్రేడ్‌లు పుంజుకోవడం ఫలితాల మెరుగుకు సహకరించింది. వెరసి స్థూల మొండిబకాయిలు(జీఎన్‌పీఏలు) 4.7 శాతానికి చేరగా, నికర ఎన్‌పీఏలు 2.89 శాతంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బ్యాంక్ యాజమాన్యం అధిక రికవరీలపట్ల ఆశావహంగా స్పందిస్తోంది. ఇది క్రెడిట్ వ్యయాలు తగ్గేందుకు తోడ్పాటును ఇవ్వనుండటంతో 15–18 శాతం రుణ వృద్ధిని అంచనా వేస్తోంది. ఇందుకు సానుకూలంగా మారిన ఆర్థిక వాతావరణం ప్రభావం చూపుతుందని ఆశిస్తోంది. క్యూ1లో 13 శాతంపైగా రుణ వృద్ధి నమోదుకావడంతో నికర వడ్డీ ఆదాయం 17 శాతం ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 6 బేసిస్ పాయింట్లు బలపడి 4 శాతాన్ని తాకాయి. 37 శాతం జంప్‌చేసిన పసిడి రుణాలు, కార్పొరేట్ విభాగం ప్రధానంగా లోన్ గ్రోత్‌కు దన్నునిచ్చాయి. పోటీ తీవ్రమవుతున్నప్పటికీ బ్యాంక్‌కు పట్టున్న ఎంఎస్‌ఎంఈ బిజినెస్‌లో పటిష్ట వృద్ధిని సాధించగలదని అంచనా.

ఆప్టస్ వేల్యూ హౌసింగ్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 310 టార్గెట్: రూ. 350



ఎందుకంటే: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. ఆప్టస్ వేల్యూ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో అన్ని విభాగాల్లోనూ పటిష్ట పనితీరు ప్రదర్శించింది. అయితే త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(జీఎన్‌పీఏలు) 0.56 శాతం పెరగడం ఒక్కటే ఆందోళనకర అంశం. రుణ విడుదల వార్షికంగా 113 శాతం దూసుకెళ్లడంతో నిర్వహణలోని ఆస్తులు(రుణాలు) 30 శాతం వృద్ధి చూపాయి. స్వయంఉపాధి విభాగంలోగల భారీ అవకాశాల పట్ల కంపెనీ యాజమాన్యం ఆశావహంగా స్పందిస్తోంది. ప్రధానంగా కంపెనీకి పట్టున్న టైర్–3, టైర్–4 మార్కెట్ల(చిన్న పట్టణాలు)లో అధిక వృద్ధిని అంచనా వేస్తోంది. దీంతో లోన్‌బుక్ నిలకడ ప్రాతిపదికన 25–30 శాతం స్థాయిలో పుంజుకోగలదని భావిస్తోంది. రానున్న రెండేళ్లలో లోన్‌బుక్ 26 శాతం వృద్ధిని అందుకునే వీలుంది. క్యూ1లో అంచనాలను మించుతూ నికర వడ్డీ ఆదాయం వార్షికంగా 45 శాతం జంప్‌చేసి రూ. 179 కోట్లకు చేరింది. టెక్నాలజీ, డిజిటల్ అంశాలపై ఇన్వెస్ట్ చేస్తున్నప్పటికీ నిర్వహణా వ్యయాలను సమర్థవంతంగా నియంత్రించుకుంటోంది. భారీ అవకాశాలున్న రంగంలో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ పటిష్ట వ్యయ నియంత్రణతో పరిశ్రమలోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. దీంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరుకి ప్రీమియం విలువ లభిస్తోంది.

గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

యూపీఐ సేవలపై చార్జీల యోచనేదీ లేదు

కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఏకీకృత చెల్లింపుల విధానంలో (యూపీఐ) లావాదేవీలపై చార్జీలు విధించే యోచనేదీ లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. యూపీఐ అనేది ప్రజలకు మేలు చేకూర్చేందుకు ఉద్దేశించిన డిజిటల్ ప్రయత్నం మాత్రమేనని పేర్కొంది. సర్వీస్ ప్రొవైడర్లు ఇతరత్రా మార్గాల ద్వారా తమ ఖర్చులను రాబట్టుకోవాల్సి ఉంటుందని మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో తెలిపింది. డిజిటల్ చెల్లింపులు, పేమెంట్ ప్లాట్‌ఫాంలను ప్రోత్సహించడం కోసం డిజిటల్ పేమెంట్ వ్యవస్థకు ప్రభుత్వం గతేడాది ఆర్థిక సహకారం అందించిందని, ఈ ఏడాది కూడా దాన్ని కొనసాగిస్తామని ప్రకటించిందని ఆర్థిక శాఖ వివరించింది. ఐఎంపీఎస్ తరహాలోనే యూపీఐ కూడా నిధుల బదలాయింపు వ్యవస్థ కాబట్టి ఈ విధానంలోనూ చార్జీలను వర్తింపచేసే అంశంపై రిజర్వ్ బ్యాంక్ చర్చాపత్రం విడుదల చేసిన నేపథ్యంలో ఆర్థిక శాఖ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

రేటింగ్ తగ్గింది.. వైదొలగాలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తున్న ఓ మ్యూచువల్ ఫండ్ పథకం స్టార్ రేటింగ్ 4 ఉండేది కాస్తా, 3కు తగ్గింది. అందుకుని ఈ పెట్టుబడులను విక్రయించేసి, తిరిగి 4 స్టార్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. అయితే ఈ మొత్తం ఒకే విడత చేయాలా..? లేక సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ (ఎస్‌డబ్ల్యూపీ) రూపంలో చేసుకోవాలా?

– రాజ్‌దీప్ సింగ్

ముందుగా ఓ పథకం నుంచి వైదొలిగేందుకు స్టార్ రేటింగ్‌ను 4 నుంచి 3కు తగ్గించడం ఒకే కారణంగా ఉండకూడదు. 3 స్టార్ అంటే చెత్త పనితీరుకు నిదర్శనం కానే కాదు. ఎందుకంటే 3 స్టార్ రేటింగ్ కలిగిన చాలా పథకాలు ఆయా విభాగాల్లోని సగటు పనితీరుకు మించి రాబడులను ఇస్తున్నాయి. అందుకుని ముందు మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి ఎందుకు వైదొలుగుతున్నదీ సూక్ష్మంగా విశ్లేషించుకోవాలన్నది నా సూచన. ఆ తర్వాతే ఒకే విడతగానా లేదంటే ఎస్‌డబ్ల్యూపీ రూపంలోనా అన్న అంశానికి రావాలి. ఒక్కసారి ఒక పథకంలో పెట్టుబడులు కొనసాగించకూడదని, వైదొలగాలని నిర్ణయించుకున్న తర్వాత ఇక ఎస్‌డబ్ల్యూపీ ఆలోచనే అక్కర్లేదు. కాకపోతే ఎగ్జిట్‌లోడ్, మూలధన లాభాల అంశాలను దృష్టిలో పెట్టుకుని సిస్టమ్యాటిక్‌గా వైదొలగాలా? లేదా? అన్నది నిర్ణయించుకోండి. రెండు మూడు విడతలుగా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనది. ముందుగా ఎగ్జిట్ లోడ్ లేని, దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు పన్ను లేని మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఈ విధంగా పన్ను ఆదా అవుతుంది.

నేను సిప్ రూపంలో ఈక్విటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇందుకు వారం/నెలవారీ సిప్‌లలో ఏది ఎంపిక చేసుకోవాలి?

– అమర్ సహాని

వీక్లీ సిప్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్‌మెంట్‌ను మరింత క్లిష్టం చేసుకోవడం ఎందుకు? అన్నది నా అభిప్రాయం. దీనివల్ల నెలలో నాలుగు సార్లు పెట్టుబడులు పెట్టుకున్నట్టు అవుతుంది. దీని కారణంగా మీ ఖాతాలో లావాదేవీల సంఖ్య చాంతాడంత ఉంటుంది. దీన్ని పరిశీలించుకోవడం కూడా ఇబ్బందికరమే. మూలధన లాభాల విషయాన్ని పరిశీలించినా లావాదేవీలు భిన్న ఎన్‌ఏవీలతో ఉంటాయి. తిరిగి వీటిని వెనక్కి తీసుకునే సమయంలో మూలధన లాభాల పన్ను లెక్కించడం కూడా క్లిష్టంగా మారుతుంది. తక్కువ మొత్తంతో ఎందుకు అంత తరచుగా సిప్ అమలు చేయాలి? అని ఒకసారి ప్రశ్నించుకోండి. దీనికి బదులు మేము అయితే నెలవారీ సిప్‌నే ఇన్వెస్టర్లకు సూచిస్తుంటాం. ఇన్వెస్టర్ల నగదు ప్రవాహ కాలాలకు (నెలవారీ ఆదాయం) అనుగుణంగా ఉంటుంది. మన ఆదాయం నెలవారీగా వస్తుంటుంది. అందుకనే నెలవారీగా ఇన్వెస్ట్ చేసుకోవడం సముచితం. కనుక గతం నుంచి అమల్లో ఉన్న నెలవారీ సిప్‌కు వెళ్లమనే నా సూచన.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.



MARUTI SUZUKI ARENA
– ప్రవేశపెడుతున్నాం –
సరికొత్త
ALTO
K10
ఇండియా
పరుగు తీస్తుంది
ALTO
K10
ఇంధన సామర్థ్యం
24.90# km/l
ఆధునిక K-సీరీస్
1.0L డ్యూయల్ జెట్,
డ్యూయల్ వీవీటీ ఇంజన్
ఆటో గేర్ షిఫ్ట్ టెక్నాలజీ
స్మార్ట్ ప్లే స్టూడియో
ఉత్సాహవంతమైన మరియు
విశాలమైన కేబిన్
15+ భద్రతా ఫీచర్స్
డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్స్‌తో కలిపి^
ALTO
K10